ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 115 పేజీలు: 10+4 వెల: 6.50

**సుంకాలు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టం** 5లో

**ట్రక్కు ప్రమాదంలో 15 మంది దుర్మరణం**



సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మునుంచి పద్మవిభూషణ్ పురస్కారం ధర్మేంద్ర తరఫున అందుకుంటున్న హేమమాలిని, డా. శ్రీమతి రాజం, పద్మశ్రీ పురస్కారాలు అందుకుంటున్న డా. వెంపటి కుటుంబ శాస్త్రి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ తరఫున ఆయన తనయుడు

# వికసించిన 'పద్మా'లు

## తొలివిడతగా 66 మందికి ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**పద్మవిభూషణ్:** దివంగత నటుడు ధర్మేంద్ర (గ్రహీత హేమమాలిని), వయొలిన్ విద్వాంసురాలు డా. శ్రీమతి ఎన్. రాజం **పద్మభూషణ్:** డా. ఆర్. గణేశ్, భగత్ సింగ్ కోష్యారి, ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, ప్రొ. విజయ్ కుమార్ మల్హోత్రా, డా. కళ్లిపట్టి రామస్వామి, పీయూష్ పాండే **పద్మశ్రీ:** డా. వెంపటి కుటుంబ శాస్త్రి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), హార్మన్ ప్రీత్ కౌర్, డా. గూడూరు వెంకట్రావు, దీపికా రెడ్డి, డా. ఎస్. జి. సుశీలమ్మ సహా 58 మందికి ప్రదానం

**న్యూఢిల్లీ, మే 25:** కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా ప్రధానంచేసే పద్మా అవార్డుల కార్యక్రమం రాష్ట్రపతిభవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పద్మ పురస్కారాలప్రధానం జరిగింది. బాలివుడ్‌నటుడు ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్‌రాగా ఈ పురస్కారం ఆయన సతీమణి ఎంపి హేమమాలిని అందుకున్నారు. కళారంగంలో పద్మవిభూషణ్‌ను ప్రముఖ వయోలిన్ విద్వాసురాలు ఎన్‌రాజమ్ అందుకుంటే రాజకీయాలపరంగా ప్రజాజీవితనుంచి మాజీఉత్తరాఖండ్ సిఎం భగత్‌సింగ్ కోశ్యారి, వైద్యరంగంనుంచి గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కళ్లిపట్టి రామస్వామి పళనిస్వామి, కోటక్‌మహీంద్ర బ్యాంకు వ్యవస్థాపకులు ఉదయ్ సురేష్ కుమార్ కోటక్ మహిళా క్రికెట్ జట్టు >>2

# పంచాయతీలకు రూ. 9,968 కోట్లు

## ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలని షరతు

**జీతాలు, పింఛన్లకు చెల్లించొద్దని ఆదేశం** 3లో

# మహిళాశక్తి మహోన్నతం

**ఒకే రోజు 8 వేల ఇందిరా స్త్రీశక్తి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన**

**త్వరలో మహిళలకు కార్పొరేట్ సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, రైస్ మిల్లులు**

సచివాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్

**మహిళలకు ఇందిరమ్మ చీరెల అందజేత**



సోమవారం సచివాలయంలో ఇందిరా స్త్రీశక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే25:** 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 'మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుంది, కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుంది, గ్రామం బలపడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది' అని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందని, వడ్డీ లేని రుణాలకు ఇప్పటికే రూ.1,390 కోట్లను చెల్లించిందన్నారు. మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు. వాటికి అవసరమైన చోట భూములను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి సిద్ధమని అన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలని సిఎం అన్నారు. సంఘాలే వడ్లు కొనుగోలు చేసి, బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారులుగా ఉంటారని, వారి చేతుల్లోకి ఈవ్యవస్థవెళ్తే పారదర్శకత, బాధ్యత మరింత >>2

**కేంద్రం సహకరించకున్నా ధాన్యం కొనుగోలు: సిఎం** 7లో




# నాలుగోసారి పెట్రోషాక్

**పెట్రోలుపై రూ. 2.84, డీజిల్‌పై రూ. 2.86 పెంపు**

| నగరం | పెట్రోలు | డీజిల్ |
|---|---|---|
| హైదరాబాద్ : | రూ.115.58 | రూ. 103.74 |
| విజయవాడ : | రూ. 117.19 | రూ.104.88 |
| చెన్నై : | రూ. 107.77 | రూ. 99.55 |

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చమురు సంస్థలు మరోసారి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదొడుకుల నెపంతో సామాన్యుడి నడ్డి విరిచేలా ఇంధన ధరలను మరోసారి భారీగా పెంచేశాయి. గత పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం ఇది నాలుగో సారి కావడం గమనార్హం. వరుస పెంపులతో ఇప్పటికే ఇబ్బంది పడుతున్న వాహన దారులపై ఈ తాజా నిర్ణయం మరింత భారంగా మారనుంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు శరవేగంగా రేట్లను సవరిస్తూ ఈ తాజా వాత పెట్టాయి. సోమవారం ప్రకటించిన ఇందన సవరణల ప్రకారం లీటర్ పెట్రోల్‌పై రూ.2.84 పెంచగా, లీటర్ డీజిల్‌పై >>2



# గుణపాఠం నేర్చుకోరా?

## 'నీట్' లీక్‌పై సుప్రీం ఆగ్రహం

**కేంద్రం, ఎన్‌టిఎకు నోటీసులు**

**న్యూఢిల్లీ, మే 25:** నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, నీట్‌యుజి 2026 పరీక్ష నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు కోరుతూ, తక్షణమే కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానానికి మారాలని డిమాండ్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ), ఇతర అధికారులకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం, పిటిషన్ల కాపీలను కేంద్రంలో రెండవ అత్యున్నత న్యాయాధికారి అయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు అందజేయాలని ఆదేశించి, తదుపరి విచారణ కోసం ఈ విషయాన్ని శుక్రవారం (మే >>2



# వడగాడ్పులు మరింత అధికం

**• పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ • రోజూ పదుల సంఖ్యలో వడదెబ్బ మృతులు • రాత్రుళ్లు సైతం వెచ్చని గాలులే**

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. తీవ్రమైన ఎండలతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. మండే ఎండలకు తోడు వడగాల్పులు వీస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న నాలుగు రోజులపాటు అతితీవ్ర స్థాయిలో వడగాల్పులు వీస్తాయని వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారి చేసింది. వడగాల్పుల తీవ్రతపై మొదటిసారిగా రెడ్ అలెర్ట్ జారి కావడం గమనార్హం. రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలతోపాటు అతి తీవ్ర వడగాల్పులు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వీస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారి చేసింది. మరో ఎనిమిది జిల్లాలు కుమురంభీం ఆసీఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ ను జారిచేసింది. అదేవిధంగా నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, జనగామ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారి చేసింది.సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 20 జిల్లాల్లో 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యధికంగా కుమరం భీం జిల్లా దహేగాం మండలం కుంచవల్లిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతనమోదైంది. మంచిర్యాల, సూర్యాపేట జిల్లాల్లో 46.4 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, నల్గొండ జిల్లాల్లో 46.3డిగ్రీలు, హన్మకొండ, పెద్దపల్లిలో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్ జిల్లాల్లో 45.9 డిగ్రీలు, వరంగల్‌లో 45.8 డిగ్రీలు, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో 45.7 డిగ్రీలు, యాదాద్రి భువనగిరిలో 45.6 డిగ్రీలు, సిద్దిపేట, జనగామ ,రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

| |
|---|
| కుమరం భీం జిల్లా దహేగాం: $46.5^0$ |
| మంచిర్యాల, సూర్యాపేట : $46.4^0$ |
| భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ : $46.3^0$ |

**వడదెబ్బతో పిట్టల్లా రాలుతున్న జనం...**

గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరాయి. తీవ్రమైన వడగాడ్పులు, ఎండ తీవ్రతను తట్టుకోలేక పెద్ద సంఖ్యలో >>2



సోమవారం ఆగ్రా లోని తాజ్‌మహల్‌ను సందర్శించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో దంపతులు - '2'లో

# ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్ మళ్లీ మెలిక

## హార్ముజ్ దిగ్బంధనం కొనసాగింపు!

**వాషింగ్టన్, మే 25:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి చర్చలపై మరోసారి అస్పష్ట వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందం దాదాపు పూర్తయిందని ఆదివారం ప్రకటించిన ఆయన, తాజాగా ఆ మాటకు భిన్నంగా మాట్లాడారు. ఒప్పందం ఇంకా చర్చల దశలోనే ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్‌లో ఓ పోస్ట్ చేశారు. చర్చలు సక్రమంగానే సాగుతున్నాయి. కానీ ఒప్పందం విషయంలో తొందరపడబోము. చర్చలకు తగినంత సమయం తీసుకోవాలని మా అధికారులకు సూచించాను అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ ఓ కొలిక్కి వచ్చేంత వరకు >>2

# పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ తగ్గించండి

## మాజీమంత్రి హరీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే25:** కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో చోద్యం చూడటం మానేసి, వెంటనే రాష్ట్ర వ్యాట్ తగ్గించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసారు. పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి, రాష్ట్ర పన్నులు తగ్గించాలి అని నాడు పిసిసి హోదాలో ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఎందుకు వ్యాట్ తగ్గించడం లేదని ప్రశ్నించారు.

ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాటలు దంచుడు కాదు, దమ్ముంటే మాట మీద నిలబడి పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ >>2

# మళ్లీ ఆల్మట్టి రగడ!

## డ్యామ్ ఎత్తు పెంపుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం

**న్యాయ పోరాటానికి సిద్ధం**

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కృష్ణా నది నీళ్ల పంచాయితీ మళ్లీ ముదిరింది. ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉండగా దిగువ రాష్ట్రమైన తెలంగాణ అప్రమత్తమైంది. కృష్ణా నదిపై ఉన్న ఆలమట్టి డ్యామ్ ఎత్తును ప్రస్తుతమున్న 519.6 మీటర్ల నుండి 524.25 మీటర్లకు పెంచాలని కర్ణాటక ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ముంపునకు గురయ్యే భూముల సేకరణకు దాదాపు రూ. 70 వేల కోట్లు కేటాయిస్తూ గతంలోనే నిర్ణయం తీసుకుంది. అయితే దీనిపై సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ కర్ణాటక ముందడుగు వేయడంపై తెలంగాణ మొదటి నుంచీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆలమట్టి ఎత్తు పెంచి పైనే నీటిని నిలిపివేస్తే కృష్ణా నదిపై ఆధారపడ్డ తెలంగాణ ప్రాజెక్టులకు (పాలమూరురంగారెడ్డి, డిండి, ఎస్ఎల్బీసీ, నాగార్జున సాగర్) నీరందడం చాలా కష్టం కానుంది. సుప్రీంకోర్టు స్టే ఆర్డర్ ఉండగా ఎత్తు పెంచే ప్రయత్నాలు చేయడం సరికాదని, దీనివల్ల తెలంగాణ వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని తెలంగాణ రాష్ట్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణ నీటి హక్కుల విషయంలో తాము ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని, అవసరమైతే సుప్రీంకోర్టులో న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఎగువ కృష్ణా ప్రాజెక్టు (ఫేజ్3) కింద తమ రాష్ట్ర పరిధిలోని సాగునీటి అవసరాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించాలనే ఉద్దేశం తమకు లేదని కర్ణాటక స్పష్టం చేస్తోంది. కేంద్ర జలశక్తి శాఖతో పాటు కృష్ణాబోర్డు (కెఆర్ఎంబి) ముందు ఇప్పటికే తెలంగాణ >>2

# మెట్రోకు రూ.13,600 కోట్లు



సోమవారం న్యూఢిల్లీలో ఐఆర్‌ఎఫ్‌సి, ఎల్ అండ్ టి మెట్రోరైల్, హెచ్‌ఎమ్‌ఆర్‌ఎల్ మధ్య ఒప్పందం కుదిరిన దృశ్యం

## ఫేజ్-1 టేకోవర్‌కు రీఫైనాన్సింగ్

**రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో ఒప్పందం**

**ట్రాఫిక్ రద్దీ తగ్గించడంలో మెట్రో కీలకపాత్ర**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే25:** హైదరాబాద్ నగర పట్టణ రవాణా మౌలిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌ఎఫ్‌సి) ద్వారా రూ.13,600 కోట్ల వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ పొందింది. ఢిల్లీలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఒప్పందం పై ఐఆర్‌ఎఫ్‌సి, ఎల్ అండ్ టి మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్, హెచ్‌ఎమ్‌ఆర్‌ఎల్‌ల మధ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సి సిఎండి అండ్ సిఇఒ మనోజ్ కుమార్ దుబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజానుకూల ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందన్నారు. దేశ ఆర్థిక వృద్ధికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, నగర వేగవంతమైన అభివృద్ధికి అనుగుణంగా మెట్రో కనెక్టివిటీ విస్తరణ అత్యంత అవసరమని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో మెట్రో కీలకపాత్ర పోషిస్తోందన్నారు.రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని, దీని వల్ల ప్రాజెక్టు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుందని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ప్రస్తుత >>2

# గుణపాఠం నేర్చుకోరా?

>>29)కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా, నీట్ యుజి 2024 చుట్టూ ఉన్న వివాదం, దాని తర్వాత మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులు ఉన్నప్పటికీ, పరీక్ష సమగ్రతపై ఆందోళనలు మళ్లీ తలెత్తాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. "వారు గుణపాఠం నేర్చుకోకపోవడం విచారకరం" అని జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. 2024 వివాదం తర్వాత, అప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేయడం, దాని సిఫార్సులను ఆమోదించడం, ఒక పర్యవేక్షణ యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో, 2024 నవంబర్ 14న ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీ సిఫార్సుల అమలుకు సంబంధించిన ప్రస్తుత స్థితిని, దాని పనితీరు వివరాలతో సహా స్పష్టం చేస్తూ ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌టిఎను ఆదేశించింది. కమిటీ సిఫార్సుల అమలును నిర్ధారించడానికి తీసుకున్న చర్యలను, అలాగే సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాలను పాటించడాన్ని తెలియజేస్తూ ఒక ప్రత్యేక అఫిడవిట్ సమర్పించాలని ఆ ఉన్నత స్థాయి కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ కె. రాధాకృష్ణన్‌ను కూడా కోరింది. నీట్ యుజి పరీక్ష నిర్వహణలో జవాబుదారీతనం, వ్యవస్థాగత సంస్కరణలు కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ దాఖలు చేసిన పిటిషన్లతో సహా పలు పిటిషన్లపై ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# మెట్రోకు రూ.13,600 కోట్లు

>> రుణ భారం తగ్గడంతో పాటు భవిష్యత్ మెట్రో విస్తరణ ప్రణాళికలకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సి, ఎల్ అండ్ టి బృందం, హెచ్‌ఎంఆర్‌ఎల్, సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) ప్రతినిధి కెవిబి రెడ్డి, సీఎఫ్‌వో ఎ.వి.ఆర్. శ్రీనివాస శర్మతో పాటు ఐఆర్‌ఎఫ్‌సి, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లార్సెన్ అండ్ టుబ్రో లిమిటెడ్ నుంచి ఎల్ అండ్ టి మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్‌లోని 100శాతం వాటాను హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్)ద్వారా తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అనంతరం ఈ రీఫైనాన్సింగ్ అమలులోకి వచ్చింది. దీంతో హైదరాబాద్ మెట్రో పూర్తిస్థాయి ప్రభుత్వ యాజమాన్యంలోని వ్యూహాత్మక ప్రజా రవాణా ఆస్తిగా మారింది. రూ.13,600 కోట్ల ఈ సౌకర్యాన్ని ప్రస్తుత రుణబాధ్యతలైన నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్‌కు వినియోగించనున్నారు. దీని ద్వారా ప్రస్తుత రుణదాతలకు క్రమబద్ధమైన ఎగ్జిట్ లభించడంతో పాటు ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వం గణనీయంగా మెరుగుపడనుంది. ఈ రుణాన్ని 20 సంవత్సరాల కాలపరిమితితో, త్రైమాసిక చెల్లింపుల విధానంలోరూపొందించారు. అధికవడ్డీ రుణాలను తక్కువవ్యయంతోకూడిన దీర్ఘకాలిక రూపాయిఫైనాన్సింగ్‌తో భర్తీ చేస్తున్నారు.

# తాజ్‌మహాల్‌ను సందర్శించిన మార్కో రుబియో దంపతులు

**ఆగ్రా, మే 25:** భారతదేశ పర్యటనలో భాగంగా మూడో రోజు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సోమవారం ఆగ్రాలోని చారిత్రిక కట్టడం తాజ్ మహల్‌ను తన భార్య జీనెట్ రూబియోతో కలిసి సందర్శించారు. ఆ కట్టడాన్ని ప్రపంచ సంపదలలో ఒకటిగా కొనియాడారు. వారు తాజ్ మహల్ వద్ద సుమారు గంటన్నర సేపుగడిపారు. సందర్శకుల పుస్తకంలో ప్రపంచపు నిజమైన సంపదలలో ఒకటైన తాజ్ మహల్‌ను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలని రాశారు. ఈపర్యటనలో భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా వారితో పాటు ఉన్నారు. కాగా, ప్రపంచంలోని ఏడు అద్భుతాలలో ఒకటైన తాజ్ మహల్ ఇండియాను సందర్శించే ఉన్నత స్థాయి ప్రపంచ నాయకులను, ప్రముఖులను నిత్యం ఆకర్షిస్తూనే ఉంది. గత సంవత్సరం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషా వాన్స్, వారి పిల్లలు వివేక్, మిరాబెల్, ఇవాన్‌లతో కలిసి ఈ కట్టడాన్ని సందర్శించిన విషయం తెసిందే. మే 23 నుంచి మే 26 వరకు జరిగే ఈపర్యటనలో మార్కో రూబియో భారత్ -అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సహకారం, క్వాడ్ సమావేశాలపై భారతనాయకులతో చర్చలు జరపను న్నారు. ఇంధన సరఫరాలు, వాణిజ్యం, రక్షణ రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని గతంలోనే ఆయన స్పష్టం చేశారు.

# వడగాడ్పులు మరింత అధికం

>> ప్రజలు వడదెబ్బ బారిన పడుతున్నారు. నిత్యం రాష్ట్రంలో వడదెబ్బ మరణాలు సంభవిస్తున్నాయి. వడదెబ్బ కారణంగా కేవలం ఒక్క ఆదివారం రోజునే రాష్ట్ర వ్యాప్తంగా 58 మంది మృతి చెందారు. మొత్తంగా గత మూడు రోజుల వ్యవధిలోనే 144 మంది మృత్యువాత పడ్డారు. వడదెబ్బ మరణాల్లో అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఉన్నారు. ఈ జిల్లాలో కేవలం ఒక్క రోజే 20 మంది ఎండ దెబ్బతో చనిపోయారు. ఆ తర్వాత కరీంనగర్ జిల్లాలో 16 మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐదుగురు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు, సిద్దిపేట జిల్లాలో ఇద్దరు చొప్పున వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది వృద్ధులు, ఉపాధి హామీ కూలీలు, రైతులు ఉన్నారు. సోమవారం వడదెబ్బతో వరంగల్ నగరం పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం గ్రామంలో అంకేశ్వరపు సమ్మక్క అనే వృద్ధురాలు వడదెబ్బతో మృతిచెందింది.

**రాత్రిళ్లూ తీవ్రమైన వేడి...**

పగలు మాత్రమే కాకుండా రాత్రిళ్లు కూడా వేడి వాతావరణం ఉంటుందని, ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వేడి రాత్రులు ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

**జాగ్రత్తలు తప్పనిసరి...**

మరికొన్ని రోజులు రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగాలని తెలిపారు.

# ట్రంప్ మళ్లీ మెలిక

>> హార్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అణు కార్యక్రమం, యురేనియం నిల్వలు, ఆంక్షల ఎత్తివేత వంటి ప్రధాన అంశాలపై ఇరు దేశాల మధ్య ఇంకా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ తాజా ప్రకటనతో ముడి చమురు రవాణా సాధారణ స్థితికి రావడం ఇప్పట్లో సాధ్యం కాదని తేలిపోయింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి పర్షియన్ గల్ఫ్ లో దాదాపు 2వేల నౌకలు చిక్కుకుపోయాయి. ఒకవేళ హార్మూజ్ జలసంధిని తెరిచినా, ఆ ప్రాంతంలో అమర్చిన సీమైన్స్‌ను తొలగించడం, షిప్పింగ్ సంస్థలకు భద్రతపై నమ్మకం కలగడం వంటి అంశాల కారణంగా నౌకాయానం సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది.

# రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు దుర్మరణం

**మునగాల ,మే 25, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురు దుర్మరం పాలైన సంఘటన మండల పరిధిలోని మొద్దులచెరువు స్టేజి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కీత రాజయ్య ( 57) కూతురు గీత సునీత (40) లు బ్యాంకు పనిపై మునగాల వచ్చి తిరిగి ఎక్సెల్ వాహనంపై వెంకట్రాపురం వెళ్తున్న క్రమంలో వెనుక నుండి కారు ఢీకొట్టడంతో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు.

# వికసించిన 'పద్మా'లు

సారధి హర్మన్‌ప్రీత్‌కౌర్ తదితరులు ఈప్రతిష్టాత్మక పౌరపురస్కారాలు అందుకున్నారు. తొలివిడతగా సోమవారం 66 మందికి అందచేసారు. మిగిలిన అవార్డువిజేతలకు రెండోవిడతలో అందిస్తారు. రాష్ట్రపతిభవన్‌లో ఘనంగాజరిగిన ఈకార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, కుమారస్వామి, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు హాజరయ్యారు. అలాగే ప్రకటనలరంగంలో విశిష్టస్థానం పొందిన పియూష్ పాండేకు పద్మభూషన్ పురస్కారాన్ని ఆయన తరపున ఆయన కుటుంబసభ్యులు స్వీకరించారు.

**ఇద్దరికి పద్మవిభూషణ్..ఆరుగురికి పద్మభూషణ్ పురస్కారాలు**

అవార్డులు పొందిన విజేతల్లో పద్మవిభూషణ్ పురస్కారం బాలివుడ్ దివంగత నటుడు ధర్మేంద్ర డియోల్, వయోలిన్ విద్వాంసురాలు డా.శ్రీమతి ఎన్‌రాజమ్‌లు అందుకోగా పద్మభూషణ్ పురస్కారాలు ఆరుగురికి అందించారు. వీరిలో శతావధాని డా.ఆర్‌గణేశ్, ఉత్తరాఖండ్ మాజీ సీఎం భగత్‌సింగ్ కోష్యారి, కోటక్ బ్యాంకు వ్యవస్థాపకులు ఉదయ్ సురేష్‌కుమార్‌కోటక్, మరణానంతరం ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌మల్హోత్రా, వైద్యరంగంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.కళ్లిపట్టి రామస్వామి పళనిస్వామి, వ్యాపార ప్రకటనల రంగంలో పితామహుడుగా వెలుగొందిన పియూష్ పాండేలకు పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. పాండేకు మరణానంతర పురస్కారం కావడంతో ఆయన కుటుంబీకులు ఈ అవార్డుస్వీకరించారు.

**పద్మ అవార్డు గ్రహీతలు...**

ఇక పద్మపురస్కారాలపరంగాచూస్తే బిశ్వబంధు(మరణానంతరం), భరత్‌సింగ్ భారతి, తగారామ్‌భీల్, క్రికెట్‌నుంచి హర్మన్‌ప్రీత్ కౌర్, శ్రీ రాతిలాల్ మోహన్‌లాల్ బోరిసాగర్, కుమార్‌బోస్, జనార్ధన్ బాపూరావ్ భోధే, స్వామి



రాష్ట్రపతి ముర్మునుండి పద్మభూషణ్ పురస్కారం అందుకుంటున్న ఆర్. గణేష్, మల్హోత్రా, పీయూష్‌పాండే తరపున కుమార్తె, పద్మశ్రీలు అందుకుంటున్న దీపికా రెడ్డి, డా.గూడూరు వెంకట్రావ్

బ్రహ్మదేవ్, ప్రొసేన్‌జీత్ ఛటర్జీ, దేవికా అమ్మజీ, డాక్టర్ రామచంద్ర గోడ్‌బోలే, సునీతా గెటడ్‌బోలే, తేచీ గుబిన్, డా.హెచ్‌వి హండే, గఫ్రుద్దీన్ మేవాటి జోగి, మీర్‌హాజి కసమ్, రఘువీర్‌ఖేడ్‌కర్, ఆర్.కృష్ణ కిటనా(మరణానంతరం), ప్రొఫెసర్ డా.లార్స్ క్రిస్టియన్‌కోచ్, ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్; కె.విజయ్‌కుమార్; శ్రీరంగ్ దేవ్‌బా లాడ్, అంకేగౌడ ఎం, ప్రొఫెసర్ సరోజ్ మండల్, ప్రొఫెసర్ బుద్ధరష్మి మణి, నిలేష్ వినోద్‌చంద్ర మాండ్లేవాలా, డా.మహేంద్రకుమార్ మిశ్రా, తృప్తి ముఖర్జీ, హరిమాధవ్ ముఖోపాధ్యాయ్(మరణానంతరం), డాక్టర్ ఎఇ ముథునాయగమ్, సత్య నారాయణ్ నందలాల్‌నువాల్, కె.పజనివేల్, ధార్మికలాల్ చునిలాల్ పాండ్యా, కైలాశ్‌చంద్రపంత్, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (మరణానంతరం), ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డా.గూడూరు వెంకట్రావు, దీపికారెడ్డి, డాక్టర్ పాల్గొండ విజయ్ ఆనంద్‌రెడ్డి, హరిచరణ్‌సైకియా, ప్రొఫెసర్ వెంపటి కుటుంబ శాస్త్రి, ప్రొఫెసర్ షఫీ షౌవుఖ్, బల్‌దేవ్‌సింగ్, యమ్నం జాత్రా సింగ్ (మరణనాంతరం), డా.అశోక్‌కుమార్‌సింగ్, శివవంకరి, డా.ఆర్‌శ్రీధర్, ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ ఎస్‌జి సుశీలమ్మ, ఎన్.స్వామినాథన్, డా.కేవాల్‌కృష్ణన్ థక్రాల్, గోపాల్‌జీ త్రివేది (మరణానంతరం), అరవింద్ వైద్య, ప్రొఫెసర్ జుజేర్ వాసి, డా.నారాయణ్ వ్యాస్, హేలీ వార్, ప్రొ.గంభీర్‌సింగ్ యోంజోన్‌లకు పద్మపురస్కారాలనప్రధానంచేసారు.



సోమవారం సచివాలయంలో ఇందిరమ్మ చీరెలను పరిశీలిస్తున్న సిఎం రేవంత్

# మహిళాశక్తి మహోన్నతం

>> పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. డీమార్ట్, బిగ్‌బజార్‌లకు పోటీగా ఉండేలా అద్భుతమైన మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పట్టణాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలి, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలి, మహిళా సంఘాలకు ఆదాయం రావాలి అన్నదే ఈ ఆలోచన వెనుక ఉన్న లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా శక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుందని, రైతులు పండించే మంచి పంటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, నిత్యావసర సరుకులు వీటి ద్వారా వినియోగదారులకు చేరేలా చూడాలని అన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తే రైతులకు మేలు జరుగుతుందని, వినియోగదారునికీ నాణ్యమైన వస్తువు, మహిళా సంఘాలకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు. సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సిఎం అన్నారు. అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సిఎం ఆవిష్కరించారు. సిఎంతో పాటు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎంఎల్ఏలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఒకే రోజు, ఒకే సమయంలో 8 వేల భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణయమని సిఎం అన్నారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే కేవలం సమావేశాల స్థలం ఇవ్వటం కాదని, వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు, వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను నిర్మించడమని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోందని అన్నారు. మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి మార్గమని భావించి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఈ పథకంలో ఆర్టీసీకి రూ.10వేల కోట్ల వరకు చెల్లించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవసరం లేదని కొందరు రెచ్చగొట్టారని, ఈ పథకాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేశారని విమర్శించారు. మహిళల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని, ఆ కుట్రలను తిప్పికొట్టి ఉచిత ప్రయాణాన్ని కొనసాగించిందని అన్నారు. మహిళలను బస్సులను యజమానులుగా మార్చాలన్న ఆలోచనతో మహిళా సంఘాల ద్వారా 1000 బస్సులు కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ప్రణాళికను అమలు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సోలార్ ఎనర్జీ అనగానే అదానీ, అంబానీ వంటి పెద్ద సంస్థలే గుర్తుకు వచ్చే పరిస్థితి మారిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం 1000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రిలయన్స్ వంటి సంస్థలు నిర్వహించే పెట్రోల్ బంకుల వ్యాపారంలోనూ సంఘాలను భాగస్వాములుగా చేస్తున్నామని సిఎం వెల్లడించారు. జిల్లా కేంద్రాల్లో, ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో పలు జిల్లాల సమాఖ్యలతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. నారాయణపేట మహిళా సమాఖ్య సభ్యులు పెట్రోల్ బంక్ ద్వారా తాము ఇప్పటివరకు దాదాపు 27 లక్షల సంపాదించామంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. మహిళా సంఘాలు చేపడుతున్న కొన్ని వ్యాపారాల్లో నెలకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బకాయి లేకుండా బ్యాంకులకు వందకు వంద శాతం రీపేమెంట్ చేసిన నిర్మల్ జిల్లా సమాఖ్య పరిధిలోని సంఘాలను సిఎం ప్రత్యేకంగా అభినందించారు. మెయిన్‌రోడ్డులో వారికి పెట్రోల్ బంక్‌ఏర్పాటు చేసే స్థలాన్ని కేటాయించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను సిఎం ఆదేశించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలు ప్రతి రూపాయిని నిజాయితీగా తిరిగి చెల్లిస్తూ ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. పెద్ద వ్యాపారులు, పెద్ద సంస్థలు బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకుని ఎగ్గొట్టి పారిపోయిన ఉదాహరణలు ఉన్నాయని, కానీ ఇక్కడి మహిళా సంఘాలు ఆర్థిక క్రమశిక్షణలో వారికి గుణపాఠం నేర్పుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు సారెలాగా ఇందిరమ్మ చీరలు అందజేస్తోందని సిఎం అన్నారు. గతంలో ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంటపొలాల్లో పిట్టలను తరిమేందుకు ఉపయోగించారనే విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామని, ఈసారి చిలుకపచ్చ రంగులో కొత్త డిజైన్ చీరలు ఇవ్వబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్, ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య, మహిళా శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నాలుగోసారి పెట్రో షాక్

>> రూ.2.86 పెంచారు. తొలిసారి పెట్రోల్ రూ.3 పెంచిన ప్రభుత్వం ఆ తర్వాత రూ. తర్వాత రూ.87 పైసలు పెంచింది.ఇక తాజాగా మరోసారి రూ.2.84 పైసలు పెంచుతూ దేశవ్యాప్తంగా ఉన్న వాహన దారులకు షాక్ ఇచ్చింది. అంటే కేవలం నెల రోజుల్లో పెట్రోల్‌పై దాదాపు రూ.8 వరకు పెరిగింది. తాజా పెట్రో ధరల పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 115.58కు చేరగా, డీజిల్ రూ. 103.74కు చేరుకుంది. అటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.117.19 పలకగా, డీజిల్ రూ. 104.88 వద్ద కొనసాగుతోంది. ఇక ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు, డీజిల్ ధర 95.20కు పెరిగింది. లీటర్ పెట్రోల్ ముంబయిలో రూ.111.21, డీజిల్ ధర రూ.97.83కు పెరిగింది. అదే సమయంలో చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77కు పెరగ్గా.. డీజిల్ ధర రూ.99.55కు పెరిగింది. ఏపిలోని గుంటూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.117.59కి, డీజిల్ రూ.105.28కి పెరిగింది. తాజాగా పెరిగిన పెట్రో ధరలు సోమవారం ఉదయం 6 గంటల నుంచే దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ఉదయాన్నే బంకులకు వెళ్లిన వాహనదారులకు పెట్రో ధరలు చూసి ఖంగుతిన్నారు. ఒకేసారి ఐదు లేదా ఆరు రూపాయల మేర ఇంధన ధరలు పెంచితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతోనే చమురు సంస్థలు విడతల వారీగా రేట్లు పెంచుకుంటూ పోతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి పైసల్లో కాకుండా ఏకంగా రెండు రూపాయలకు పైగా పెంచేస్తూ పోతుండటంతో లీటర్ ఇంధనం ధరలు సరికొత్త రికార్డుల వైపు దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 చమురు రవాణా జరిగే స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్ మార్గం గుండా రవాణా నిలిచిపోవడంతో చమురు సరఫరా ఆగిపోయిందని కేంద్రం పేర్కొంటోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయని, బ్యారెల్ ధర 100 మార్కును దాటిపోవడంతో భారత్‌లో ఇంధన ధరలను పెంచక తప్పడం లేదని చెబుతోంది. అయితే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు గత కొన్ని వారాలుగా సామాన్యులపై భారం పడకుండా ధరలను స్థిరంగా ఉంచాయి. దీనివల్ల ఆ కంపెనీలు దాదాపు రూ.1000 కోట్ల భారం పడుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

# మళ్లీ ఆల్మట్టి రగడ!

>> ప్రభుత్వం తన లిఖితపూర్వక అభ్యంతరాలను ఉంచింది. ఎగువన కర్ణాటక నీటిని అడ్డుకుంటే తెలంగాణలోని కోటి ఎకరాల మాగాణం ఎడారిగా మారే ప్రమాదం ఉందంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే సోమవారం సచివాలయంలో జరిగిన కర్ణాటక ఐటీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్. బోసురాజు.. తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో అత్యవసర భేటీలోనూ ప్రధానంగా అలమట్టిపైనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆలమట్టి ఎత్తు పెంపు, కృష్ణా నీటి వాటాల వివాదంపై ఇరు రాష్ట్రాల నేతల మధ్య సుదీర్ఘమైన చర్చ నడిచినట్లు సమాచారం. తెలంగాణ రైతుల ప్రయోజనాలే పరమావధిగా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గట్టిగా మాట్లాడినట్లు తెలిసింది.

## వారం - వర్జ్యం

26-05-2026, అధికజ్యేష్ఠ మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
ఏకాదశి పూర్తి,
హస్త పూర్తి
వర్జ్యం : మ.1.11-మ.2.54
దు.ఉ.8.10-9.02, 2)రా.11.47-12.39
శుభసమయం : ఉ.9.30-10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** గృహ అవసరములకు నీరు, విద్యుత్ నదుపాయములు, గృహాలంకరణలకు ధనమును వెచ్చిస్తారు.

**వృషభం:** నిర్మాణాత్మక పనులకు కొంత ఉత్సాహము మిత్రుల ద్వారా లభిస్తుంది. అధికారుల వలన అనుకోని గుర్తింపు లభిస్తుంది.

**మిథునం:** వచ్చిన ఒక సదవకాశమును సద్వినియోగ పరచుకోగలిగితే మేలు జరుగుతుంది. విద్యా, ఉద్యోగవకాశాలు.

**కర్కాటకం :** విధుల నిర్వహణలో గాని, వ్యాపారములలో గానీ, మార్పులు జరుగవచ్చును. ప్రమోషన్ లభిస్తుంది.

**సింహం:**బంధువులతో ప్రేమనురాగములు పెంపొందించే అవకాశము ఉన్నది. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వస్త్రలాభం.

**కన్య :**వ్యాపారములో, వృత్తిలో మీరు చూపించే నైపుణ్యమునకు మంచి అభివృద్ధిని సాధిస్తారు. వాహన సౌఖ్యం కలదు.

**తుల :** వైద్య, విద్యకు సంబంధించిన విషయములకు, వస్తువుల కొనుగోలుకు అనుకూల సమయము.బంధువుల కలయిక.

**వృశ్చికం:**సర్వసభ్య సమావేశములకు, పార్టీ వ్యవహారములకు, సాంఘీక సంబంధములకు అనుకూల కాలము. వస్త్రలాభం కలదు.

**ధనుస్సు:** స్త్రీల వలన కొన్ని ప్రయోజనములు లభిస్తాయి. నిందారోపణలకు సిద్ధపడి కొన్ని బాధ్యతలను స్వీకరిస్తారు.

**మకరం:**కాంట్రాక్టులు, ఉత్తర్వులు, ఆర్డర్స్‌ను ప్రభుత్వము నుండి అందుకుంటారు.దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కుంభం:** కార్యాలయము నందు రహస్య సంభాషణలను జరుపుట మానసిక ప్రశాంతతను కోల్పోవుట జరుగుతుంది.


**మీనం :** కార్పోరేషన్స్, మున్సిపాల్టీస్, పంచాయితీలతో లావాదేవీలు జరుపవలసి ఉంటుంది. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ తగ్గించండి

>> తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు దించాలని డిమాండ్ చేసారు. వారంలో నాలుగు సార్లు ఫ్యూయల్ ధరలు పెంచి కేంద్రం ప్రజలపై పెను భారం మోపితే, మరోవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ప్రజల నడ్డి విరుస్తున్నారని మండి పడ్డారు. పెరిగిన సాగు ఖర్చులు భరించలేక రైతులు సతమతమవుతుంటే, మరో వైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు రైతుల పరిస్థితి తయారైందన్నారు. రవాణా రంగం తీవ్ర సంక్షోభానికి లోను కావడంతో ద్రవ్యోల్బణం పెరిగి అన్ని వర్గాల ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతున్నదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, పన్నుల భారం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రైతు పొలం దున్నాలన్నా డీజిల్ భారం.. సామాన్యుడు బైక్ తీయాలన్నా పెట్రోల్ భారం..ఆటో సోదరుడి బతుకు బండి నడవాలన్నా ఇంధన భారం.. పెరిగిన ధరలు ప్రజానీకానికి పెను శాపంగా మారిందన్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు భరించలేక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ రేవంతు ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఖజానా నింపుకుంటూ సంబురపడుతుందని, పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. పెరిగిన ధరలతో ప్రతి నెలా రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు 2,000 కోట్ల అదనపు వ్యాట్ ఆదాయం వస్తుంటే.. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విడిచిపెట్టి ప్రచారాలకే పెద్ద పీట వేస్తున్నది విమర్శించారు. ఎన్నికల ముందు వ్యాట్ పై విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, రెండున్నరేళ్లుగా కేనీసం 0.1శాతం వ్యాట్ కూడా తగ్గించకపోవడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక తీరు, అధికారంలోకి వచ్చాక మరొక తీరు వ్యవహరిస్తూ కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. నిజంగా ప్రజా పాలనే అయితే, వెంటనే పెట్రోల్, డీజిల్‌పై కనీసం 10శాతం వ్యాట్ తగ్గించి, పెరిగిన ఇంధన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని బిఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేసారు. పెట్రోల్, డీజిల్ పెంపుపై మొసలి కన్నీరు కార్చే రాహుల్ గాంధీ..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ వ్యాట్ దోపిడీపై స్పందించాలని, వ్యాట్ తగ్గించేలా రేవంత్ రెడ్డిని ఆదేశించాలని కోరారు.



సోమవారం సెక్రటేరియట్‌లో సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే25:** అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.ఈ ఏడాది జూలై 31 నుండి ఆగస్టు 2 వరకు అమెరికా మేరీల్యాండ్‌లోని నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఏటిఏ) తెలుగు మహాసభలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రికి వారు ఆహ్వానం అందించారు. సిఎంను కలిసిన వారిలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా, నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల, కాన్ఫరెన్స్ రీజనల్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ బండా, ప్రవీణ్ పాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## భూదాన్ భూముల గోల్‌మాల్

### ఇడి విచారణకు హాజరైన ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ హయాంలో వెలుగు చూసిన భూదాన్ భూముల గోల్‌మాల్ వ్యవహారంలో అప్పట్లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఈడీ) సోమవారం నాడు విచారించింది. ఈ కేసులో ఇంతకు ముందే ఆయనను ఈడీ అధికారులు పలుమార్లు విచారించడం తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండలంలో గల నాగారం గ్రామంలో భూదాన్ ట్రస్టుకు చెందిన 40 ఎకరాల ఖరీదైన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పట్లో ధారాదత్తం చే యడంపై స్థానికులతో పాటు భూదాన్ ట్రస్టుకు చెందిన కొందరు అభ్యంతరం చెబుతూ కోర్టులో సవాల్ చేయడం తెలిసిందే. ఇలా ప్రైవేటు ప రం అయిన భూదాన్ భూములను కొందరు రియల్టర్లు చవకగా కొని వాటిని ప్లాట్లుగా చేసి విక్రయించడం సంచలనం రేపింది. 2023లో జరి గిన ఈ గోల్‌మాల్ వ్యవహారాలు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చాక వెలుగు చూసింది. ఇక్కడి ప్లాట్లను అనేక మంది ఐఎఎస్, ఐపిఎస్ అధి కారులతో పాటు వారి కుటుంబీకులు, కొందరు రాజకీయ నాయకులు, వారి బంధువులు కొనడం దుమారం రేపింది. ఈ గోల్‌మాల్‌లో అమోయ్ కుమార్‌తో పాటు కొందరు నాయకులు భారీగా లాభపడినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై హైకోర్టు విచారణకు ఆదేశించి తప్పులున్నట్లు పేర్కొంది. ఒక దశలో బ్యూరోక్రాట్లు కొన్న ప్లాట్లపై న్యాయస్థానం స్టే విధించడం గమనార్హం. ఈ గోల్‌మాల్‌లో నాటి కలెక్టర్ అమోయ్ కుమార్ పాత్ర వుం దని ఈడీ అధికారులకు అందిన ఫిర్యాదులో వుంది. ఇందులో మనీలాండరింగ్ కోణం వుందని కూడా ఆ ఫిర్యాదులో వుంది. ఈ నేపథ్యంలో అమోయ్ కుమార్‌ను మూడు సేల్ డీడ్లు, దానికి సంబంధించిన పూర్తి వివరాలతో విచారణకు రావాలని ఈడీ అధికారులు ఆదేశించారు. దీంతో అమోయ్ కుమార్ ఈడీ అధికారులు కోరిన వివరాలతో వారి ఎదుట హాజరై అధికారుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ కేసులో అవసరం అ యితే మరోసారి విచారణకు రావాలని ఈడీ అధికారులు ఆయనను కోరినట్లు తెలిసింది.

## రెండు రోజుల్లో కేరళకు నైరుతి

### వాతావరణ శాఖ చల్లని కబురు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాలు వేగం పుంజుకుని మరో రెండు రోజుల్లో కేరళను తాకనున్నట్లు భారతవాతావరణశాఖ (ఐఎండి) పేర్కొం ది. మే 26న కేరళలోకి ప్రవేశించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్టు తెలిపింది. రాబోయే రెండు మూడు రోజుల్లో నైరుతి రుతు పవనాలు నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రం, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంతోపాటు అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొంది. ఈ వారంతం నాటికి తెలంగాణతోపాటు జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, కర్ణాటక, కేరళ, గోవా రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రుతుపవన వాతావరణ మార్పులతో మే 26 నుంచి 29 మధ్య రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.

## ఫోన్ ట్యాపింగ్‌పై కొనసాగుతున్న సిట్ విచారణ

### సిఎం అనుచరుడు శ్రీరాంరెడ్డి వాంగ్మూలం నమోదు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి నాలుగు రోజుల క్రితం గడ్డిఅన్నారం మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిని విచారించిన సిట్ అధికారులు సోమవారం సిఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డిలకు సన్నిహితుడుగా ఉన్న శ్రీరాంరెడ్డిని గంటకుపైగా విచారించారు. మహబూబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిగా వున్న శ్రీరాంరెడ్డి ఫోన్‌ను బిఆర్‌ఎస్ హయాంలో ట్యాపింగ్‌కు గురైందని సిట్ విచారణలో వెలుగుచూసింది. దీనికి సంబంధించి శ్రీరాం రెడ్డిని సిట్ అధికారులు అప్పట్లో జరిగిన పరిణామాలపై విచారించారు. అప్పట్లో శ్రీరాం రెడ్డి ఫోన్ ద్వారా నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కదలికలపై నిఘా ఉంచేవారని సిట్ విచారణలో తేలింది. కాగా సిట్ విచార ణలో శ్రీరాంరెడ్డి తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు తెలియదని చెప్పినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఈ వారంలో మరికొందరిని సిట్ విచారించనుందని సమాచారం.

## స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు 31 వరకు పొడిగింపు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 31 వరకు పొడిగించారు. 2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో ఫ్రెష్, రెన్యువల్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం కళాశాలలు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే తుది గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, శారీరక వికలాంగులైన విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ అమలు చేస్తున్న నేపథ్యంలో ఉపకార వేతనాల ప్రక్రియను పారదర్శకంగా అమలు చేసేందుకు వీలుగా 2025-26 విద్యా సంవత్సరంలో రిజిస్ట్రేషన్ గతేడాది జులై 1న ప్రారంభం కాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, వికలాంగుల నుంచి 10,89,265 మందికి గానూ 10,20,688 మంది మాత్రమే నమోదయ్యారు.

# పంచాయతీలకు రూ.9,968 కోట్ల నిధులు కేటాయింపు

### కేంద్రం భారీ శుభవార్త

### అయిదేళ్లపాటు గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలని షరతు

### ఈ నిధులతో ఎట్టి పరిస్థితుల్లో జీతాలు, పింఛన్లు చెల్లించొద్దని ఆదేశం

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పిం ది. రాష్ట్రంలోని స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 16వ ఆర్థిక సంఘం భారీ మొత్తం లో నిధులను కేటాయించింది. రానున్న అయిదేళ్లకుగాను (2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు) తెలంగాణకు రూ.9,968 కోట్లను కేటాయిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. అయితే ఈ నిధుల వినియోగం, పర్యవేక్షణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఆ మార్గదర్శకాలకు లోబడనే నిధులు ఖర్చు చేయాలని స్పష్టం చేసింది. తాజాగా కేటాయించిన రూ.9,968 కోట్ల నిధులను కేవలం గ్రామ పంచాయతీ, మండల, జిల్లా ప్రజా పరిషత్‌ల అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది.

ఈ నిధులతో ప్రతి గ్రామాల్లో పారిశుద్ధ్యం, రహదారులు, స్ట్రీట్ లైట్లు, తాగునీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు మాత్రమే ఈ నిధులను వినియోగించాలని తేల్చి చెప్పింది. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఈ నిధులను ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు ఇచ్చేందుకు వాడకూడదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రతి స్థానిక సంస్థ ఎప్పటికప్పుడు గ్రామంలో అభివృద్ధి కోసం ఖర్చు చేసిన మొత్తానికి సంబంధించిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఏడాదిలో నిధులు దేనికి ఖర్చు చేశారో, వాటి ద్వారా జరిగిన అభివృద్ధి ఏమిటి..? అనే దానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం వీటికి సంబంధించిన సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది. ఆడిట్‌లో లోపాలు, నిధులు దుర్వినియోగం జరిగినట్టు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, ఈ మేరకు రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉంటే తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు రానున్న అయిదేళ్లకు సంబంధించి ఆర్థిక సంఘం రూ.4,35,236 కోట్లను కేంద్రం గ్రాంట్లుగా ప్రకటించింది.

ఈ మొత్తంలో 80 శాతం నిధులు గ్రామ పంచాయతీలకు కేటాయించగా, మిగిలిన 20 శాతం నిధుల్లో 10 శాతం మొత్తాన్ని మండల పరిషత్‌లకు, మరో 10 శాతాన్ని జిల్లా పరిషత్‌లకు కేటాయించనున్నట్లు తెలిపింది. ప్రతి సంవత్సరం జూన్, అక్టోబర్ నెలల్లో రెండు విడతల్లో ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది.

# 111 పాలిటెక్నిక్ కాలేజీల్లో 33,140 సీట్లు

### 2,930 ఇడబ్ల్యుఎస్ సీట్లు
### రేపటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్
### 31 వరకు స్లాట్ బుకింగ్
### 29 నుంచి జూన్ 3 వరకు వెబ్ ఆప్షన్లు
### జూన్ 6న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 111 ప్రభుత్వ, పాలిటెక్నిక్ కాలేజీల్లో 33,140 సీట్లు 2026-27 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్నాయని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 2930 సీట్లు ఈడబ్ల్యూఎస్ సీట్లని ప్రకటించారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 10 కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నామని వాటిల్లో 2220 సీట్లను భర్తీ చేయనున్నట్టు ప్రకటించారు. కొత్త ఐదు కోర్సుల్లో.. డిప్లొమా ఇన్ సెమికండక్టర్ టెక్నాలజీ కోర్సులో 720 సీట్లు, డిప్లొమా ఇన్ అడ్వాన్డ్ మాన్యుఫ్రాక్చరింగ్ టెక్నాలజీ కోర్సులో 240 సీట్లు, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ రియల్ ఎస్టేట్ అండ్ వాల్యుయేషన్ కోర్సులో 120 సీట్లు, డిప్లొమా ఇన్ లాండ్ స్కేప్ డిజైన్ కోర్సులో 120 సీట్లు, డిప్లమా ఇన్ ఏయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ కోర్సులో 60సీట్లు, డిప్లమా ఇన్ అడ్వాన్స్‌డ్ మాన్యఫ్యాక్చరింగ్ టెక్నాలజీ కోర్సులో 240 సీట్లు, డిప్లమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటెక్ కోర్సులో 420 సీట్లు, డిప్లమా ఇన్ బయో టెక్నాలజీ కోర్సులో 120 సీట్లు, డిప్లమా ఇన్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులో 120 సీట్లు, డిప్లమా ఇన్ ఇంటీరియల్ డిజైన్ కోర్సులో 180 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 17,130 సీట్లుకాగా అదనంగా 1658 ఈ డబ్ల్యూఎస్ సీట్లు కలిపి మొత్తం 18,788 సీట్లు ఉన్నాయని తెలిపారు. 52 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 13,080 సీట్లతోపాటు 1272 ఈ డబ్ల్యూఎస్ సీట్లు కలిపి 14,352 సీట్లు ఉన్నా యని తెలిపారు. మొత్తం 33,140 సీట్లకు పాలి సెట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు నిర్వహించిన పాలీసెట్-2026 కౌన్సెలింగ్‌ను రేపటి(బుధవారం-మే 27) నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు విద్యార్థులు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ 1 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనుండగా, ఈ నెల 29 నుంచి జూన్ 3 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 6న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6 నుంచి 9 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 8, 9 తేదిల్లో కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూన్ 9 నుంచి అకడమిక్ సెషన్‌ను ప్రారంభించనున్నారు. జూన్ 15న ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్లాట్ బుకింగ్‌కి అవకాశం కల్పించారు. జూన్ 16, 17 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. జూన్ 20న సీట్ల కేటాయింపు చేస్తారు. జూన్ 20 నుంచి 22 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 22, 23 తేదీల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి. జూన్ 24న విద్యార్థులు కాలేజీల్లో అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జులై 1న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయనున్నారు.. జులై 8 నాటికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు ప్రకటించారు.

# 19 యేళ్ల పగే మధు హత్యకు కారణం

### 24 గంటల్లోనే బిఆర్‌ఎస్ నాయకుడి హత్య కేసు ఛేదన
### ఐదుగురు నిందితుల అరెస్ట్.. మహిళా నిందితురాలు పరార్
### మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ



**సూర్యాపేట రూరల్, మే 25, ప్రభాతవార్త :** సూర్యాపేట రూరల్ మండలం యర్కారం గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ భర్త చింతలపాటి మధు హత్య జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో మహిళా నిందితురాలు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ నరసింహా సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. శుక్రవారం ఉదయం సూర్యాపేటలోని అద్దెఇంటి నుంచి మధు బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య మోనిక అనుమానంతో శుక్రవారం రాత్రి సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కేసును హత్యగా నమోదు చేసి ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు.

**పాత హత్య కేసుకు ప్రతీకారం**

2007లో యర్కారం మాజీసర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో చింతలపాటి మధు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి రవీందర్ కుమారుడు మిద్దె జీవన్ మధుపై కక్ష పెంచుకుని ప్రతీకారం తీర్చుకోవాలని భావించినట్లు పోలీసులు తెలిపారు. ఎలాగైనా హత్య చేయాలని ఐదేళ్లుగా పథకం రచిస్తూనే ఉన్నాడు.

2021లో మధు బైక్‌పై వెళ్తున్నప్పుడు కారుతో యాక్సిడెంట్ చేసి చంపేందుకు ప్రయత్నించగా అది విఫలమైంద న్నారు. అనంతరం నిమ్మి కల్ ఫంక్షన్ హాల్ వద్ద కూడా హత్యాయత్నానికి ప్లాన్ చేయగా సఫలం కాలేదని పోలీసులు వెల్లడించారు. మృతుడు మధుకు దగ్గర స్నేహి తులైన చింత సైదులు, మేదరి ప్రసాద్‌లను ప్రధాన నిందితుడు మిద్దె జీవన్ తన వర్గంలోకి తీసుకుని తరచూ కలిసి మద్యం సేవిస్తూ ఉండేవారని, ఈ క్రమంలో మధును హత్య చేయడం కోసం వారి సహకారం తీసుకొని ఈ హత్య చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు ముందు సూర్యాపేటలోని తాళ్లగడ్డలో చింత సైదులు పేరుతో ఇల్లు అద్దెకు తీసుకుని, ఆ ఇంటి ఖర్చులు కూడా జీవనే భరించినట్లు పోలీ సులు తెలిపారు. అదే ఇంటిని హత్యకు కేంద్రంగా ఉపయోగించినట్లు వెల్లడించారు.

**దావత్ పేరుతో పిలిచి హత్య**

మే 22న చేపలు, మందుతో దావత్ ఉందని చెప్పి సైదులు, ప్రసాద్‌లు మధును తాళ్లగడ్డలోని అద్దె ఇంటికి పిలిచారు. మధ్యాహ్నం మధు అక్కడికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని సైదులు ఫోన్ ద్వారా జీవన్‌కు తెలియజేశాడు. రాత్రి 7:30 గంటల సమయంలో మధు మద్యం మత్తులో ఉండగా జీవన్, ఆనంద్ కారులో అక్కడికి చేరుకున్నారు.

ప్రసాద్ మధు చేతులు, కాళ్లు పట్టు కోగా మటన్ కత్తితో సైదులు దాడి చేశాడు. వెంటనే కత్తిని తీసుకున్న జీవన్, మధు మెడ, ముఖం, భుజాలపై తీవ్రంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

**గోనెసంచిలో మృతదేహం తరలింపు**

హత్య అనంతరం మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి కారులో ఎంజీ రోడ్డు నుండి కొత్త బస్టాండు అంజనపురి కాలనీ మీదగా యర్కారంలో జీవన్ తండ్రిని హత్య చేసిన ప్రాంతంలో వేద్దామని వెళ్లగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో గ్రామానికి వెళ్లే స్టేజి వద్ద సమీపంలో ఉన్న కల్వర్టు దగ్గర ఒక దేహాన్ని పడేసి వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు.

హత్యకు ఉపయోగించిన కత్తి, మధు సెల్‌ఫోన్‌ను అడివేంల శివారులోని కాల్వలో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. టేకుమట్ల సమీపంలోని జాతీయ రహదారి65 వద్ద పోలీసులు మిద్దె జీవన్, మిద్దె ఆనంద్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. మరో ముగ్గురు నిందితులను ఈనాడు కార్యాలయం సమీపంలో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. చింత సైదులు భార్య భవాని ఈ హత్య కుట్రకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తు తం ఆమె పరారీలో ఉండగా, గాలింపు కొనసాగుతోందన్నారు.



న్యాయవాది మొయినుద్దీన్ హత్య కేసు నిందితుడు

## ఖాజా మొయినుద్దీన్ హత్య కేసు నిందితుల అరెస్ట్

### రూ. 10 లక్షల సుపారీ, పక్కా ప్లాన్‌తో న్యాయవాది హత్య, పోలీసులు నిర్ధారణ

**హైదరాబాద్ (కార్వాన్), మే 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో సంచలనం సృష్టిం చిన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ వక్ఫ్‌బోర్డు లాయర్ మృతి కేవలం ప్రమాదం కాదు, రూ.10 లక్షల సుపారీతో పక్కా ప్లాన్‌తో చేసిన హత్యగా పోలీసులు నిర్ధారించారు. వక్ఫ్ బోర్డు భూముల ఆస్తుల వాదాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కవాడిగూడాకు చెందిన వినయ్ అనే వ్యక్తి ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం నలుగురు నిందితులను పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో పాత కక్షలు,వక్ఫ్ బోర్డు భూముల కేసుల వాదోపవాదాల వల్లే ఈ హత్య జరిగిందని పోలీస్ లు నిర్ధారించారు.

**మృతుడి కుమారుడు ఫర్హాన్ కాంగ్రెస్ నాయకుడిపై ఆరోపణలు..**

రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డ్ భూములను ఆక్రమించిన కాంగ్రెస్ నాయకుడు ముజాహిద్ ఆలంఖాన్,మహబూబ్ ఆలంఖాన్‌లే తన తండ్రిని చంపించారని మొహియుద్దీన్ కుమారుడు ఫర్హాన్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఫర్హాన్ మాట్లా డుతూ..నవాబ్‌షా ఇంజనీరింగ్ కాలేజ్,అన్వర్ ఉల్ ఉలూం వక్ఫ్,ముంతాజ్ యావిద్దుల వక్ఫ్ వంటి వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులు,వాటిని ఆక్ర మించడంతో కొన్నేళ్లుగా మా నాన్న న్యాయస్థానం ద్వారా పోరాడుతు న్నారన్నారు.

అప్పటి నుంచి బెదరింపులు మొదలయ్యాయని, ఇప్పటి వరకు ఆరుసార్లు మా తండ్రిపై దాడి చేశారు. ఇటీవలే మా ఆఫీసుకు వచ్చి నన్ను కూడా ఆలంఖాన్ బెదిరించాడని,రూ.10 కోట్లు ఇస్తామని కేసు నుంచి తప్పుకోమని ప్రలోభపెట్టారని వాపోయాడు. వినకపోవడంతో గతంలో కార్యాలయంపై కూడా దాడి చేశారని,ఇందుకు సంబంధించి పలు పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. మా నాన్నను కారుతో ఢీకొట్టి చంపించింది కాంగ్రెస్ నాయకుడు ఆలంఖానే మా నాన్నను కక్షకట్టి చంపేశాడన్నారు.ఇప్పటికీ నాకు,నా కుటుంబ సభ్యులకు ముజాహిద్ ఆలంఖాన్ నుంచి ప్రాణహాని ఉందని,ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలి అని ఫర్హాన్ విజ్ఞప్తి చేశారు.

## సొంత చెల్లి, బావ ఫోన్లు ట్యాప్ చేసిన కెటిఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 25:** సొంత చెల్లి, బావ ఫోన్లు కూడా ట్యాప్ చేసిన కెటిఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ట్వీట్ వేదికగా ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కెటిఆర్ అంటూ మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. ఫాంహౌస్‌లో ఉంటే ఏం తెలుస్తుంది? జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సిఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుడుతున్నారని, హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నామని మే 23వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామని మంత్రి పొంగులేటి ట్వీట్‌లో పేర్కొన్నారు.

రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు విఆర్‌ఎస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, డబుల్ బెడ్ ఇళ్లు లేని గ్రామాల్లో బిఆర్‌ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదన్న ఈ సవాల్‌కు సిద్ధమేనా కెటిఆర్ అంటూ మంత్రి పొంగులేటి ప్రశ్నించారు.

# డిగ్రీలో కొత్త కోర్సుల పంచాయితీ!

### యూనివర్సిటీలు అనుమతించాయంటున్న ఉన్నత విద్యామండలి
### బిఒఎస్ అనుమతి లేదంటున్న కళాశాల విద్య కమిషనర్
### కొత్త కోర్సుల కాలేజీల వివరాలను దోస్త్‌లో అప్‌లోడ్ చేసిన వర్సిటీలు
### అయినా విద్యార్థులకు ఆప్షన్ ఇవ్వడానికి లేని అవకాశం
### నేటితో ముగియనున్న రెండో విడత దోస్త్ వెబ్ ఆప్షన్లు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో కొత్తగా ప్రారంభించనున్న డిగ్రీ కోర్సులపై పరిస్థితి ఇటు కళాశాల విద్య కమిషనర్, అటు ఉన్నత విద్యా మండలి మధ్య చిలికి చిలికి గాలివానగా మారింది. ఇద్దరి మధ్య సయోధ్య కుదరకపోవడంతో విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరలేకపోతున్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో బీబీఏ, బీకాం, బీఎస్సీలో కొత్త కోర్సుల అమలుపై సందిగ్ధత నెలకొంది. కొత్త కోర్సుల విషయంలో ఉన్నత విద్యామండలి ఒకలా చెబుతుంటే.. కళాశాల విద్యాశాఖ కమిషనర్ మరోలా చెబుతున్నారు. కొత్త కోర్సులపై ఎటూ తేలకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. స్వయంగా ముఖ్యమంత్రి చూస్తున్న విద్యాశాఖలో ఇటువంటి పరిణామం జరగడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ ఆన్‌లైన్ ప్రక్రియలో సాంకేతిక పరంగా వ్యవహరిస్తున్న కళాశాల విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఈ ఏడాది కొన్ని కొత్త కోర్సులను ప్రారంభించాలని ఉన్నత విద్యా మండలి భావించింది. అందులో భాగంగా మార్చిలోనే యూనివర్సిటీ వీసీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించింది. సమావేశంలో పాల్గొన్న 7 సాంప్రదాయక యూనివర్సిటీల వీసీలు కొత్త కోర్సులను తమ తమ యూనివర్సిటీల పరిధిలో ప్రారంభించడానికి అంగీకరించారు. కొత్త కోర్సులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన ఇతర అంశాలను ఉన్నత విద్యా మండలి రూపొందించి యూనివర్సిటీలకు చెందిన బీవోఎస్‌లతో సమావేశం ఏర్పాటు చేసి ఆమోదింప చేసుకుంది. ఈ ప్రక్రియ ఏప్రిల్ నెలలో ప్రారంభమై మే 15 నాటికి ముగిసింది. అయితే అప్పటికే దోస్త్-2026 అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమై, మొదటి విడత సీట్ల కేటాయింపు మే 14న చేశారు. మొదటి విడతలో ఏప్రిల్ 30 నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించగా.. అప్పటికి కొత్త కోర్సులను ప్రారంభించాలనుకున్న కాలేజీల్లో యూనివర్సిటీలు తనిఖీలను పూర్తి చేయకపోవడంతో మొదటి విడత నాటికి ఆయా ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు అనుమతి ఇవ్వలేదు. ఈ నెల 14న మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి కాగా.. నేటితో కాలేజీల్లో చేరడానికి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి తుది గడువుగా ఉంది. కొత్తగా కోర్సును ప్రారంభించాలనుకున్న కాలేజీల్లో ఉన్నత విద్యా మండలి, వర్సిటీ అధికారులు సంయుక్తంగా జాయింట్ ఇన్స్‌ఫెక్షన్ కమిటీ(జేఐసీ) పేరుతో తనిఖీలు పూర్తి చేసిన అనంతరం కాలేజీలకు అనుమతులు ఇచ్చారు. అనుమతులు ఇచ్చిన తరువాత ఆయా కాలేజీల వివరాలను రిజిస్ట్రార్లు తమ లాగిన్ ఐడీలతో దోస్త్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే సమస్య ఇక్కడే వచ్చింది. యూనివర్సిటీలు అప్‌లోడ్ చేసిన కాలేజీల వివరాలను దోస్త్ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి వీలు లేకుండా కాలేజియేట్ కమిషనర్ అధికారులు అడ్డుపడ్డారని ఉన్నత విద్యా మండలి ఆరోపిస్తోంది. దోస్త్ కన్వీనర్‌గా ఉన్న వారు చెప్పే వాటిని అమలు చేయకుండా టెక్నికల్‌గా దోస్త్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న వారు చెబుతున్న వాటిని అమలు చేస్తూ కొత్త కోర్సులకు వెబ్ ఆప్షన్లు లేకుండా చేస్తున్నారని ఉన్నత విద్యా మండలి ఆరోపిస్తోంది. అయితే ప్రైవేటు కాలేజీలకు కొత్త కోర్సులకు అనుమతులు ఇవ్వాలంటే వాటికి సంబంధించిన సిలబస్‌ను యూనివర్సిటీల బీవోఎస్‌లు ఆమోదించాలని, అనంతరం యూనివర్సిటీలు అనుమతులు ఇస్తాయని వాటితో తమకు సంబంధం లేదని కళాశాల విద్య కమిషన్ వాదిస్తున్నారు. కొత్త కోర్సులను గతంలో ప్రారంభించినపుడు ఎపుడు ఇటువంటి అభ్యంతరాలను కళాశాల విద్య శాఖ నుంచి రాలేదని, గత ఏడాదిలో కూడా బీఎస్సీ డాటా సైన్స్‌ను కొత్తగా ప్రారంభించామని అపుడు లేని సమస్య ఇపుడెలా వస్తుందని ఉన్నత విద్యా మండలి ప్రశ్నిస్తోంది. విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలనే ఉద్దేశంతోనే నిబంధనల మేరకే కొత్త కోర్సుల ప్రక్రియను పూర్తి చేశామని ఉన్నత విద్యా మండలి చెబుతోంది. సమస్య కాస్త ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్టు తెలుస్తోంది. నేటితో దోస్త్ రెండో విడత వెబ్ ఆప్షన్లకు చివరి రోజు కావడంతో సమస్య పరిష్కారం అవుతుందా? లేకపోతే మూడో విడత కేటాయింపు వరకు కొనసాగుతుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

HATHWAY CABLE AND DATACOM LIMITED (TELANGANA)
Customer Care 24X7
Toll Free: 18004193114 / Phone 080-65159555 / 080-44479555
General Information Number 080-65159555 / 080-44479555
Email: southhelpdesk@hathway.net
Web: https://ispselfcare.hathway.net/login
If you are not satisfied, appeal with complaint docket number.
Appellate Authority
Monday to Friday
9.30am to 6.30pm
Abishak Indirani - Asst. Manager (Customer Support)
080-65159525 / 080-44479525
appellate@hathway.net
Appellate Address:
Hathway House, 137/138 Infantry Road, Bengaluru – 560001

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్
"టూరిజం హౌస్" #3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన నం: 07/SE/TGTDC/2026-27, తేది: 23.05.2026

| క్ర. సం. | పని పేరు | అంచనా ధర రూ. లక్షలలో) | బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది |
|---|---|---|---|
| 1 | వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం, ఆత్మకూరు పట్టణం, ఆత్మకూరు చెరువు సుందరీకరణ | 100.00 | 30.05.2026 |
| 2 | నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ పట్టణంలో సిద్ధుల గుట్ట వద్ద కాటేజీల నిర్మాణం | 50.00 | 30.05.2026 |
| 3 | నారాయణపేట జిల్లా, ముదుమల్ కృష్ణా మండలం, నిలువురాళ్ళు, ఎకోటూరిజం పార్క్ అభివృద్ధి | 30.00 | 26.05.2026 |

అర్హులైన కాంట్రాక్టర్లు నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై బిడ్స్ కోరబడుతున్నవి. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TGTDC లిమిటెడ్, హైదరాబాద్
DIPR.No.3006-PP/CL/Advt/1/2026-27, తేది: 25.05.2026

వార్త

> బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి, ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.
>
> -ఆండర్సన్

# ఇది మనిషి ద్రోహమే!

తమలపాకుతో నువ్వొట్లంటే తలుపు చెక్కతో నేనిట్లంట అన్నట్లుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వావ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. వాతావరణం లో ఊహించని మార్పులు చోటు చేసుకుంటున్నాయి.ఈ అనూహ్యామైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. గతవారం,పది రోజులుగా తెలుగురాష్ట్రాలు భానుడి ప్రతాపానికి కొన్ని ప్రాంతాల్లో అగ్నిగుండాలుగా తయారవుతున్నాయి.ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలు దాటితేనే బయటకు అడుగుపెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలోనే దాదాపు వంద మందికిపైగా కేవలం వడగాల్పులతో మరణించినట్లు అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా దాదాపు 250 మండలాలో వడ గాల్పులు వీచాయి. ఇరవై జిల్లాల్లో పైగా గత నాలుగైదు రోజులుగా నలభైఆరు డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కొన్ని ప్రాంతాల్లో నలభై ఎనిమిది డిగ్రీల వరకుసూర్యుడి ప్రతాపం పెరిగింది. సోమవారం రోహిణికార్తె ప్రవేశించ డంతో ఈ వేడిగాల్పులు మరో మూడు నాలుగు రోజుల పాటు కొనసాగవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా వాతావరణంలో అనూహ్యామార్పులు చోటుచేసుకుంటున్నాయి.ఒకవైపు అదుపు లేకుండా పెరు గుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు కరవులు, కార్చిచ్చులు తదితరవి మానవ జీవనానికి తీవ్ర అంతరాయం కలిగి స్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమ వుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నా యి. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మానవుడి మను గడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు ఏనాటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతు న్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు కూడా పర్యావరణానికి చేటు చేస్తున్నాయి. ఇష్టానుసారం గా ఇసుక తవ్వకాలు మొదలుపెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒక్కటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం భారత జనాభా నూటయాభై కోట్లకు చేరుకోవడానికి ఇంకెంతో కాలం పట్టదు. కానీ అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నా దాన్ని నియంత్రించి ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. అటవీ సంపద వేగంగా హరించుకుపోతున్నది. భారత్‌లో రోజుకు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్య మైపోతున్నదని ఐక్యరాజ్యసమితి నివేదిక వ్యక్తం చేస్తు న్నది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, నదీ లోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికి వేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావర ణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియం త్రించలేకపోతున్నారు. అందువల్ల పర్యావరణా నికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. ఈ వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ అన్నీ గాలి కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అన్నిటి కంటే ముఖ్యంగా నగరీకరణపేరుతో జరుగుతున్న విధ్వం సం అంతా ఇంతా కాదు. పచ్చదనం కనుమరుగైపోతు న్నది. ఎటు చూసినా కాంక్రీట్ మయమైపోతున్నది. ఇలాంటి రకరకాల కారణాలతో భూఉష్ణోగ్రత పెరిగిపోతు న్నదని వాతావరణ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలో తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్ర వేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలా డుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి కూడా తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం కారణంగా సకాలంలో వర్షాలు కురియకపోవడం, కురిస్తే ఒకేచోట, ఒకేసారి కుంభవృష్టి కురవడం అకాల వర్షాలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. అంతేకాదు వర దలు, తుఫాన్‌లతోపాటు భూప్రకంపనాలు వంటి ఉపద్ర వాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. యేటా ప్రపంచ వ్యాప్తంగా మూడువందల ఎనభైకి పైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాలతో వేలాది మంది ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెం దరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసు కుంటున్న ముందుజాగ్రత్తల వల్ల ఇటీవల కాలంలో ప్రాణ, ఆస్తి నష్టాలను కొంత మేరకు నియంత్రించగలు గుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపో తున్నారు. ఆధునికంగా, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినా మరెంతో విప్లవాత్మకమైన పురోగాభివృద్ధివైపు అడుగులు వేస్తున్నా ప్రకృతి ముందు తలవంచని పరి స్థితిని మాన వుడు బయటపడలేకపోతున్నాడు. ఏది ఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాల్సిన అవ సరం ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవి ష్యత్‌లో భారీ మూల్యం చెల్లించ కతప్పదు.

> ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.
>
> 
>
> ఎల్లెన్ గ్లాస్గో

> ఆత్మవిశ్వాసం, స్వయం పోషకత్వం, ఉత్తమ స్వభావానికి మూలస్తంభాలు వంటివి.
>
> 
>
> వినోబా భావే

## ప్రజావాక్కు



### పెరుగుతున్న అవినీతి పరులు

మనదేశంలో అవినీతి, అధికార దుర్వినియోగం, బంధు ప్రీతి, చీకటి బజారు, మోసం,దగా, దారుణాలు ఏయేట కాయేట పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో అయితే అవినీతి చేసి లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ వారి వార్తలు అనేకం.ప్రతిరోజూ మనం వార్తాపత్రికలలో, న్యూస్ ఛానళ్ళలో చూస్తూనే ఉన్నాం. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వం అంటేనే ప్రజలు. ప్రభుత్వ సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజల దగ్గర లంచాలకు మరిగే లంచగొండులను ఉపేక్షించటం తగదు. అవినీతిపరులు బొద్దింకలుగా తయారయ్యి మన చుట్టూతా ఉన్నారు. ప్రజల జాగ్రత్త కోసం చిన్నచిన్న జేబుదొంగల ఫొటోలను రైల్వేస్టేషన్లలో, బస్టాండ్లలో,పోలీసుస్టేషన్లలో పెడతారు. పెద్ద పెద్ద అవినీతిపరులను మాత్రం వైట్‌కాలర్ నేరగాళ్ల గా పరిగణిస్తున్నారు. అవినీతి కేసుల్లోని వారి ఫొటోలను ఆ వ్యక్తి పనిచేసిన కార్యాలయంలో ఫొటోతోపాటు అతని హోదాను ప్రకటిస్తూ ఏర్పాటు చేసే విధానం వెనువెం టనే తీసుకురావాలి. అప్పటికైనా లంచగొండులకు సిగ్గు కలుగుతుందేమో చూడాలి.

\- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబద్

### నేలకొరుగుతున్న రైతన్న

దున్ని చదును చేస్తున్న రైతన్న నేలాకొరుగుతున్నాడు. నేలను అమ్మిన వ్యాపారులు మాత్రం నింగికి ఎదుగుతు న్నారు. అరక దున్నిన అరచేతులను ఆపదలో ఆదుకునే వాడు లేడు. అధికారులను మాత్రం ఇంకాస్త అందల మెక్కిస్తాం అంటారు ఈ జనం. ఆరుగాలం కష్టపడి ఉన్న దంతా పంట కోసం ధారపోస్తే ఆర్నెళ్ల తర్వాత అర్థరూ పాయి అయిన మిగులకపాయే ఈ వ్యవసాయం చేస్తే. ఈ రైతు బ్రతుకు అంటే అందరికీ చిన్నచూపయే కదా.

\- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పరాభవలో పరాభవం

దేశానికి మహిళా ప్రధాన మంత్రిని, మహిళా రాష్ట్రపతిని మహిళా ముఖ్యమంత్రిని మహిళా గవర్నలను అందించిన కాంగ్రెస్ పార్టీ,సమర్థులైనఅధ్యక్షులను కూడా అందించిం ది. వారు ఎకతాటిపై పార్టీని నడిపించారు. మహిళలు అధ్యక్షులుగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ పార్టీ ఒక వెలుగు వెలిగింది. ఎన్నో రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ అధికారంలో ఉండి పాలన చేయగలిగింది.రాజకీయాల్లో ఇంత మంది మహిళలున్నా మహిళా బిల్లు పాస్ కావడం లేదు. మహిళా బిల్లుకు మోక్షమెప్పుడో!

\-రాశి, హైదరాబాద్

### చమురు సరఫరాల భద్రత

పశ్చిమ ఆసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ విభేదాల నేపథ్యంలో చమురు సరఫరాల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నా యి. ఈ తరుణంలో భారతదేశం తన ఇంధన అవసరాలను భద్రపరుచుకునేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో జరి పిన చర్చలు దౌత్య వ్యూహానికి కీలక విజయంగా నిలిచాయి. యూఏఈ భారత్‌లో ముప్పై మిలియన్ బారెళ్ల ముడి చమురును నిల్వ చేయడానికి అంగీకరించడం దేశానికి రక్షణ కవచంగా నిలవనుంది. ప్రపంచ మార్కెట్లలో సరఫరా అంతరాయం ఏర్పడినా, దేశీయ అవసరాలను తీరుస్తూ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఈ వ్యూహాత్మక నిల్వలు తోడ్పడతాయి. ప్రస్తుతం భారతదేశం వినియోగిస్తున్న ముడి చమురులో గణనీయమైన భాగం యూఏఈ నుంచే దిగుమతి అవుతోంది. దీర్ఘకాలిక ఎల్‌పీజీ సరఫరా ఒప్పందాలు ఇంధన రంగానికి భరోసాను కలిగిస్తున్నాయి.

\- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైతులకు అవగాహన కల్పించాలి

ఉపాధి హామీ అయినా వీబి జీ రామ్ జీఅయినా పథకం విజ యవంతం కావాలి అంటే కార్మికులకు, రైతులకు అవగాహన కల్పించడమే ముఖ్యం.తెలంగాణ వ్యవసాయం స్థిరీకరించడం ఉపాధి హామీతో ఎలా సాధ్యం? పైగా తెలంగాణలో సగటు కమతం పరిమాణం 1.9ఎకరాలు మాత్రమే. మరి వర్షాధితం అయినా వ్యవసాయాన్ని స్థిరీకరించడం ఎలా అంటే ఒక సెంటు భూమిలో చిన్న నీటి కుంటను తవ్వించుకోమని రైతు లకు అవగాహనా కార్యక్రమాలుచేపట్టాలి. ఇప్పటికి కాలువలు రాని ఎండు ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని గిరిజన ప్రాంతాలు అయితే అక్కడ ఇంకా బోర్లా మీదనే ఆధారపడి వ్యవసాయం చేసే ప్రాంతాలు ఉన్నాయి. కాబట్టి అక్కడ నీటి కుంటలు తక్షణమే తవ్వించాలి. సైజు తక్కువ ఉన్న నీటిని ఇంకించే ప్రయత్నం చేయాలి. రైతులకు అవగాహనా కల్పించడం ద్వారానే సాధ్యం అవుతుంది.

\- భారత అవినాష్ ,జనగామ

### అవకాశాలు కోల్పోతున్న సీనియర్లు

ఒక ఉద్యోగికి లేదా ఉపాధ్యాయుడికి ప్రమోషన్ అనేది సీని యారిటీ ఆధారంగా ఇవ్వాలి. కానీ ప్రమోషన్లలో కూడా అనేక రకాల రిజర్వేషన్లు చూడడం వలన, సీనియర్ మోస్ట్‌లకు ముప్పై సంవత్సరాల మించి సర్వీస్ చేసినా ఎలాంటి ప్రమో షన్లు పొందకుండా ఉద్యోగ విరమణ చేయవలసి వస్తూ ఉన్నది. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లో ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా ఉంది.

\-వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

# చిత్తశుద్ధిలేని పునరావాసాలతోనే చింత

*లొంగిపోయి న మాజీ మావో యిస్టులపై సమాజంలో అనుమానం, అపనమ్మకం కూడా పెద్ద సవాలే. వారిని జీవితాంతం'మాజీ మావోయిస్టు' అనే ముద్రతో ఒంటరితనంలోకి నెట్టేస్తే పునరావాసం అసాధ్యం అవుతుంది. పెళ్లిళ్లు, సంబరాలు జరుపుకోవడం కష్టం అవుతుంది. ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజం కూడా వారిని తిరిగి అంగీకరించే బాధ్యత తీసుకోవాలి. పునరావాసం అంటే కేవలం డబ్బుకాదు అది ప్రజాస్వామ్య పద్ధతిలో జీవితాన్ని తిరిగి నిర్మించే ప్రక్రియ. లేకపోతే 'లొంగుబాటు' అనే పదం తాత్కాలిక విరామంగా మాత్రమే మిగిలిపోతుంది. అడవుల నుంచి బయటకు వచ్చిన వ్యక్తికి ప్రభుత్వాలు నిజమైన జీవితం ఇవ్వలేకపోతే, మళ్లీ అడవులే వారికి ఆశ్రయం అవుతాయి. ప్రజాస్వామ్యం గెలవాలంటే తుపాకీని ఓడించడం మాత్రమే సరిపోదు మనిషిని, మనసులను గెలుచుకోవాలి.*



సరికొండ రవీంద్రనాథ్

ఆపరేషన్ కగార్ తర్వాత భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. ఇది భద్రతా బలగాల విజయం మాత్రమే కాదు. సరైన పునరావాస విధానానికి పరీక్ష కూడా. తుపాకీ వదిలిన మావోయి స్టుల చేతికి స్థిరమైన ఉపాధి, గౌరవ ప్రదమైన జీవితం ఇవ్వకపోతే అడ వుల వైపు వారి తిరుగు ప్రయాణాన్ని ఎవరూ ఆపలేరు. తుపాకీని కింద పెట్టిన చేతికి పని, భద్రత, గౌరవం, భవిష్యత్తు ఇవ్వలేకపోతే ఆ చేయి మళ్లీ అడవిని ఆశ్రయించే ప్రమాదం ఉంది. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న నక్స లైట్ ఉద్యమ చరిత్రలో లొంగిపోయిన వారికి శాశ్వత జీవనోపాధి కల్పించిన చరిత్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. పునరావాస కార్యక్రమాలు ప్రారంభించినా అవిప్రచార కార్యక్రమాలుగా మిగిలిపోయాయి. ఇప్పుడు కూడా మాజీ మావోయిస్టుల భవిష్యత్తుపై కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు నోరు మెదపకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటి వరకు ప్రభుత్వాలు ప్రకటిస్తున్న నగదు సహాయాలు, తా త్కాలిక ప్యాకేజీలు మొదటి అడుగే తప్ప పూర్తి పరిష్కారం కావు. నగదు రివార్డులు ఇచ్చి ఫోటోలు దిగడం ద్వారా ఒక వ్యక్తి జీవితం మారదు. నాయకులు తమకు వచ్చిన పెద్ద మొత్తాలను బ్యాంకుల్లో వేసుకోవడమో, పెట్టుబడులు పెట్ట డమో చేస్తారు. దళ సభ్యులు, కార్యకర్తల భవిష్యత్తు ఏంట న్నది ప్రశ్న. అడవిలో సంవత్సరాలు గడిపిన వ్యక్తి సమా జంలో తిరిగి నిలబడాలంటే స్థిరమైన ఉపాధి, సామాజిక అంగీకారం, కుటుంబ భద్రత, మానసిక పునరుద్ధరణ అన్నీ అవసరం. ముఖ్యంగా ఛత్తీస్గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు పునరావాస కేంద్రాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని ప్రకటించాయి. ఇంత దాకా ఎక్కడా ప్రారంభం కాలేదు. ఇవి కేవలం ప్రచార కార్యక్రమాలుగా మిగిలిపోకూడదు. శిక్షణ ఇచ్చిన తర్వాత ఉద్యోగం దొరక్కపోతే ఆ శిక్షణ కాగితాలకే పరిమితం అవుతుంది. డ్రైవింగ్ నేర్పితే వాహనం కొనుగోలుకు రుణం ఇవ్వాలి. వ్యవసాయం నేర్పితే భూమి, సాగు సాయం కల్పించాలి. చిన్న పరిశ్రమల కోసం సీడ్ మనీ, మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. 'పునరావాసం' రికార్డులకే పరిమితమైతే మావోయిజం మీద విజయం సాధించినట్లు కాదు. మళ్లీ వాళ్ల ఆలోచనలను పాతదారి పట్టించినట్లే అవుతుంది. ముప్పయి సంవత్సరాల క్రితం ఉమ్మడి విశాఖ జిల్లా అనకాపల్లి మండలంలోని కుంచంగి గ్రామంలో మాజీ నక్సలైట్ల పునరావాస కాలనీ ఏర్పాటు చేసారు. ఇప్పటి వరకూ దేశ చరిత్రలో నక్సలైట్ల పునరావాసం కోసం ఏర్పాటు చేసిన తొలి, చివరి పునరావాస కాలనీ ఇదే. కోరుకొండ, తాండవ దళంలో పని చేసి లొంగిపోయిన పదిహేడు మంది మాజీ నక్సలైట్ల కుటుంబాలకు 1994 ప్రాంతంలో కుంచంగి కొండల మధ్య పునరావాసం ఏర్పా టు చేసారు. వీరిలో తెలంగాణాతోబాటు బస్తర్, ఉత్తరాంధ్ర ప్రాంతాలవారు ఉన్నారు. 150 సెంట్ల స్థలంలో చిన్నగది కట్టి ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి ఐదెకరాల బంజరు భూమి కేటాయించారు. గులకరాళ్ల నేలలో ఓమ మొక్క కూడా మొలవని పరిస్థితి. నక్సలైట్లకు పునరావాసం కల్పిం చామంటూ ఆర్భాటంగా పబ్లిసిటీ చేసారు. నాడు ఓఎస్‌డిగా ఉన్న సంక్షేమ అధికారి అనురాధ మారిపోవడంతో ఈ పున రావాస పథకం అటకెక్కింది. సమస్యలు చెబితే తమకు సంబంధం లేదంటూ కలెక్టర్ తోబాటు పోలీస్, రెవెన్యూ, డిఆర్‌డిఎ అధికారులు ఎవరికి వారు చేతులు దులుపుకున్నా రు. కూలి పని కూడా దొరకని పరిస్థితి. తాగడానికి



మంచినీరు కూడా లేని కొండల ప్రాంతంలో పునరావాసం పొందిన వారు నరకం అనుభవించారు. ప్రభుత్వం ఇచ్చింది డి పట్టాభూమి కావడంతో అమ్మడానికి వీలు లేదు. బ్యాంక్ లో తాకట్టు పెట్టి అవసరానికి అప్పు తెచ్చుకునే అవకాశం లేదు. లొంగిపోయిన వారికి జరిగిన మేలు ఒక్కటే. కేసులు ఎత్తి వేయడం. ముప్పయి సంవత్సరాల తర్వాత కూడా కాలనీ వాసులు ఇప్పటికీ అవే సమస్యల పరిష్కారానికి అధికార్ల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మరోదారుణం ఏమంటే ఈ కాలనీ మైదానంలో ఉండటంతో ఇందులోని ఎస్టీలకు షెడ్యూల్ ప్రాంతంలోని అటవీహక్కులు వర్తించడం లేదు. చివరికి శేషం ఏమంటే పునరావాసం పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండదు.పత్రికల్లో హామీలు, ప్రకటనలు గుప్పిస్తారు. ప్రధానంగా మావోయిస్టు ఉద్యమా నికి కారణమైన మూల సమస్యలను ప్రభుత్వాలు నిజాయి తీగా అంగీకరించాలి. నిరుద్యోగం, భూసమస్యలు, అటవీ హక్కుల నిరాకరణ, గిరిజనులపై దోపిడి, వైద్యం, విద్య, మైదానంతో సమానంగా అభివృద్ధి లేకపోవడం వంటి సమ స్యలే అడవుల్లో గిరిజనుల తిరుగుబాటుకు బీజాలువేసాయి. ఈ సమస్యలు అలాగే కొనసాగితే కొత్త తరాలు మళ్లీ అదే దారిలో నడిచే ప్రమాదం ఉంటుంది. కేవలం పోలీసు ఆప రేషన్లతో భావజాలాన్ని అంతం చేయలేరు.న్యాయం, అభి వృద్ధి, గౌరవంతోనే దీర్ఘకాల శాంతి సాధ్యం. సుదీర్ఘంగా కొనసాగిన ఉద్యమంలో అటు మావోయిస్టు కుటుంబాల వారు, ఇటుపోలీసులు త్యాగాలు చేసారు. చివరికి జరిగింది జాతికి నష్టం. ఈ పరిణామాలు పునరావృతం కాకుండా లొంగిపోయిన వారికి జీవనోపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఛత్తీస్‌గడ్‌లోని కాంకేర్ జిల్లాలో చాగెల్ లోగల బిఎస్ఎఫ్ క్యాంప్ కార్యాలయంలో 40 మంది మావోయిస్టులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సుక్మాలోనిర్మాణ రంగంలో, బస్తర్ ప్రాంతం లో కిల్లింగ్ టు స్కిల్లింగ్ పేరుతో ఒక నైపుణ్యస్కూలు నడు పుతున్నట్టు చెబుతున్నారు. ఇటువంటి కేంద్రాలు మావోయి స్టులను ఆకర్షించడానికి, పబ్లిసిటీకి తప్ప శాశ్వతజీవనోపాధి దారులు చూపించేవికావు. అధి కారులు మారినా, అధికారం లోని పార్టీమారినా పథకాలు ఆగిపోకుండా చూడాలి.కేంద్రం కూడా స్వంతంగా పునరా వాస పథకాన్ని రూపొందించింది. ఈపథకం ద్వారా అయినా మాజీ మావోయిస్టులకు కొత్త జీవితాలకు దారులు చూపాలి. ఏగ్రామానికి లేదా పట్టణా నికి చెందిన వారికి వారికుటుంబ నేపథ్యం ప్రాతిపదికగా పునరావాసం కల్పించాలి. చదువుకునే వారికి చదువు, వ్యవ సాయం చేసే వారికి భూమిఇవ్వాలి. వృత్తివిద్యను కోరుకునే వారికి వారి అభిరుచిమేరకు శిక్షణ ఇప్పించాలి. కానీ వాళ్లకు ఇష్టంలేకున్నా ఎలక్ట్రికల్, మొబైల్ రిపేరింగ్‌లలో శిక్షణ ఇవ్వ కూడదు. అసాంఘిక శక్తులకు అవకాశం సాయుధ పోరా టాన్ని వీడి బైటికివచ్చిన వారికిసరైన పునరావాసం ఏర్పాటు చేయకపోతే సంఘ వ్యతిరేక శక్తులు తయారయ్యే ప్రమాదం కూడా ఉంది. స్వార్థపర రాజకీయ, పోలీసు శక్తులు, అధికా రులు వీరిని చేరదీస్తే సమాజానికి అపారమైన కీడు జరగు తుంది.నయీం,జడల నాగరాజు, కత్తుల సమ్మయ్య, బయ్య సమ్మిరెడ్డిలాంటి వారిని దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు. గంజాయివ్యాపారం, రియల్టర్ సెటిల్‌మెంట్లు, వినియోగిం చుకుంటారు. వీరిని ఖాళీగా వదిలేస్తే తెలిసి తెలిసి ఒక కొత్త నేరప్రపంచానికి తెరతీసినట్టు అవుతుంది. లొంగిపోయి న మాజీ మావోయిస్టులపై సమాజంలో అనుమానం, అపనమ్మకం కూడా పెద్ద సవాలే. వారిని జీవితాంతం'మాజీ మావోయిస్టు' అనే ముద్రతో ఒంటరితనంలోకి నెట్టేస్తే పున రావాసం అసాధ్యం అవుతుంది. పెళ్లిళ్లు, సంబరాలు జరు పుకోవడం కష్టం అవు తుంది. ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజం కూడా వారిని తిరిగి అంగీకరించే బాధ్యత తీసు కోవాలి. పునరావా సం అంటే కేవలం డబ్బు కాదు అది ప్రజా స్వామ్యపద్ధతి లో జీవితాన్ని తిరిగినిర్మించే ప్రక్రియ. లేకపోతే 'లొంగుబాటు' అనే పదం తాత్కాలిక విరామంగా మాత్రమే మిగిలిపోతుం ది. అడవుల నుంచి బయటకు వచ్చిన వ్యక్తికి ప్రభుత్వాలు నిజమైన జీవితం ఇవ్వలేకపోతే, మళ్లీ అడవులే వారికి ఆశ్రయం అవుతాయి. ప్రజాస్వామ్యం గెలవాలంటే తుపాకీని ఓడించడం మాత్రమే సరిపోదు మనిషిని, మనసులను గెలుచుకోవాలి. ●

# రూపాయి పతనంతో నష్టమెవరికి?


తిప్పర్తి శ్రీనివాస్

భారతీయ రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తూ కొత్త కనిష్ఠాలను నమోదు చేస్తుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు ఆందోళన కలిగించే పరిణామంగా మారింది. అమెరికా డాలర్ ప్రపంచవ్యాప్తంగా మరింత బలపడుతుం డగా, భారత రూపాయిసహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అయితే, భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థకు రూపాయి పతనం సాధారణ గణాంక సమస్య మాత్రమే కాదు,అది ప్రజల దైనందిన జీవితాన్ని, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణను, పరిశ్రమల స్థిరత్వాన్ని, పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేసే కీలక అంశం. రూపాయి విలువ పడిపోవడానికి అనేక అంతర్జాతీయ, దేశీయ కార ణాలున్నాయి. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని అమెరికా వైపు మళ్లించింది. అధిక లాభాల కోసం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకోవడంతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. ఫలితంగా రూపాయివిలువపై ఒత్తిడి అధికమైంది. అంతే కాదు, రష్యా,ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య అస్థిరత, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల వంటి అంశాలు కూడా భారత విదేశీ మారక నిల్వలపై భారం మోపుతున్నాయి. భారతదేశం తన చమురు అవసరాల్లో ఎక్కువ భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది. రూపాయి బలహీనపడితే చమురు దిగుమతుల వ్యయం మరింత పెరుగుతుంది. దీని ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో ప్రజలపై పడుతుంది. రవాణా వ్యయాలు పెరగడంతో అన్నివస్తువుల ధరలు ఎగసిపడతాయి.దాంతో ద్రవ్యోల్బణం అదుపు తప్పే ప్రమాదం ఉంది. ఇప్పటికే సామాన్యుడు కూరగాయల నుంచి గ్యాస్ సిలిండర్ వరకు పెరిగిన ధరలతో ఇబ్బందిపడుతున్న తరుణంలో రూపాయి పతనం మరింత భారంగా మారుతోంది.రూపాయి బలహీ న తకు కొన్నిసానుకూల కోణాలు కూడా ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతారు. రూపాయి విలువ తగ్గితే భారతీయ ఎగుమతులు విదేశీమార్కెట్లలో తక్కువ ధరలకు లభిస్తా యి. దీనివల్ల ఐటీ, ఔషధ, టెక్స్టైల్ రంగా లకు కొంత ప్రయోజనంకలగొచ్చు. విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపే డబ్బు విలువకూడా రూపాయిలో ఎక్కువగా మారు తుంది. అయితే ఈ ప్రయోజనాలు పరిమిత రంగాలకే వర్తిస్తాయి.దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, దిగుమతులవ్యయం పెరగడం వల్ల కలిగేనష్టాలు మరింత తీవ్రమైనవిగా కనిపి స్తున్నాయి. ఇక్కడ మరోముఖ్యమైన అంశం విదేశీఅప్పులు. అనేక భారతీయ కంపెనీలు డాలర్లలో రుణాలు తీసుకున్నా యి. రూపాయి విలువ పడిపోతే ఆ రుణాల చెల్లింపులు మరింత భారంగా మారుతాయి.వడ్డీతోపాటు అసలుమొత్తా న్ని చెల్లించడానికి ఎక్కువ రూపాయలు అవసరం అవుతా యి. ఇదిపరిశ్రమల లాభదాయకతను దెబ్బతీస్తుంది. కొంత మంది పెట్టుబడిదారులు భారత మార్కెట్‌పై విశ్వాసం కోల్పోయే ప్రమాదం కూడాఉంది. ఈపరిస్థితుల్లోభారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) పాత్ర అత్యంత కీలకం. విదేశీ మారక నిల్వలను వినియోగించి రూపాయిపతనాన్నినియం త్రించేందుకు ఆర్బీఐ తరచూ జోక్యం చేసుకుంటోంది. అయితే మార్కెట్ శక్తులను పూర్తిగా అడ్డుకోవడం సాధ్యం కాదు. వడ్డీ రేట్లపెంపు, దిగుమతుల నియంత్రణ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధానాలువంటి చర్యలు సమన్వ యంతో అమలుకావాలి. అదే సమయంలో ప్రభుత్వం దీర్ఘకాలిక ఆర్థిక సంస్కరణ లపై దృష్టి పెట్టాల్సిన అవస రం ఉంది. ముఖ్యంగా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్నికేవలం నినాదంగా కాకుండా ఆచరణలోకి తీసుకురావాలి. ●

# న్యాయవాదులపై దాడి ప్రజాస్వామ్యానికి చేటు!

జక్కనపల్లి గణేష్

ఒక న్యాయవాదికి ముప్పు వాటిల్లినప్పుడు, న్యాయానికి ముప్పు వాటిల్లుతుంది. న్యాయానికి ముప్పు వాటిల్లి నప్పుడు, ప్రజాస్వామ్యానికే ప్రమాదం ఏర్పడుతుంది.' భారతదేశం రాజ్యాంగం, చట్టబద్ధమైన పాలనచే పరిపా లించబడుతుంది. కులం, మతం, హోదా, సంపద, రాజ కీయ పలుకుబడితో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి చట్టం ముందు సమాన రక్షణ, న్యాయం పొందేందుకు సమాన హక్కు ఉంటుంది. ఈ రాజ్యాంగ హామీలు వాస్త వరూపం దాల్చడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషి స్తారు. వారు పౌరుడికి, న్యాయస్థానానికి మధ్య వారధిగా పనిచేస్తారు. అందువల్ల న్యాయవాదుల భద్రత, స్వాతంత్రం కేవలం వృత్తిపరమైన ఆందోళనలు మాత్రమే కాదు. అవి ప్రజా ప్రాముఖ్యత, రాజ్యాంగ ప్రాధాన్యత కలిగిన విషయా లు. శనివారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ వద్ద తన నివాసం సమీపంలో ఖాజా మొయిజుద్దీన్ అనే న్యాయవాది ని ఒక వాహనం ఢీకొట్టడంతో, ఆయనపై జరిగిన దాడి న్యాయవాద వర్గాలలో తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. ఆయన చికిత్స పొందుతూ, మృతి చెందారు. దీనికి ప్రతి స్పందనగా అధికారులు ఆలస్యం చేయకుండా నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని, అలాగే సమగ్రమైన, నిష్పక్ష పాతమైన విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఒక న్యాయవాది తన తరఫున తాను మాట్లాడరు. ఆయన తన క్లయింట్ తరఫున మాట్లాడతారు.వాది, ప్రతివాది, ఫిర్యాదు దారు, ప్రతిస్పందకుడు, నిందితుడు లేదా బాధితుడికి ప్రాతినిధ్యం వహించినా, ఒక న్యాయవాది చట్టం గుర్తించిన వృత్తిపరమైన విధిని నిర్వర్తిస్తారు. జారీ చేసే లీగల్ నోటీ సులు, దాఖలు చేసే పిటిషన్లు, కోర్టు ముందు చేసే వాద నలు, క్రాస్‌ఎగ్జామినేషన్ సమయంలో అడిగే ప్రశ్నలు అన్నీ న్యాయ ప్రక్రియలో భాగమే. వాటిని ఎన్నడూ వ్యక్తిగత శత్రుత్వంగా పొరపాటు పడకూడదు. లీగల్ నోటీసులు అనేవి చట్టపరమైన మార్గాల ద్వారా వివాదాలను పరిష్క రించడానికి ఉద్దేశించిన చట్టబద్ధమైన మార్గం. న్యాయపర మైన విచారణలలో సత్యాన్ని కనుగొనడానికి క్రాస్‌ఎగ్జామి నేషన్ అత్యంత ముఖ్యమైన సాధనాలలో ఒకటి. కోర్టు వాదనలు న్యాయ పరిపాలనలో భాగం. అందువల్ల, ఈ విధులను నిర్వర్తిస్తున్నందుకు ఒక న్యాయవాదిని లక్ష్యంగా చేసుకోవడం అనేది న్యాయ పంపిణీ వ్యవస్థ పునాదులనే దెబ్బతీయడం లాంటిది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు సమానత్వాన్ని, ఆర్టికల్ 19 ప్రకారం స్వేచ్ఛను, ఆర్టికల్ 21 ప్రకారం ప్రాణానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణను, ఆర్టికల్ 39ఎ ప్రకారం న్యాయం పొందే హక్కును సూచిస్తాయి. ఈ రాజ్యాంగ సూత్రాలను సమర్థ వంతంగా అమలు చేయడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తారు. న్యాయవాదులు తమ విధులను నిర్భయంగా



నిర్వర్తించలేకపోతే, పౌరులకు న్యాయం పొందే హక్కుకు భంగం కలుగుతుంది. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించే న్యాయవాది, తన వృత్తివల్ల తానే సమస్యలలో ఇరుక్కుపోవడం బాధాకరమైన విషయం. శాంతిభద్రతలు అనేవి పోలీస్, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూషన్, న్యాయవాద వృత్తి సామరస్యపూర్వక పనితీరుపై ఆధారపడి ఉంటాయి. ఈ సంస్థలలో ఏ ఒక్కటి భయం లేదా బెదిరింపుల కింద పనిచేసినా, ఒక ప్రజాస్వామ్య సమాజం సమర్థవంతంగా పనిచేయదు. ఒక న్యాయవాదిపై దాడి అనేది కేవలం ఒక వృత్తి నిపుణుడిపై దాడి మాత్రమే కాదు, అది న్యాయ పరి పాలనపైనే దాడి. దేశవ్యాప్తంగా అడ్వకేట్స్ బార్ అసోసియే షన్‌లోని చాలా మంది సభ్యులు, తమ వృత్తిపరమైన విధు లను నిర్వర్తించే న్యాయవాదులకు మరింత బలమైన చట్ట పరమైన రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నిరంతరం నొక్కి చెప్పారు. న్యాయ వృత్తి నిపుణులను వారి వృత్తిపరమైన పని కారణంగా ఎదురయ్యే బెదరింపులు, భయపెట్టడం, హింస, చట్టవిరుద్ధమైన జోక్యం నుండి రక్షించాలనే ఆందో ళనల నుండి 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' గురించిన చర్చ లు పుట్టుకొచ్చాయి. దీని లక్ష్యం ప్రత్యేక హక్కులను కల్పిం చడం కాదు, న్యాయవాద వృత్తి స్వాతంత్ర్యాన్ని కాపాడ టం, న్యాయవ్యవస్థ నిరంతరాయంగా పనిచేసేలా చూడ టం. ప్రతి పౌరుడు ఒక ప్రాథమిక సూత్రాన్ని గుర్తుంచు కోవాలి. వివాదం కేసులోని పక్షాలమధ్య ఉంటుంది, అంతే గాని పక్షాలకు, న్యాయవాదికి మధ్య కాదు. న్యాయవాది కేవలం తన క్లయింట్ చట్టపరమైన హక్కులు, ప్రయోజ నాలకు ప్రాతినిధ్యం వహిస్తాడు.వృత్తిపరమైన న్యాయ ప్రాతి నిధ్యాన్ని వ్యక్తిగతీకరించడం అనేది రాజ్యాంగపాలనస్ఫూర్తికి, నాగరిక న్యాయ సంస్కృతికి విరుద్ధం. భయపెట్టడం ద్వారా న్యాయాన్ని అణచివేయలేమని చరిత్ర నిరూపిస్తుంది. ఒక న్యాయవాదికి ముప్పు వాటిల్లినా, అనేకులు చట్టాన్ని పరి రక్షించడం అనే ప్రక్రియను కొనసాగిస్తారు. ఒక స్వరాన్ని అణచివేస్తే,న్యాయవాద వర్గానికి చెందిన లెక్కలేనన్ని స్వరా లు రాజ్యాంగ విలువలను కాపాడటం కొనసాగిస్తాయి. న్యాయవాద వృత్తి ఎల్లప్పుడూ పౌరస్వేచ్ఛ, మానవ హక్కు లు,చట్టబద్ధమైన పాలనకు సంరక్షకుడిగా నిలిచింది. న్యాయ వాదులను గౌరవించే సమాజం, చివరికి రాజ్యాంగాన్ని గౌరవ విస్తుంది. న్యాయవాదులను రక్షించే సమాజం న్యాయాన్ని రక్షిస్తుంది. న్యాయాన్ని రక్షించే సమాజం ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది. అందువల్ల, న్యాయవాద వృత్తి సభ్యులపై హింస, బెదిరింపులు లేదా భయపెట్టడం వంటి ఏ సంఘ టననైనా, బాధ్యులుగా తేలిన వారిపై జవాబుదారీతనం ఉండేలా చూస్తూ, చట్టానికి అనుగుణంగా, క్షుణ్ణంగా, నిష్ప క్షపాతంగా విచారించాలి. బార్ అసోసియేషన్ అనేది స్వాతంత్రం రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలలో ఒకటి. నిర్భయమైన న్యాయవాదులు లేకుండా, న్యాయానికి సమర్థవంతమైన ప్రాప్యత ఉండదు. న్యాయానికి ప్రాప్యత లేకుండా, రాజ్యాంగ హక్కులు అర్థరహితం అవుతాయి. రాజ్యాంగ హక్కులు లేకుండా, ప్రజాస్వామ్యం తననిజమైన బలాన్ని కోల్పోతుంది. న్యాయం జరగడమే కాకుండా, అది జరిగినట్లు కనిపించాలి. న్యాయవాదులు భయం,పక్షపాతం, ఒత్తిడి, బెదిరింపులు లేకుండా తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించినప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. న్యాయ వాదులు ఏ పక్షానికీ శత్రువులు కారు. వారు న్యాయస్థానం అధికారులు, చట్టపరమైన హక్కుల సంరక్షకులు, న్యాయ పరిపాలనలో భాగస్వాములు. వారి రక్షణ ఒక ప్రత్యేక హక్కు కాదు, అది చట్టబద్ధ పాలన, రాజ్యాంగ పరిపాలన, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి ఒక ఆవశ్యకత. ఒక సైనికుడు దేశ సరిహద్దులను కాపాడుతాడు,ఒక న్యాయ వాదిరాజ్యాంగపు హద్దులను కాపాడుతాడు.న్యాయానికిసమ యం పట్టవచ్చు,కానీ దానిని శాశ్వతంగా నిరాకరించలేరు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సుంకాలు తగ్గిస్తే రూ.లక్షకోట్ల నష్టం



## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

**న్యూఢిల్లీ,మే 25:** దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం 3ఎఫ్ (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు.

మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

# సామాన్యుల పొదుపును పెట్రోలుతో తగలెట్టేస్తున్నారు

## పెట్రోధరల పెంపుపై ఖర్గే విసుర్లు

**న్యూఢిల్లీ, మే 25:** అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నాయి. ఇవాళ మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ధరలు పెరిగాయి. అయితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఇదే తొలిసారి కాదు. గత రెండు వారాల్లో ఐదుసార్లు పెరిగాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీ లో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12 కు, లీటర్ డీజిల్ రూ.95.25 కు చేరింది. ఇక హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58 గా, లీటర్ డీజిల్ ధర రూ.103.74 గా ఉంది. అయితే పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. ఈ రోజువారీ దోపిడీతో ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యులు కూడబెట్టుకున్న పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. కేవలం రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను ఐదుసార్లు పెంచారని మండిపడ్డారు. 2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తుచేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని ఖర్గే హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఐదోసారి పెరగడంతో ఇవాళ హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు పెరిగినట్లు కేంద్రం చెబుతోందని అన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

# పట్నా హైకోర్టు సిజెగా జస్టిస్ మీనాక్షి

## - సుప్రీం కొలీజియం సిఫార్సు - ఈ నియామకంతో 4 హైకోర్టులకు మహిళా సిజెలు

**న్యూఢిల్లీ, మే 25:** సిక్కిం హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ మీనాక్షి ఎం. రాయ్‌ను పట్నా హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జూన్ 4న పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా ఈ సిఫార్సు చేసింది. "ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జూన్ 4, 2026న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, మే 22న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం సమావేశంలో సుప్రీం కోర్టు కొలీజియం, సిక్కిం హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ మీనాక్షి ఎం. రాయ్‌ను పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది," అని ఆ ప్రకటన పేర్కొంది. భారత న్యాయవ్యవస్థలో అరుదైన ఘట్టం: త్వరలో ఒకే సమయంలో 4 హైకోర్టులకు మహిళా సీజేలు. భారత న్యాయవ్యవస్థలో త్వరలో తొలిసారి అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఒకే సమయంలో దేశంలోని నాలుగు హైకోర్టులకు మహిళా ప్రధాన న్యాయమూర్తులు నేతృత్వం వహించనున్నారు. ప్రస్తుతం గుజరాత్, మేఘాలయా, ఎపి హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులుగా జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ రేవతి మోహితె డెరె, జస్టిస్ లీసా గిల్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిక్కిం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మీనాక్షిఎం రాయ్‌ను నియమించాలని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ రాయ్ నియామకంతో ఒకే సమయంలో హైకోర్టులలో నలుగురు మహిళా ప్రధాన న్యాయమూర్తులు విధులు నిర్వహించనున్నారు.

బంగ్లాదేశ్‌లో ట్రక్కు ప్రమాదం..

# 15 మంది మృతి

## మరో పదిమందికి పైగా గాయాలు

**ఢాకా, మే 25:** బంగ్లాదేశ్‌లో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఒక ట్రక్కు బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న 15 మంది మరణించారు. మరో పది మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు వాయువ్య దిశలో తంగైల్ జిల్లా, సొరాటాయిల్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో జరిగింది. స్థానిక పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కొందరు కూలీలు ఢాకా నుంచి బక్రీద్ వేడుకల కోసం తమ ఊళ్లకు, కుటుంబ సభ్యులు, బంధువుల ఇండ్లకు బయల్దేరారు. ఈ క్రమంలో అక్కడి హైవేపై ట్రక్కును ఆపి అందులో ఎక్కారు. ఇలా పలువురు ప్రయాణికులతో వెళ్తుండగా, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా, అతివేగంగా వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో దాదాపు 15 మంది ప్రయాణికులు మరణించారు. మరో పది మందికిపైగా గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రక్షక బృందాలు సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రుల్ని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. బంగ్లాదేశ్‌లో కొంతకాలంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా వేలాది మంది అక్కడ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. బంగ్లాలో ట్రాఫిక్ రూల్స్ పెద్దగా అమలు కావు. ట్రాఫిక్ వ్యవస్థ కూడా సరిగ్గా పని చేయదు. అలాగే, రోడ్లు బాగోలేకపోవడం, నైపుణ్యం లేని డ్రైవర్ల కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అక్కడి నివేదికలు తెలుపుతున్నాయి.

# ట్విషా శర్మ మృతి కేసు



## మీడియా సంయమనం పాటించాలి

-దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగేలా చూస్తాం
- సంస్థలు, వ్యవస్థపై నమ్మకముంచండి
- సుప్రీంకోర్టు సిజె ధర్మాసనం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, మే 25:** నటి ట్విషా శర్మ కేసును నిర్వహించిన తీరు పట్ల బాధ వ్యక్తం చేస్తూ, ఆమె మృతికి సంబంధించిన పరిణామాలపై వార్తలు రాసేటప్పుడు సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు మీడియాను కోరింది. 33 ఏళ్ల శర్మ, మే 12న భోపాల్‌లోని కటారా హిల్స్ ప్రాంతంలో ఉన్న తన అత్తగారి ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. వరకట్నం వేధింపులకు, ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆమె అత్తమామలపై కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే, ఆమె మాదకద్రవ్యాలకు బానిస అయిందని ఆమె అత్తమామలు వాదిస్తున్నారు. వరకట్నం వేధింపుల ఆరోపణలపై మృతి భర్త, న్యాయవాది అయిన సమర్థ్ సింగ్, ఆమె అత్త, మాజీ జిల్లా జడ్జి గిరిబాల సింగ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నటి ట్విషా శర్మ మృతి కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం, ఈ కేసులో దర్యాప్తు నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా, నిష్పాక్షి కంగా జరిగేలా చూస్తామని పేర్కొంది. "కొన్ని చర్యల వల్ల తాము కొద్దిగా బాధపడ్డాము. బాధితురాలి కుటుంబం లేదా ఇతర కుటుంబం వాంగ్మూలాలను తీసుకోవద్దని తాము మా మీడియా మిత్రులను కోరుతున్నాము. చట్టం ప్రకారం విషయాలు ముందుకు సాగనివ్వండి" అని ధర్మాసనం పేర్కొంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, మీడియా జోక్యం వల్ల ఈ కేసులో గణనీయమైన పురోగతి సాధించబడిందని తెలిపారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనను ఎదుర్కోవడం కంటే, విడాకులు తీసుకున్న కుమార్తెను కలిగి ఉండటమే మేలని ఈ కేసు తల్లిదండ్రులందరికీ ఒక సందేశమని ఆయన అన్నారు. ఈ కేసు దర్యాప్తును వెంటనే సిబిఐ చేపట్టేలా చూడటానికి, తాను ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు అంగీకరించింది. "బాధితురాలి కుటుంబ సభ్యులకు, అలాగే నిందితులకు తాము చెప్పేదేమిటంటే, బహిరంగంగా లేదా మీడియా వేదికల ముందు వాంగ్మూలాలు ఇవ్వడానికి బదులుగా, వారు తమ వాదనలను దర్యాప్తు సంస్థ ముందు రికార్డ్ చేయించుకోవాలి. తద్వారా కొనసాగుతున్న దర్యాప్తుపై ఎలాంటి పక్షపాతం లేదా ప్రతికూల ప్రభావం పడకుండా ఉంటుంది" అని ధర్మాసనం పేర్కొంది. అలాగే "విచారణ జరపాల్సిన కొన్ని అంశాలపై వచ్చే ఫలితాలపై అది అనవసరంగా ప్రభావం చూపవచ్చు కాబట్టి, సాక్షులుగా ఉండే అవకాశం ఉన్న వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేయవద్దని తాము మీడియాను కూడా కోరుతున్నాము. ఊహాగానాలకు తావు ఇవ్వకుండా, ప్రముఖ దర్యాప్తు సంస్థలలో ఒకదానిపై నమ్మకం, విశ్వాసం ఉంచాలని తాము ప్రజలను కూడా కోరుతున్నాము. సముచిత సమయంలో, ఈ దర్యాప్తును ఒక ముగింపుకు తీసుకువస్తుందని మాకు పూర్తి నమ్మకం ఉంది" అని ధర్మాసనం పేర్కొంది.

# 90 రాఫెల్స్ జెట్స్ కొనుగోలుకు రక్షణశాఖ సిద్ధం



**న్యూఢిల్లీ, మే 25:** భారత వైమానిక దళాన్ని మరింత శక్తిమంతం చేసే దిశగా రక్షణ శాఖ ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే దీన్ని ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్‌లోనే 90 విమానాల తయారీ ఉంటుందని భారత్ పేర్కొంటోంది. ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను మేకిన్ ఇండియా కింద ఇక్కడే తయారు చేయనున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మనదేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి ఎగిరివచ్చే (ఫ్లైఅవే) స్థితిలో దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా ఈ రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలనే ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది. ఈ రఫేల్ ఉత్పత్తి ప్రక్రియలో భారతీయ కంపెనీల పాత్రను మరింత విస్తృతం చేయాలని ఫ్రాన్స్‌ను కోరింది. భవిష్యత్తులో జరగబోయే రక్షణ సహకారాలు కేవలం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, ఇరు దేశాలు కలిసి డిజైన్, అభివృద్ధి చేసేలా ఒప్పందాలు ఉండనున్నాయి. భారత వైమానిక దళంలో ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. అలాగే నౌకాదళం కోసం మరో 26 రఫేల్‌ఎమ్ విమానాల కొనుగోలు ప్రక్రియ కూడా నడుస్తోంది.

ఇప్పటికే మన దేశంలో రఫేల్ విమానాలకు సంబంధించిన మెయింటెనెన్స్, శిక్షణ మౌలిక వసతులు ఉండటం వల్ల, మరిన్ని కొత్త విమానాలు వస్తే వాటి రవాణా, నిర్వహణ ఖర్చులు, పైలట్ల శిక్షణ వ్యయం భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

## విమానం 30 వేల అడుగుల ఎత్తున పైలట్‌కు గుండెపోటు

**మాడ్రిడ్, మే 25:** విమానం గాల్లో 30,000 అడుగుల ఎత్తులో ఉండగా పైలట్‌కు గుండెపోటు వచ్చిన ఘటన స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న జెట్-2 విమానంలో చోటుచేసుకుంది. దీంతో విమానాన్ని పోర్చుగల్‌లోని ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వెంటనే పైలట్‌కు వైద్యసాయం అందించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున జెట్-2 విమానం స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు బయల్దేరింది. విమానం 30 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. పైలట్‌కు గుండెపోటు వచ్చినట్లు కో పైలట్ గుర్తించారు. వెంటనే దగ్గరలో ఉన్న ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టు అధికారులను అప్రమత్తం చేశారు. విమానం ఎయిర్‌పోర్టుకు చేరుకునే సమయానికి అధికారులు అత్యవసర వైద్య ఏర్పాట్లు చేసి పైలట్‌కు వెంటనే వైద్య సాయం అందించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటన సమయంలో విమానంలో 220 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

# బార్‌లు, స్పాలలో బాలలు

## తీవ్రమైన సమస్య సుప్రీంకోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ, మే 25:** ఆర్కెస్ట్రాలు, బార్‌లు, మసాజ్ పార్లర్‌లు, స్పాలు, సెలూన్‌లతో సహా వినోద, ఆతిథ్య రంగ అనుబంధ సంస్థలలో బాల కార్మిక వ్యవస్థను మరింత కఠినంగా నిషేధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఈ సంస్థలలో పిల్లలు దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం, 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' దాఖలు చేసిన పిఐఎల్‌ను విచారించింది. బాలల ఉపాధిని పూర్తిగా నిషేధించే వృత్తుల జాబితాను విస్తరించడానికి, బాల, కౌమార కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం, 1986లోని సెక్షన్ 4 కింద తన అధికారాలను వినియోగించుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని ఈ పిఐఎల్ కోరింది. విచారణ సందర్భంగా, సిజెఐ సూర్యకాంత్ ఇది ఒక "తీవ్రమైన సమస్య" అని వ్యాఖ్యానించారు.

# రెండు నెలల ముందే ఎబోలా వ్యాప్తి

## అయినా కాంగో తీరు నిమ్మకునీరెత్తిన వైనం!

**బ్రజ్జావెల్లే, మే 25:** ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలా యావత్ ప్రపంచాన్ని గుబులు పుట్టిస్తోంది. ఇప్పటికే భారత్ సహా పలు దేశాలు అప్రమత్తమై వైరస్ వ్యాప్తి కట్టిడికి చర్యలు చేపట్టాయి. కానీ, ఈ సంక్షోభవం పుట్టుకొచ్చిన కాంగోలో మాత్రం ఎబోలా నియంత్రణపై అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ వ్యాప్తి మొదలైంది కూడా రెండు నెలల కిందటే అయినా.. దాన్ని గుర్తించడంలో వారు చాలా ఆలస్యం చేసినట్లు తెలుస్తోంది. ఐసోలేషన్ లేదు.. శానిటైజర్ ఉండదు. ఈశాన్య కాంగోలోని బునియా నగరంలో ఈ నెల 15న ఎబోలా తొలి కేసు నమోదైంది. కానీ, అంతకంటే దాదాపు రెండు నెలల ముందే అక్కడ ఈ వైరస్ వ్యాప్తి మొదలైనట్లు అంతర్జాతీయ సంస్థల విచారణలో తేలింది. దీన్నిబట్టి చూస్తే ఊహించిన దానికంటే తీవ్రస్థాయిలో ఇప్పటికే వైరస్ వ్యాప్తి చెంది ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, బునియాలో కేసు బయటపడిన తర్వాత కూడా కట్టడి చర్యలు తూతూ మంత్రంగా ఉన్నాయట. ఎబోల లక్షణాలున్న వారిని ఐసోలేషన్‌లో ఉంచడం, వైద్యులు పిపిఇ కిట్లు ధరించడం వంటివి మచ్చుకైనా అక్కడ కన్పించలేదు. ఇక, శానిటైజర్లు, టెస్ట్ కిట్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. జనరేటర్లకు సరిపడా ఇంధనం లేక.. రోజుకు 20 నుంచి 40 మందికి మాత్రమే టెస్టులు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

అంతేకాకుండా నిధుల కొరత కూడా వెంటాడుతున్నది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగోకు గతేడాది భారీగా నిధుల కోత విధించారు. దీంతో ఈ దేశం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మరోవైపు, అంతర్జాతీయ సహాయ సంస్థలకు కూడా నిధుల కొరత ఏర్పడింది. దీంతో వైరస్ నియంత్రణకు అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించే అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు.

# సంక్షిప్తంగా..

## 12 యేళ్ల బాలికపై హత్యాచారం!

**బుద్గాం, మే 25:** జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారు. ఆమె మృతదేహం ఇంటికి సమీపంలోనే లభ్యం కావడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితులను వెంటనే పట్టుకోవాలంటూ ప్రజలు నిరసనలకు దిగారు. గల్వాన్‌పోరా గ్రామానికి చెందిన బాలిక శనివారం సాయంత్రం మతపరమైన తరగతులకు వెళ్లి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు రాత్రంతా గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 7:15 గంటల ప్రాంతంలో ఇంటికి 200 మీటర్ల దూరంలోని పొలాల్లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమికంగా ఇది అత్యాచారం, హత్య కేసుగా నిర్ధారించినట్లు బుద్గాం ఎస్ఎస్పీ హరిప్రసాద్ కేకే తెలిపారు.

## సిఎం విజయ్‌పై పోస్టులు.. యాపిల్ ఉద్యోగి అరెస్టు

**కోయంబత్తూరు, మే 25:** కోయంబత్తూరు జిల్లాలోని సూలూరు సమీపంలో పదేళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి, హత్యఘటనకు సంబంధించి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కి పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను వ్యాప్తి చేశాడనే ఆరోపణలపై ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ సంస్థకు చెందిన ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. మైనర్ బాలిక హత్యాచార ఘటన దిగ్భ్రాంతిని కలిగించిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులను కార్తీ, మోహన్ రాజ్‌గా గుర్తించారు. కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో తిరునల్వేలి జిల్లాకు చెందిన జేమ్స్ రాజా అనే వ్యక్తి సీఎంకు పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను పోస్టు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు.

## జపాన్‌లో 90 వేల దెయ్యాల లోగిళ్లు!

**టోక్యో, మే 25:** టెక్నాలజీదేశంగా పేరున్న జపాన్‌లో విచిత్రంగా 90 లక్షల ఇళ్లు మనుషులు లేక వెలవెలబోతున్నాయి. స్థానికంగా వీటిని అకియా అని పిలుస్తుంటారు. చూసేవారికి ఇవి దెయ్యాల కొంపలుగా కనిపిస్తున్నాయి. కిటికీలకు కర్టెన్లు ఉన్నా, లోపల మనిషి లేని ఈ ఇళ్లు దేశానికి కొత్త రకం సమస్యగా మారాయి. 2023 సర్వే ప్రకారం, దేశంలోని మొత్తం ఇళ్లలో సుమారు 13.8 శాతం ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం జపాన్‌లో వేగంగా క్షీణిస్తున్న జనాభా. దేశంలో జననాల రేటు తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడంతో అనేక గ్రామీణ ప్రాంతాలు ఖాళీ అవుతున్నాయి. యువత ఉద్యోగాల కోసం నగరాలకు తరలివెళ్తుండటంతో పల్లెల్లో ఇళ్లను చూసుకునే వారు కరువయ్యారు. వారసత్వ సమస్యలు ఈ సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి.

## బొద్దింకల జనతాపార్టీపై పిటిషన్, సత్వర విచారణకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, మే 25:** 'బొద్దింకల జనతా పార్టీ' ట్రెండ్‌ను అంత సీరియస్‌గా తీసుకోవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పిటిషనర్‌కు సూచించారు. ఈ అంశానికి సంబంధించిన పిటిషన్‌ను అత్యవసర విచారణకు స్వీకరించాలని ఒక న్యాయవాది అభ్యర్థనను సిజె ధర్మాసనం తిరస్కరిస్తూ, తగిన సమయంలో స్వీకరిస్తామని పేర్కొంది. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి స్పష్టత ఇచ్చినప్పటికీ, "వక్రీకరించిన, దురుద్దేశపూర్వక కథనం కొనసాగుతోంది" అని న్యాయవాది ఎన్.కె. గోస్వామి వాదనలు వినిపించారు. దీంతో సిజె జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుని, "దీనిని అంత భావోద్వేగంతో తీసుకోవద్దు" అని అన్నారు.

సిబిఐ విచారణ జరిపించాలన్న అభ్యర్థనపైనా ఇప్పుడే నిర్ణయం తీసుకోలేమని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. దీంతో విచారణ నాలుగు వారాలకు వాయిదా వేశారు.

# రోడ్లపై నమాజ్‌లు, జంతు బలులు నిషేధం!

## బక్రీద్‌వేళ యుపిసిఎం కీలక ఆదేశాలు



**లక్నో, మే 25:** దేశంలోని ముస్లింలంతా బక్రీద్‌కు సిద్ధమవుతున్న వేళ ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. యూపీలోని రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాలలో నమాజ్ చేయడాన్ని, జంతు బలులను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూపీలో బక్రీద్ నిర్వహణపై ఆదివారం సీఎం యోగి ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. అనంతరం బక్రీద్‌పై అధికారులకు కీలక సూచనలు చేశారు. పది అంశాలను సూచిస్తూ, వాటిని అమలు చేయాలన్నారు. ఆయన ఆదేశాల ప్రకారం మసీదులలో మినహా ఎక్కడా నమాజ్ చేయడానికి వీల్లేదు. రోడ్లపై లేదా పబ్లిక్ ప్లేసులు వంటి ఎలాంటి బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ చేయకూడదు. జంతు బలులు కూడా నిషేధం. రోడ్లను బ్లాక్ చేయకూడదు. ఒకవేళ ప్రార్థనలు చేసే వాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే, షిఫ్టుల వారీగా చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో జంతు బలులు చేయకూడదు. నిషేధించిన జంతువులను వధించినా కూడా చర్యలు తీసుకుంటారు. జంతుబలుల తర్వాత పూర్తి పరిశుభ్రంగా ఉంచాలి. అపరిశుభ్రతకు తావివ్వకూడదు. చెత్త, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు.

# అన్నాడిఎంకెలో ముగ్గురు రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామా - టివికెలో చేరిక

**చెన్నై, మే 25:** తమిళనాడు రాజకీయాల్లో ఆకస్మిక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష అన్నాడీఎంకే కు చెందిన ముగ్గురు రెబెల్ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని అధికార తమిళగ వెట్రి కళగం టివికెలో చేరారు. ఈ ఆకస్మిక పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మధురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమార్వేల్, ధరాపురం ఎమ్మెల్యే సత్యభామ, పెరుందురై ఎమ్మెల్యే జయకుమార్ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు అందజేశారు. అనంతరం మంత్రి ఆధవ్ అర్జునను కలిసి వారు టీవీకేలో చేరారు. ఈ ముగ్గురు నేతలు అన్నాడీఎంకేలోని మాజీ మంత్రులు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి వర్గానికి సన్నిహితులుగా పేరుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాల్లో పోటీ చేసిన టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీకి కొన్ని స్థానాలు తగ్గడంతో కాంగ్రెస్, ఇతర పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వేలుమణి వర్గానికి చెందిన 25 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నట్లు అసెంబ్లీలో విజయ్ బలపరీక్ష సందర్భంగా తేలింది. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు అన్నాడీఎంకెకు గుడ్‌బై చెప్పడంతో భవిష్యత్తులో ఆ పార్టీ నుంచి మరిన్ని వికెట్లు పడతాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పటికే సీఎం విజయ్ తిరుచ్చి తూర్పు స్థానానికి రాజీనామా చేయగా ఇప్పుడు ఈ ముగ్గురి రాజీనామాలతో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య నాలుగుకు చేరింది.

# రహస్య ప్రదేశంలో మొజ్తాబా ఖమేనీ - దూతలతోనే మెసేజ్‌లు

**టెహ్రాన్, మే 25:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నా.. అవి ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీనికి కారణం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అందుబాటులో లేకపోవడమేనని తెలుస్తోంది. మొజ్తాబా ప్రస్తుతం రహస్య ప్రాంతంలో ఉన్నాడని అగ్రరాజ్య ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం దూతల సాయంతోనే అధికారులు, నాయకులకు ఖమేనీ సందేశాలు పంపిస్తున్నాడట. 'అమెరికా-ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను మొజ్తాబా ఖమేనీ చూసినట్లు మాకు సమాచారం అందింది. అయితే, దానిపై ఆయన నుంచి ఇంకా ఎటువంటి సమాధానం రాలేదు. ఇరాన్‌కు చెందిన సీనియర్ అధికారులు కూడా ఖమేనిని నేరుగా సంప్రదించలేక పోతున్నారు. అందుకే చర్చలు ఆలస్యమవుతున్నాయి' అని అమెరికా నిఘా వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ఖమేనీతో పాటు టెహ్రాన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా వారాల తరబడి బంకర్లలోనే ఉంటున్నట్లు తెలుస్తోంది. వీరంతా నేరుగా మాట్లాడుకోవడం లేదని సమాచారం. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తొలిరోజే సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అంతమొందించిన సంగతి తెలిసిందే. తర్వాత అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబాను సుప్రీం నేతగా ఎన్నుకొన్నారు. అయితే, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వార్తలు వచ్చాయి.



సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విహెచ్‌పి ప్రతినిధులు

## గో హత్యలు ఆపేందుకు కృషి చేస్తా

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చట్టవిరుద్ధమైన గో హత్యలను ఆపేందుకు కృషి చేస్తానని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా హామీ ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించడం శిక్షార్హమన్నారు. సమాజంలో అందరి విశ్వాసాలను గౌరవించాల్సిందేనని ఆయన చెప్పారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రతినిధి బృందం గవర్నర్ కలిసింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, గోరక్ష, సాధు సంతులు విభాగం ప్రతినిధులు గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందజేసి కొన్ని విషయాలను తెలిపారు. రాష్ట్రంలో అక్రమంగా బైండోవర్లు కొన సాగిస్తూ తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తూ మజ్లీస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసు యంత్రాంగం తీరును వారు గవర్నర్‌కు వివరించారు. బక్రీద్ సందర్భంగా వేలాది గోమాతలను బలిచ్చేందుకు దంపు చేసి ఉంచారని, వాటిని విడిపించి గోశాలకు తరలించడంలో పోలీసులు ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. రాష్ట్రంలో హిందువుల మనోభావాలకు ఏమాత్రం గౌరవం లేదని, గోమాతలు హత్యకు గురవుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదని, ఓటుకు ఇచ్చినంత విలువ గోమాతలకు ఇవ్వడం లేద న్నారు. గవర్నర్ మాట్లాడుతూ తనకున్న విశిష్ట అధికారాలను వినియోగించి గోవుల రక్షణకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విహెచ్‌పి నాయకులు యాదగిరిరావు, రమేష్, పగుడాకుల బాలస్వామి, సుభాష్‌చందర్, దుర్గా నందపురిస్వామి, విశోకతీర్థస్వామి, శ్రీకాంత్ ఇంద్రస్వామి, కృష్ణ చాముండేశ్వరీనాథస్వామి, హరికిషన్‌శర్మ, అనిల్ పాల్గొన్నారు.

## విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం

### తొలిసారిగా ప్రత్యేక సామర్థ్యంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్: సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి కాలంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కేయూ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పట్టణ ప్రాంతాల పరిధిలో సబ్ స్టేషన్ల నిర్మాణం కొరకు స్థలాలు లేకపోవడంతో ఉన్న సబ్ స్టేషనలలో పవర్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుకుంటూ వెళ్తున్నామని చెప్పారు. అలాగే పట్టణ ప్రాంతాల పరిధిలో ఇండోర్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సంస్థ పరిధిలోని పలు జిల్లాల్లో ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా హనుమకొండ నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించనున్నట్లు వివరించారు. ఈ 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ టీజీఎన్‌పీడీసీఎల్‌లోనే అత్యధిక సామర్థంతో ఏర్పాటు చేసిన తొలి పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా కొత్తూర్ 61 ఆంప్స్, ఈద్గా 110 ఆంప్స్, నయీంనగర్120 ఆంప్స్, సరస్వతినగర్ 76 ఆంప్స్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుందన్నారు. హనుమకొండ ప్రాంతంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో విద్యుత్ వ్యవస్థను విస్తరించడం జరుగుతోందని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అధిక సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా సేవలను మరింత మెరుగుపరుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, టి.మధుసూదన్, హన్మకొండ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సామ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న కృష్ణమ్మ.. వట్టిపోతున్న శ్రీశైలం డ్యామ్

### కుడి, ఎడమగట్టున నిలిచిపోయిన విద్యుదుత్పత్తి

### వెంటాడుతున్న ఎల్‌నినో భయాలు.. ఆలస్యం కానున్న వర్షాలు

### అదే జరిగితే తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్ సాగు, తాగునీటికి కటకటే

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాలకు గుండెకాయ లాంటి శ్రీశైలం జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఎప్పుడూ నిండు కుండలా, జలకళతో ఉట్టిపడే శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రస్తుతం వేగంగా అడుగంటిపోతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదకరంగా పడిపోతూ డెడ్ స్టోరేజీ వైపు దూసుకుపోతోంది. దీంతో అటు రాయలసీమతోపాటు ఇటు ఇరు తెలుగు రాష్ట్రాల్లోని సాగు, తాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు. కానీ ప్రస్తుతం అందులో కేవలం 817 అడుగుల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మొత్తం 215 టీఎంసీలకుగాను ఇప్పుడు జలాశయంలో కేవలం 39 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. సాధారణంగా 800 అడుగులకు నీటిమట్టం పడిపోతే దాన్ని డెడ్ స్టోరేజీగా పిలుస్తారు. అంటే శ్రీశైలం ఆ మార్కుకు మరెంతో దూరంలో లేదు. నీళ్ల క్రమంగా అడుగంటుతుండటంతో కుడి, ఎడమ గట్టున ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని అధికారులు ఇప్పటికే పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం కేవలం ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం (ఇండెంట్ ప్రకారం) మాత్రమే నీటిని వాడుతున్నారు. ఒకవేళ నీటిమట్టం 800 అడుగులకు చేరితే అసలు విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశమే లేకుండా పోతుంది. నిజానికి గత ఏడాది శ్రీశైలం ప్రాజెక్టుకు రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చింది. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి ఊహించని విధంగా భారీగా వరద రావడంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జూన్ నెలలోనే ప్రాజెక్ట్ పూర్తిగా నిండిపోయింది. గతంలో ఎప్పుడూ ఇంత త్వరగా శ్రీశైలం నిండిన దాఖలాలు లేవు. అప్పట్లో దాదాపు 1,218 టీఎంసీల నీరు శ్రీశైలానికి రాగా అధికారులు ఆ నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. కానీ గతేడాది అంతలా మురిపించిన కృష్ణమ్మ ఈ ఏడాది మాత్రం జనాన్ని టెన్షన్‌లో పడేస్తోంది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల వర్షాలు చాలా ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంది. వర్షాలు ముఖం చాటేస్తే శ్రీశైలం ప్రాజెక్టుపై ఆ ప్రభావం మరింత ఘోరంగా ఉంటుంది. వర్షాలు లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కూడా బాగా ఆలస్యమవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ శ్రీశైలం పైనే ఆధారపడి ఉన్నాయి. అలాగే దిగువన ఆంధ్ర, తెలంగాణల్లోని సాగర్ ఆయకట్టుకు కూడా శ్రీశైలం ప్రాజెక్టే ప్రధాన ఆధారం. ఈ నేపథ్యంలో వర్షాలు పడటం మరింత ఆలస్యమైతే రాబోయే రోజుల్లో తాగునీటి కోసం తీవ్రమైన కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని నీటిపారుదల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా వారోత్సవాలను విజయవంతం చేయండి

### ప్రపంచానికి మహిళా సాధికారతను చాటిచెప్పేలా విజయవంతం చేయాలి

### గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పిలుపు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఒకప్పుడు చిన్న పొదుపు సంఘాలుగా ప్రారంభమైన స్వయం సహాయక సంఘాలే నేడు తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థికసాధికారత చేకూర్చడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి సోమవారం ఆమె వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వారోత్సవాలు మహిళా శక్తి మహోత్సవ కార్యక్రమమని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర అని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, మహిళల శక్తి, సామర్థ్యాలు, ఆత్మవిశ్వాసం, సాధికా రతను ప్రపంచానికి చాటి చెప్పే మహోత్సవమని అభివర్ణించారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా, ఉపాధి సృష్టికర్తలుగా తీర్చిదిద్దు తోందని వివరించారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఆర్థిక స్వావలంబనకు బలమైన తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు.క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, సెంట్రింగ్ యూనిట్లు, ఇటుకల తయారీ కేంద్రాలు వంటి రంగాల్లో మహిళలు ముందంజలో నిలవడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయ వనరులు సృష్టించుకునే దిశగా ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు 8 వేల మహిళా భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు వెల్లడించారు. కోటి చీరల పంపిణీతో పాటు రూ.60 వేల కోట్లకు పైగా బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆడబిడ్డ బలపడితే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా వారోత్సవాలను ప్రతీ మహిళ తన ఆత్మగౌరవ పండుగగా భావించి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కర్ణాటక సాగునీటి ప్రాజెక్టులతో రైతుల ప్రయోజనాలకు భంగం కలగొద్దు

### ఆ రాష్ట్ర మంత్రి బోసురాజుతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### కృష్ణా జలాల వినియోగంపై సచివాలయంలో ఉభయ రాష్ట్రాల మంత్రుల కీలక భేటీ



**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగం, తాగు నీటి అవసరాలపై కీలక సమావేశం జరిగింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ సచివాలయంలోని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాంబర్‌లో కర్ణాటక చిన్న నీటిపారుదలశాఖ మంత్రి బోసురాజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలుగకుండా కర్ణాటక ప్రాజెక్టుల రూపకల్పన ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాలకు మేలుజరిగే రీతిలో సాగు, తాగునీటి ప్రాజెక్టు లపై కూలంకషంగా చర్చించారు. కృష్ణానదిపై ప్రాతిపదిత బ్యారేజ్ నిర్మాణ అంశాలపై సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. తెలంగాణ సాగునీటి హక్కులు, భవిష్యత్ అవసరాల పరిరక్షణ, కృష్ణా జలాల సమన్యాయ వినియోగంపై రాష్ట్ర హక్కు లను కాపడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల మంత్రులు చర్చించారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. తెలంగాణ రైతాంగం సాగునీటి అవసరాలపై ఈ సందర్భంగా చర్చల్లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. పరస్పర అవగాహనతోనే కృష్ణా జలాలను తెలంగాణ, కర్ణాటక వినియోగించాలని మంత్రులు నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, రాయచూరు ఎంపి. కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి, రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసవన్న గౌడ, ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, వంశీ కృష్ణ, రాష్ట్ర నీటిపారుదల కార్యదర్శి ఇ. శ్రీదర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ.ఎన్.సి రమేశ్‌బాబు, కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ కార్యదర్శి బి.కే. పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర వైఫల్యాల వల్లే ఇంధన సంక్షోభం: విహెచ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 25:** ప్రధాని నరేంద్ర మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని.. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు (వీహెచ్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో సామాన్యుడు ఎక్కడికి వెళ్లినా పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం. మోదీ నిర్ణయాల వల్ల ఆయన స్నేహితులు అంబానీ, అదానీ లాభపడుతున్నారు. ప్రధాని మోదీ నిరంతరం జపించే సబ్ కా సాత్‌సబ్ కా వికాస్ అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది. ఆచరణలో మాత్రం అది అందరినీ ఇబ్బంది పెట్టే విధానంగా మారింది. యుద్ధాన్ని ఆపేందుకు మోదీ ఎందుకు ప్రయత్నం చేయలేదు? మోదీకి ట్రంప్ ఫ్రెండ్ అని అంటారు కదా ట్రంప్‌కి చెప్పి యుద్ధాన్ని ఆపవచ్చు కదా. దేశ ఆర్థిక పరిస్థితి కుంగి పోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో ఎలా గెలవాలో తెలిసిన అమిత్ షాకి ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదా? అని ప్రశ్నించారు.

# మహిళా సంఘాలకు మరో 39 పెట్రోల్ బంకులు

### రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం

### లాభాల బాటలో ఇప్పటికే నిర్వహిస్తున్న వైనం

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలోని సాధికారత, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక స్థితిగతులను పెంపొందించే దిశకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే మహిళా సమాఖ్యల ద్వారా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలోని పెట్రోల్ బంకులు విజయవంతంగా నడుస్తుండడంతో వాటిని రాష్ట్రంలోని అన్ని నియోగజకవర్గాలకు విస్తరించాలని నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులను ఏర్పాటు చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇందుకు సంబంధించిన కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసిన సెర్ప్ పనులను మరింత వేగవంతం చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రయోగాత్మకంగా మహిళా సమాఖ్యల ఆధ్వరంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లు విజయవంతంగా నడుస్తుండ డంతో రాష్ట్రం వ్యాప్తంగా మరో 39 ప్రాంతాలలో కొత్త గా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చేసేందుకు ప్రభుత్వం సిద్దమైంది.

ఇప్పటికే వాటి ఏర్పాటుకు సంబంధించిన పనులు సైతం వేగంగా జరుగు తున్నాయి. ఆయా ప్రాంతాల్లో బంకుల ఏర్పాటుకు ప్రముఖ ఆయిల్ కంపెనీలతో సెర్ప్ చర్చలు జరిపింది. ఈ ఆయిల్ కంపెనీల సహకారంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ, లీజు ఒప్పందాలు, లేఅవుట్ల రూపకల్పనకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. ఆదిలాబాద్, వికారాబాద్, వనపర్తి, ఖమ్మం, కుమురంభీం, హనుమకొండ జిల్లాల్లో ఇప్పటికే స్థలాన్ని గుర్తించడం, నిర్మాణ పనులు ప్రారంభించడం కూడా జరుగుతుంది. ఇక కరీంనగర్ జిల్లాలో బంక్‌ల ఏర్పాటుకు వివీదిలు లభించగా కామారెడ్డి, సూర్యాపేట, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇప్పటికే లీజు ఒప్పందాల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది.

## ఆకస్మిక తనిఖీలు చేసిన డిజిపి ఆనంద్



డిజిపి కార్యాలయంలో పలు విభాగాలను తనిఖీ చేస్తున్న డిజిపి ఆనంద్. చిత్రంలో శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్, సిఐడి డిజి చారుసిన్హా తదితరులు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** డిజిపి సి.వి ఆనంద్ సోమవారం నాడు తన కార్యాలయంలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చే శారు. సిఐడితో పాటు ఆర్గనైజేషన్స్, పి అండ్ ఎల్ విభాగాలను డిజిపి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన అక్కడి అధికారులు, సిబ్బంది తో మాట్లాడి కీలక సూచనలు చేశారు. అన్ని విభాగాల సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించి ఎక్కడ పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆదే శించారు. అన్ని విభాగాలను పరిశుభ్రంగా వుంచాలని, విధుల్లో అందరు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన తెలిపారు.

కార్యాల యాలలో సంబంధిత సెక్షన్లకు సంబంధించిన ఫైళ్లు ఎక్కడ పడితే అక్కడ వుంచవద్దని, వాటిని పనిపూర్తి కాగానే రికార్డు రూంలకు తరలించాలని డిజిపి ఆదేశించారు. అన్ని విభాగాల్లో గోడలకు ఒకే రంగు వుండేలా చూడాలని, బీరువాలు, టేబుళ్లకు కూడా ఇదే రంగును వాడాలని ఆయన సూచించారు. కాన్ఫరెన్స్ హాల్, శిక్షణ గదులు విశాలంగా వుండేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఇందుకోసం అవసరమైతే వాటిని పునర్‌నిర్మించాలని డిజిపి ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిజిపి వెంట శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, ఆర్గనైజేషన్స్ డిజి స్వాతి లక్రా, టెక్నికల్ విభాగం డిజి శ్రీనివాసరావు, సిఐడి డిజి చారు సిన్హా, ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, గజారావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రులు, మెడికల్ కాలేజీల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

### కోఠి డిఎంఇ కార్యాలయం ముందు

### మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని కోఠి డిఎంఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసు పత్రులతోపాటు మెడికల్ కాలేజీల్లో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని ఆసుపత్రుల్లో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్, స్వీపర్ ఇతర కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యాద నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు.

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దుచేసి ప్రభుత్వమే కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేతనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్య విద్య సంచాలకులు, కమిషనర్ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కి ఇచ్చినట్టు యూనియన్ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 20 రోజులలో వేతనాల పెంపు మీద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారని, 20 రోజుల లోపు వేతనాలు పెంచకపోతే దశల వారి ఆందోళన పోరాటాలతోపాటు, అవసరమైతే నిరవధిక సమ్మెకు ఉద్యోగులందరూ సిద్ధంగా ఉన్నారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద నాయక్ స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జె సుధాకర్, రమేష్, ప్రకాష్, దేవిదాస్, సుమన్, కర్ణాకర్, రాజు, కుమారస్వామి, విజయ, సదానందం, రమేష్, తిరుపతి, మైపాల్, జంపయ్య మనోహార్ పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోన్న కేంద్రం

### ప్రతి ధాన్యం గింజను కేంద్రం కొనాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రైతులకు భరోసా అంటూ బీజేపీ మోసపూరిత యాత్రలు చేస్తోందన్నారు. ప్రతి ధాన్యపు గింజను కేంద్రం కొనాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలతో బీజేపీ ప్రజలను మోసం చేస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ, ప్రజలను సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు రైతు ఘోస - బీజేపీ భరోసా పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా అని మండిపడ్డారు. నిజంగా రైతులపై బీజేపీకి ప్రేమ ఉంటే ముందుగా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేస్తున్నా మన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్ర ం, రైతులకు మాత్రం నయా పైస రుణమాఫీ చేయకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు.



## థియేటర్లలో పర్సంటేజ్


### చిరంజీవితో ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల గిల్డ్, ఎగ్జిబిటర్ల భేటీ

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** సినిమాల ప్రదర్శనకు సంబంధించి పర్సంటేజ్ విధానంపై నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై మెగాస్టార్ కొణిదల చిరంజీవి దృష్టిసారించారు. ముఖ్యంగా పెద్ద సినిమా నుంచే తమకు పర్సంటేజి విధానాన్ని అమలు చేసే విషయంపై చర్చించేందుకు తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ హైదరాబాద్‌లో సోమవారం చిరంజీవితో భేటీ అయింది. ఈ భేటీలో పర్సంటేజి విధానంతో పాటు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు, రెంటల్ విధానంలో తాము చూస్తున్న నష్టాలను గురించి అసోసియేషన్ చర్చించింది. అలాగే పర్సంటేజిపై తమ నిర్ణయాలను ఫిలిం చాంబర్ అధ్యక్షుడు సురేష్ బాబు, కేఎల్ నారాయణ, నిర్మాత దిల్ రాజు చిరంజీవికి వివరించారు. దాదాపు గంట సమయంపాటు ఈ సమావేశం కొనసాగింది. సమావేశం ముగిసిన అనంతరం చిరంజీవి గిల్డ్ నిర్మాతలకు ఫోన్ కాల్ చేసి పిలిచారు. గిల్డ్ నిర్మాతలంతా చిరంజీవి ఇంటికి చేరుకుని, ఆయనతో సమావేశమయ్యారు. ఎగ్జిబిటర్ల సమావేశం ముగిసిన తర్వాత నిర్మాత దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. చిరంజీవితో సమావేశం అనంతరం ఎగ్జిబిటర్లంతా సంతోషంగా ఉన్నామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సినీ పరిశ్రమకు సంబంధించిన సమస్యను ఆయన అర్థం చేసుకున్నారని, రెండ్రోజుల్లో ఎగ్జిబిటర్ల సమస్యకు ఫుల్ స్టాప్ పెట్టేలా నిర్ణయం వెల్లడిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని దిల్ రాజు చెప్పారు. ఎగ్జిబిటర్ల డిమాండ్లపై ఫిలిం చాంబర్ ఇప్పటికే ఒక కమిటీ వేసిందని, ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టును చిరంజీవి తెప్పించుకుంటారని తెలిపారు. మరోవైపు రేపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో సినీ నిర్మాతలు భేటీ కానున్నారు. చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించడంతో పాటు, పర్సంటేజీ విధానంపై కూడా చర్చించనున్నారు.

## ఎల్ అండ్ టి గెస్ట్‌హౌస్‌లో అగ్నిప్రమాదం

### ఘటనస్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సంకీర్త్

### పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు



**మహాదేవపూర్, మే 25, ప్రభాతవార్త:** మహా దేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామ సమీపంలోని ఎల్ అండ్ టీ గెస్ట్ హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమా దానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టారన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వేగంగా స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారన్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. అయితే ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెలుగులోకి రానున్నాయి. వారి వెంట కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఎల్ అండ్ టీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# కేంద్రం సహకరించకున్నా ధాన్యం కొనుగోలు

## మూసీ పునరుజ్జీవంపై రాజకీయం చేయడం తగదు

## మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

## సిపిఐ, సిపిఎం నేతలతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 25:** కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. కనీసం 30శాతం ధాన్యం కూడా సేకరించడం లేదని. కేంద్రప్రభుత్వం సహకరించక పోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సిపిఐ, సిపిఎం బృందాలు వేర్వేరుగా సిఎంతో సమావేశమయ్యాయి. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నేతృత్వంలో ఆయా పార్టీల నేతలు సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై నేతలు ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. సీపీఐ బృందంలో ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ, ఈటి.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు ఉన్నారు. కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ, సిపిఎం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

సిపిఎం బృందంతో సిఎం మాట్లాడుతూ కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి గింజ కొనడం లేదన్నారు. పండిన పంటలో 30 శాతం కూడా సేకరించడం లేదు. పంట కొనుగోలు పైన కేంద్రాన్ని ప్రశ్నించాలి అని వారికి చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తున్నామని, బెంగాల్ ఎన్నికల వల్ల కొంత హమాలీల కొరత ఏర్పడింది..ఎండ వల్ల మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల పైన నిరంతరం సమీక్ష చేస్తున్నం, రూ.500 బోనస్ ఇచ్చి సన్న వడ్లు కొనుగోలు చేస్తున్నాం.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం అని చెప్పారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి స్థానికం గానే నివాసాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ రాజకీయం చేయడం తగదని పేర్కొన్నారు. మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం..మూసీ ప్రాజెక్ట్ వల్ల యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, నగర ప్రజలకు క్వాలిటీ లైఫ్ ఇవ్వడమే నా ఉద్దేశమని చెప్పారు..ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్న..నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్, భోజనం అందిస్తున్నామన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఆరుట్ల స్కూల్‌ను సీపీఎం నాయకులు ఒకసారి సందర్శించాలని చెప్పారు.



సిపిఎం బృందంలో మాజీ ఎమ్మెల్యే, జూలకంటి రంగారెడ్డి, పి ప్రభాకర్, పి. సుదర్శన్, టి జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి ్మ, సామినేని స్వరాజ్యం, ఎం. గోపాలరావు ఉన్నారు. సిపిఐ, సిపిఎం బృందాలతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సింగరేణి వికాసమే ధ్యేయం

### ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులు సాధించాలి:

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** సింగరేణి వికాసమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రస్తుత పోటీ మార్కెట్లో సింగరేణి నిలదొక్కుకోవాలంటే ఇతర రాష్ట్రాల్లో కొత్త బ్లాకులను సాధించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అత్యంత నాణ్యమైన బొగ్గును మార్కెట్లో విక్రయించే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని అన్నారు. తెలంగాణకు కొంగు బంగారంగా ఉన్న సింగరేణితో పాటు, కోల్ బెల్ట్ అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ తరఫున, అలాగే ప్రభుత్వం తరఫున కోల్ బెల్ట్ లో ఇచ్చిన హామీల అమలు విషయంలో తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించగలిగే కొత్త బ్లాకులను సింగరేణి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనేపథ్యంలో కొత్త బ్లాకులు సాధించేలా సింగరేణి తగు ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. కొత్త బ్లాకులను సాధించడంతోపాటు నాణ్యమైన బొగ్గును అమ్మడం ద్వారా సింగరేణి సంస్థను కాపాడుకోగలమని చెప్పారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆయా ప్రాంత శాసన సభ్యులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకొచ్చారు. సింగరేణి అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు చేస్తున్న విజ్ఞప్తులను, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని భట్టి విక్రమార్క సంస్థ యాజమాన్యానికి సూచించారు. దీనిపై ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి కోల్ బెల్ట్ శాసన సభ్యులు సమర్పించే విజ్ఞప్తులపై తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో సింగరేణి ప్రాంత కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. ఇక ముందు కూడా సంస్థ అభివృద్ధికి, సింగరేణి ప్రాంత అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ, విద్యుత్ శాఖ స్పెషల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, సింగరేణి జనరల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్ తదితర అధికారులు పాల్గొన్నారు.


# సిఎం రేవంత్‌రెడ్డితో కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 25:** ఇటీవల ఎంపికైన వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, వైస్ చైర్మన్లు సోమవారం సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ల నిర్వహణకు సంబంధించి సిఎం దిశానిర్దేశం చేశారు.

# అందుబాటులో యూరియాకు ప్రత్యామ్నాయాలు

### రైతులకు వ్యవసాయ వర్సిటీ విసి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** ఇతర ఎరువులతో పోలిస్తే చౌకగా లభ్యమవుతుండడంతో యూరియా వాడకం ఇటీవల గణనీయంగా పెరిగిందని వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి అల్దాన్ జానయ్య ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా అధిక వినియోగంతో పంట దిగుబడుల్లో పెద్ద మార్పు లేనప్పటికీ ఇతర ఆరోగ్య, వాతావరణ సమస్యలకు ప్రధాన కారణమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో గల్ఫ్ యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరా తగ్గినా దాని ప్రభావం పెద్దగా వ్యవసాయ రంగంపై ఉండదని, రైతాంగానికి యూరియాకి ప్రత్యామ్నాయ మార్గాలు చాలా ఉన్నాయని స్పష్టం చేశారు. యూరియా పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దుష్ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. ఆశించినంత మేర లభ్యం కాకపోయినా అదే ధరలతో నానో యూరియా మార్కెట్లో కావలసినంత పరిమాణంలో అందుబాటులో ఉన్నదని గుర్తు చేశారు. నానో యూరియా వాడకం వలన కూడా మొక్కలకు కావలసిన నత్రజని అందించటం వలన యూరియా వాడకం ద్వారా వచ్చే ఫలితాలే నానో యూరియా వలన వస్తాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వంచే ధ్రువీకరించబడిన జీవన ఎరువులు కూడా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయని వాటిని కూడా యూరియాకి ప్రత్యామ్నాయంగా వినియోగించొచ్చని చెప్పారు. వీటితో పాటు పచ్చిరొట్ట విత్తనాలను రైతాంగం సేకరించి తొలకరి వర్షాలు రాగానే పొలాలలో చల్లి, విత్తిన 40 రోజుల్లో ఆయా పంటలను పొలంలో కలియదున్నితే నేలలో సేంద్రియ కర్బనం పెరిగి నేల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. వీటితోపాటు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో ఈ సంవత్సరం వర్షపాతం కొంచెం తగ్గే అవకాశం ఉన్నందున బోరు, బావులు, చెరువుల క్రింద వరికి బదులు పప్పుదినుసులు లేదా నూనెగింజల పంటలు సాగు చేస్తే యూరియా వాడకం పెద్దగా ఉండదన్నారు. ఈ పరిస్థితులను ఒక సదవకాశంగా వాడుకుని పంట మార్పిడి వైపు రైతాంగం మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.



సోమవారం గాంధీ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

# గాంధీ ఆస్పత్రిలో వైద్యుడిపై రోగి సహాయకురాలి దాడి

### ధర్నాకు దిగిన జూనియర్ డాక్టర్లు

### నిందితురాలిపై కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్ (సికిందరాబాద్), మే 25, ప్రభాతవార్త:** గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై రోగి సహాయకురాలి దాడి కలకలం రేపింది. ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ ఐఎంసీ వార్డులో విధి నిర్వహణలో ఉన్న జూనియర్ వైద్యుడు శివశంకర్‌పై, ఓ రోగి అటెండర్ మోనిక మెర్లిన్ అత్యంత అనాగరికంగా దాడికి తెగబడింది. రోగి ఆరోగ్య వివరాలు చెప్తున్న సమయంలో మోనిక నిరంతరాయంగా వీడియో కాల్ మాట్లాడుతుండటంతో డాక్టర్ ఆమెను వారించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె అసభ్య పదజాలంతో దూషిస్తూ, వైద్యుడిని ఫోన్‌లో రికార్డ్ చేయడం ప్రారంభించింది. వైద్యుడు ఆమె ఫోన్ లాక్కొని డ్యూటీ సిస్టర్‌కు ఇవ్వడంతో రెచ్చిపోయిన మోనిక డాక్టర్ శివశంకర్‌పై చేతులతో దాడి చేసింది. ఈ ఘటనలో వైద్యుడి కళ్లజోడు పగిలిపోయి, నుదుటిపై తీవ్ర గాయాలయ్యాయి. వార్డులో గందరగోళం సృష్టించిన ఆమెపై బాధితుడి ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడికి నిరసనగా సోమవారం ఉదయం జూనియర్ డాక్టర్లు (జూడాలు) విధులను బహిష్కరించి ఆసుపత్రి ప్రధాన భవనం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ప్రభుత్వ వైద్యులకు రక్షణ కల్పించాలని, భద్రతా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. డీఎంఈ నరేందర్‌కుమార్, గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.వాణి, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలు జూడాలతో చర్చలు జరిపి, పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం ఆందోళన విరమించారు. నిందితురాలిపై మెడికేర్ సర్వీసెస్ యాక్ట్2008 కింద కఠిన సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

# త్వరలో పంటల మార్పిడి తుది నివేదిక

### రూపొందించే పనిలో

### రైతు కమిషన్

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంటల మార్పిడి విధానం, భవిష్యత్ వ్యవసాయ ప్రణాళికలు, రైతుల ఆదాయాభివృద్ధికి సంబంధించిన తుది నివేదిక రూపొందించే పనిలో రైతు కమిషన్ బిజీ బిజీగా ఉంది. ఈ అంశంపై వివిధ రంగాల నిపుణులతో కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ కోదండరెడ్డి సోమవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగవుతున్న పంటల విధానం, నీటి లభ్యత, భూసార పరిస్థితులు, మార్కెట్ డిమాండ్, రైతుల ఆర్థిక స్థితి తదితర అంశాలను సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా పంటల మార్పిడి ద్వారా రైతుల ఆదాయం పెంపు, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, భూసార పరిరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను రూపొందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.
అదేవిధంగా ఉద్యాన పంటల విస్తరణ, మిల్లెట్లు, పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం, రైతులకు మార్కెట్ ఆధారిత పంటలపై అవగాహన కల్పించడం, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి విషయాలపై నిపుణులు పలు సూచనలు చేశారు. గ్రామీణ స్థాయిలో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, సాగు ఖర్చులను తగ్గించే సాంకేతిక పద్ధతులను ప్రోత్సహించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను రూపకల్పన చేయడం అవసరమని అభిప్రాయపడ్డారు.
సమావేశంలో వచ్చిన సూచనలు, సిఫారసులను సమగ్రంగా పరిశీలించి తుది నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, కేవీఎన్‌రెడ్డి, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మరికంటి భవానీరెడ్డి తెలిపారు.
గత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యానవన పంటలు, మిల్లెట్ సాగు గణనీయంగా పడిపోయిందని కమిషన్ చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది రైతులు వరి, పత్తి, మొక్క జొన్న సాగుకే మొగ్గుచూపుతున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో పంటల మార్పిడి తప్పనిసరిగా మారిందని హెచ్చరించారు. చిరుధాన్యాలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని దాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు అటు ఆవైపు మళ్లాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు అజేయ కల్లం, వి. నాగిరెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ అదనపు వ్యవసాయ సంచాలకులు నారాయణరావు, మాజీ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ పి. రాఘవరెడ్డి, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి. కృపాకర్‌రెడ్డి విలువైన సూచనలు అందించారు.

# తెలంగాణలో నిరంతర ఇంధన సరఫరా

### ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు

### వెల్లడించిన ఆయిల్ కంపెనీలు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇంధన డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతరం సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం లేకుండా పెట్రోల్ (ఎంఎస్), డీజిల్ (హెచ్ఎస్‌డీ), ఎల్‌పీజీ అందుబాటులో ఉండేలా చూస్తున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వెల్లడించాయి. వివిధ రంగాల్లో ఇంధన డిమాండ్ ఒక్కసారిగా పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థ ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగుతోందని తెలిపింది. ముఖ్యంగా 2026 మే నెలలో తెలంగాణలో పంట కోత, వ్యవసాయ పనులు ఊపందుకోవటంతో పాటు భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. దీనివల్ల ఇటీవల కాలంలో చమురు ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఇదిలా ఉంటే 2026 మే నెలలో తెలంగాణలో ఇంధన విక్రయాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. సాధారణ వృద్ధి రేటు కంటే చాలా ఎక్కువగా డీజిల్ (రిటైల్) విక్రయాలు 12.6 శాతం, పెట్రోల్ (రిటైల్) విక్రయాలు 9 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) పెట్రోల్ బంకుల్లో జరిగిన డీజిల్ అమ్మకాలు 25 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయగా 12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం మధ్య వృద్ధి నమోదైంది. మే నెలలో చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) తెలంగాణవ్యాప్తంగా 37 లక్షలకు పైగా గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్లను సరఫరా చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం

### 'రైతు గోస-బిజెపి భరోసా' యాత్రలో

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫైర్

**కుల్కచర్ల, మే, 25, ప్రభాతవార్త:** తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచదర్ రావుతోపాటు బిజెపి ఎమ్మెల్యేలు, పిఎంలు మండిపడ్డారు. రైతు గోస బిజెపి భరోసా యాత్రలో భాగంగా జిల్లా కన్వీనర్ కరనం ప్రహ్లాద్‌రావు అధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాని పరిశీలించి రైతులో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పివిఆర్ ఫంక్షహాల్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాజెక్టుల పేరుతో రూ. లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ పాలనను ప్రజలు చూశారు. వరి కొనుగోలు కేంద్రాలలో ఎదురవు తున్న తీవ్ర జాప్యం, తేమ మరియు రంగు మారిన ధాన్యం నిబంధనల వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని బీజేపి నేతలు ఆరోపించారు.
ప్రతి ఎకరానికి రూ. 7500 ఇస్తామని చెప్పి అ హామీని కూడా నెరవేర్చ లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకకోటి 45 లక్షల టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంగా 45 టన్నులు సేకరించామని సిఎం పేర్కొంటున్నారని కాని వాస్తవ రూపంలో 30శాతం కూడ సేకరించని పరిస్థి లేదన్నారు. రైతులు పండించిన పంటను ఎలా అముకోవలో అని అందోళ చెందుతున్నరని ఆరోపించారు. రైతు గోస బిజెపి భరోసా తో క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యను పరిష్కరించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసన మండలిలిపక్ష నేత ఏవిఎన్ రెడ్డి, ఎంపిలు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, డికె ఆరుణ, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బిజెపి నేతలు

# బయట సంస్థలకు విద్యుత్ కేంద్రాల నిర్వహణ

### తెలంగాణ జెన్‌కో ప్రతిపాదన

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాల నిర్వహణను తొలిసారిగా బయటి సంస్థలకు అప్పగించేందుకు తెలంగాణ విద్యుత్ ఉత్పాదన సంస్థ జెన్కో ఆలోచిస్తోంది. రాష్ట్రంలోని నల్గొండ జిల్లా దామరచర్ల సమీపంలో నూతనంగా నిర్మించిన, 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం కలిగిన యాదాద్రి విద్యుత్ కేంద్రం నిర్వహణ బాధ్యతలను పాక్షికంగా బిహెచ్ఇఎల్‌కు అప్పగించే విషయమై ప్రస్తుతం అంతర్గత చర్చలు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. ఈ కేంద్రంలోని నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పాదన ఇప్పటికే ప్రారంభం కాగా, ఐదవ యూనిట్‌ను వచ్చే ఆగస్టు/ సెప్టెంబర్ నెలలో ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ ఐదు యూనిట్లలోనూ పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పాదన జరగాలంటే, రోజుకు సుమారు 50 వేల టన్నుల బొగ్గు వినియోగం అవసరమవుతుందని అంచనా. దీనివల్ల వెలువడే బూడిద సుమారు 15,000 నుండి 20,000 టన్నుల వరకు నిరంతరం తొలగించి, తరలించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నిర్వహణ పనులను చేపట్టేందుకు గాను, ఆరు నెలల కాలానికి రూ.30 కోట్ల మొత్తాన్ని చెల్లించేందుకు జెన్కో ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఈ పనులను పూర్తి చేయడానికి తాత్కాలిక ప్రాతిపదికన వందలాది మంది సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, అందుకు రూ.60 కోట్లు అవసరం అవుతుందని, ఖమేరకు సమకూర్చాలని బిహెచ్ఇఎల్ సూచించినట్లు వెల్లడైంది.

# సంక్షేమ గురుకులాల అద్దె పెంపు ప్రతిపాదనలు వద్దు

### స్పష్టం చేసిన సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల భవనాలకు సంబంధించిన నెలవారీ అద్దె పెంపునకు బ్రేక్ పడింది. అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు జూన్ నెలతో ప్రారంభం కానున్న 2026-27 సంవత్సరానికి గాను రెంట్ పెంపు ప్రతిపాదనలు చేయవద్దని ఎస్సీ గురుకుల సొసైటీ అధికారులు రాష్ట్రంలోని గురుకులాల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. సొసైటీ పరిధిలోని పలు గురుకుల పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీలు అద్దె భవనాల్లో కొనసాగుతు న్నాయి. కిరాయిలను లోకల్ లెవల్ అసెస్‌మెంట్ కమిటీల ద్వారా ఆయా ప్రాంతాలవారీగా గతంలో నిర్ధారించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్కేర్ ఫీట్ రూ.814 చొప్పున, పట్టణ ప్రాంతా ల్లో రూ.12 20వరకు, హైదరాబాద్ పరిధిలోకి ఇంకా కొంచెం ఎక్కువగా నిర్ణయించారు. సగటున ఒక్కో హాస్టల్ బిల్డింగ్‌కు నెలవారీగా కనిష్ఠంగా రూ.2.50లక్షల నుంచి గరిష్ఠంగా రూ.14 లక్షల వరకు ప్రస్తుతం చెల్లిస్తున్నారు.

# పంట వ్యర్థాల కాల్చివేతతో పెరుగుతున్న అనర్థాలు

### హెచ్చరించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త :** పంట వ్యర్థాలను కాల్చకుండా, దుక్కిలోనే కలియదున్ని శాస్త్రీయ పద్ధతులననుసరించి భూ సారాన్ని కాపాడుకోవాలని రైతులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో వ్యవసాయశాఖ అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది రైతులు ఇప్పటికీ పంట వ్యర్థాలను కాల్చివేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాకు చెందిన రైతులు చాగర్ల చంద్రమౌళి, భాగ్యమ్మలు పంట వ్యర్థాలు కాల్చే క్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన తీవ్ర విచారం కలిగించిందని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారులతోపాటు కిందిస్థాయి సిబ్బందికి మెమోలు జారీ చేశామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా.. పంట వ్యర్థాల దహనం వల్ల గాలి కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా వేసవి కాలంలో మంటలు వేగంగా వ్యాపించి ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాల బహిరంగ దహనాన్ని పూర్తిగా నిషేధిస్తూ పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ జివో 27 ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రైతులకు గుర్తు చేశారు. భూములపై, చెత్త మైదానాల్లో (ల్యాండ్‌ఫిల్ సైట్లలో) లేదా ఇతర ప్రదేశాల్లో వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిహార రుసుము విధించేందుకు అవకాశం ఉందన్నారు. సాధారణంగా చెత్తను కాల్చితే రూ.5,000, భారీ స్థాయిలో వ్యర్థాలను కాల్చితే రూ.25,000 పర్యావరణ పరిహారం విధిస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు పర్యావరణ పరిరక్షణలోభాగస్వాములై చెత్తను, వ్యవసాయ వ్యర్థాలను బహిరంగంగా కాల్చకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 11 కొత్త ఎఇడిపి కోర్సులు

### 96 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అమలు.. 8వేల మంది చేరిక లక్ష్యం

### దోస్త్ మొదటి ఫేజ్‌లో 11.9 శాతం.. కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కొత్తగా 11 అప్రెంటిస్ షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఏఈడీపీ) కోర్సులను ప్రారంభించనున్నట్టు కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ఇప్పటికే 16 కోర్సులను కొనసాగిస్తున్న నేపథ్యంలో కొత్తగా మరో 11 కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికే దోస్త్ మొదటి విడతలో 1379 మందికి ఏఈడీపీ కోర్సుల్లో సీట్ల కేటాయింపును చేశారని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 8వేల సీట్లను ఏఈడీపీ కోర్సుల్లో చేర్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ ఈ ఏడాది కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను కళాశాల విద్య, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం రూసా కార్యాలయంలో మీడియాకు వివరించారు.

పాలిటెక్నిక్ కోర్సులతోపాటు, కొత్తగా ప్రారంభించనున్న ఏఈడీపీ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ ఉన్న నేపథ్యంలో పరిశ్రమలతో ఎంవోయులు చేసుకుని ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. మీడియా సమావేశంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి, సీఐఐ మాజీ ఛైర్మన్ శేఖర్ రెడ్డితోపాటు కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్స్ బాల భాస్కర్, రాజేంద్ర సింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. పాలిటెక్నిక్‌లో మూస పద్ధతులను కాకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఈ విద్యాసంవత్సరంలో 10 కొత్త కోర్సులను తీసుకొచ్చామని శ్రీదేవసేన తెలిపారు. ఇంటర్న్‌షిప్ ఉన్న కోర్సులకు ప్రాధాన్యత ఇస్తూ.. ఒక చేత్తో పట్టా.. ఒక చేత్తో ఉద్యోగం ఇవ్వాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి చోట ఏఐని వాడుతున్నారని, డిప్లొమాలో ఎక్కడా ఏఐని వాడటం లేదని, తామే తొలిసారిగా దీన్ని డిప్లొమాలో అమలు చేస్తున్నామన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి మాట్లాడుతూ.. తాను 10వ తరగతి పూర్తయిన తరువాత పాలిటెక్నిక్‌లో చేరి డిప్లమా పూర్తి చేశానని, తరువాత కాలంలో తాను ఐఐటీలో చేరి ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీకి డైరెక్టర్‌గా కొనసాగుతున్నానని తెలిపారు.
ఐఐటీ హైదరాబాద్‌లో విద్యార్థులకు 6 నెలల పాటు ఇంటర్న్ షిప్ అమలు చేస్తున్నామని, ఇలాంటివి అమలు చేయాలంటే డిప్లొమా బేస్ కీలకమన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా నిలవాలన్నా, వికసిత్ భారత్‌గా ఎదగాలంటే కొత్త ఆలోచనలు అవసరమన్నారు. మేడిన్ ఇండియా ప్రొడక్ట్ అన్ని దేశాల్లో ఉన్నప్పుడే అది సాధ్యం ప్రధాని మోడీ అన్నారన్నారు. తాము బీటెక్‌లో కూడా సెమీ కండక్టర్ క్లాసులు ప్రారంభించామని, డిప్లొమాలో కూడా సెమీ కండక్టర్ టెక్నాలజీని బోధించి అతి త్వరలో హైదరాబాద్ నుంచి ఒక చిప్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో డిప్లొమా ఇన్ ఎయిర్‌క్రాఫ్ట్ కోర్సు తీసుకొచ్చాంమని, మా యూనిక్ వాహనాన్ని ఏర్పాటు చేసుకున్నాం అది డ్రైవర్ లెస్ వాహనమని, గత రెండేళ్లలో 30 వేల కిలోమీటర్లు తిరిగి 30 వేలకుపైగా ప్యాసింజర్లను తీసుకెళ్లిందన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో దాదాపు 300 స్టార్టప్‌లు బయటకు వచ్చాయని వాటిద్వారా రూ.1500 కోట్ల నిధులు వచ్చాయని.. వాటి కోసం తాము ఖర్చు పెట్టింది కేవలం రూ 5 కోట్లు మాత్రమేనని తెలిపారు. సీఐఐ మాజీ ఛైర్మన్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండస్ట్రీ అవసరాలకు తగినట్లుగా నిపుణులు దొరకడం లేదని, ఇండస్ట్రీ అవసరాలకు అకడమిక్‌కు చాలా గ్యాప్ ఉందన్నారు. పాలిటెక్నిక్‌లో మూడో సంవత్సరంలో ఫస్ట్ సెమిస్టర్ నుంచి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందిస్తున్నామన్నారు. జర్మన్ మోడల్‌కు సంబంధించిన అంశాలపై వారు పని చేస్తున్నారని, ఇప్పటికే ఉన్నవాళ్ళ స్టాండర్డ్స్ కంటే మన డిప్లొమా విద్యార్థులు బాగా పని చేస్తున్నారని తెలిపారు.

# రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్

## ఉన్నత ఆదాయవర్గాల వారికి చెక్ - దాదాపు లక్ష రేషన్ కార్డులు రద్దు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు ఏవైనా సరే వాటి ద్వారా లబ్ధి పొందాలంటే కావాల్సిన ముఖ్యమైన అర్హత రేషన్ కార్డు. రేషన్ కార్డు లేకపోతే ప్రభుత్వ పథకాలు ఏవీ అందవు. ప్రభుత్వాలు ఆర్థికంగా వెనుకబడిన వారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేస్తాయి. అయితే ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం ఆర్థికంగా ఉన్నత ఆదాయవర్గాల వారు సైతం అక్రమంగా రేషన్ కార్డులను పొందుతున్నారు. ఈ తరహా రేషన్‌కార్డుదారులపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టింది. అనర్హులైన వారి రేషన్ కార్డులను కేంద్రం రద్దు చేస్తోంది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనర్హులను గుర్తించి వారి రేషన్ కార్డులను రద్దు చేస్తోంది. తెలంగాణలో గత కొంతకాలంగా రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో కొందరు ఆదాయపన్ను చెల్లింపుదారులు, అధిక జీతం పొందే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా రేషన్ కార్డులను పొందినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఈ క్రమంలో తెలంగాణ పౌరసరఫరాలశాఖ అనర్హుల రేషన్ కార్డులను రద్దు చేస్తోంది. అక్రమంగా రేషన్ కార్డు పొందిన వారిని గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విచారిస్తున్నారు. పరిశీలనలో అనర్హులుగా తేలితే అలాంటి వారి రేషన్ కార్డు రద్దు చేస్తున్నారు. పరిమితికి మించి భూమి ఉండటం, రూ.6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండటం, ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారు రేషన్ కార్డు పొందడానికి అనర్హులు. చాలా ప్రాంతాల్లో అత్యధిక జీతాలు పొందుతున్న ప్రైవేట్ ఉద్యోగులు కూడా రేషన్‌కార్డు పొందినట్లు గుర్తించిన అధికారులు వారి కార్డులను రద్దు చేస్తున్నారు. కొంతమంది తప్పుడు సమాచారంతో రేషన్ కార్డు పొంది ఏళ్ల తరబడి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరి రేషన్‌కార్డులను కూడా ప్రభుత్వం ఏరివేస్తోంది. రేషన్ కార్డు పొందిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. లక్షల్లో జీతం పొందుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కొంతమంది ఇప్పటివరకు తమ తల్లిదండ్రుల రేషన్ కార్డుల్లో కొనసాగడం వల్ల వారి వివరాలు తెలియలేదు. కానీ వీరిలో కొందరు ప్రత్యేకంగా కార్డు పొందడంతో ఇప్పుడు వీరి గుట్టు రట్టయింది. దీంతో వీరి రేషన్ కార్డులను రద్దు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి ఉన్న వారి, 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్నా వారికి రేషన్ కార్డులు రద్దు చేస్తారు వార్షిక ఆదాయం రూ.6 లక్షల కంటే ఎక్కువగా ఉన్నా, ఆదాయపన్ను చెల్లిస్తున్న వారి రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేస్తోంది.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కొండ సురేఖ, దామోదర్ రాజనర్సింహా

## పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్: మంత్రి దామోదర రాజనర్సింహా

**సంగారెడ్డి మున్సిపాలిటీ , మే,25, ప్రభాతవార్త :** అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టి జి ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## అసోం అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే యుసిసి బిల్లు!

**గువాహటి, మే 25:** అస్సాం ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఉమ్మడి పౌర స్మృతి బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో సోమవారంనాడు ప్రవేశపెట్టింది. బహుభార్యాత్వాన్ని నిషేధించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, సహజీవనానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరిచేయడం, విడాకులు, వారసత్వానికి చట్టబద్ధత కల్పించడం ఈ బిల్లు ముఖ్యోద్దేశం. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తరఫున యూనిఫాం సివిల్ కోడ్, అస్సాం, 2026 బిల్లును పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అతుల్ బోరా రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వివాహం, విడాకులు, లివ్‌ఇన్ రిలేషన్‌కు సంబంధించిన చట్టాలను ఏకీకరించి, సరళీకరించడం ఈ బిల్లు లక్ష్యం. పురుషులకు వివాహ వయస్సు కనిష్టంగా 21 ఏళ్లు, స్త్రీలకు 18 ఏళ్లు. బహుభార్యాత్వాన్ని నిరోధిస్తుందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ బిల్లులో వివరించారు. తొలిసారి లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌నకు చట్టబద్ధత కల్పించామని, రిజిస్ట్రేషన్ ద్వారా భాగస్వామల హక్కులకు పరిరక్షణ లభిస్తుందని, వారికి పుట్టే పిల్లలకు గుర్తింపు, రక్షణ ఉంటుందని చెప్పారు. అస్సాంలోని గిరిజనులను బిల్లు నుంచి మినహాయించినట్టు తెలిపారు. అస్సాంకు రెండోసారి ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టిన హిమంత బిశ్వ శర్మ ఈనెల 13న స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మంత్రివర్గ సమావేశం జరిపారు. ఈనెల 21 నుంచి 26 వరకూ జరిగే అసెంబ్లీ సమావేశాల్లో యూసీసీ బిల్లును ప్రవేశపెడతామని ప్రకటించారు. యూసీసీ ముసాయిదా బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, అసెంబ్లీ సమావేశాల చివరి రోజు బిల్లును ప్రవేశపెట్టగలమని వివరించారు.

## రూ.50వేలవరకూ సహకార రుణాలు రద్దు

**- సిఎం విజయ్ కీలక ఆదేశాలు..**
**- తమిళనాట రైతులకు ఊరట**

**చెన్నై, మే 25:** తమిళనాడు రైతులకు సీఎం విజయ్ ఆర్థికంగా ఊరటకల్పించారు. సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు గరిష్ఠంగా రూ.50 వేలవరకు రుణమాఫీ లభిస్తుంది. ఈ పథకం వర్తించని ధనిక రైతులకు కూడా రూ.5,000 సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అది కూడా సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికే. విజయ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పేద, సన్నకారు రైతులకు అప్పుల నుంచి భారీ ఊరట లభించనుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల తమిళనాడులోని 14.22 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. ఈ రుణ మాఫీ వల్ల ప్రభుత్వానికి రూ.2,044 కోట్ల భారం పడుతుంది. ఇటీవలి కాలంలో సీఎంగా విజయ్ తీసుకున్న కీలక నిర్ణయం ఇది. మరోవైపు కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం చేపట్టనున్న మేకేధాటు డ్యామ్ ప్రాజెక్ట్ నిర్మాణంపై కూడా అధికారులతో సీఎం విజయ్ చర్చించారు. కర్ణాటక చేపట్టనున్న ఈ ప్రాజెక్టును తమిళనాడు వ్యతిరేకిస్తోంది. దీనివల్ల తమ రాష్ట్రంలోని రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వం వాదిస్తోంది. కావేరి నదీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాలుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక, మేకేడాటు డ్యామ్ ప్రాజెక్టుకు ఇటీవలే కర్ణాటక ప్రభుత్వం భూమి పూజ నిర్వహించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తమ రైతుల హక్కులకు నష్టం జరుగుతుందనేది తమిళనాడు ప్రభుత్వ వాదన.

ఈ విషయంలో గతంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఇటీవలే సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ అంశం కేంద్ర నిపుణుల పరిధిలోకి వస్తుందని సుప్రీం కోర్టు తెలిపింది. కోర్టు ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయబద్ధమైన చర్యలను వేగవంతం చేయాలని సీఎం విజయ్ ఆదేశించారు.

మేకేధాతు డ్యామ్ ప్రాజెక్ట్ ద్వారా తమ రాష్ట్రానికి తాగునీటి సమస్య తీరుతుందని, విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడుతుందని కర్ణాటక ప్రభుత్వం చెబుతోంది.

## కర్ణాటకలో సిఎం మార్పా.. కేబినెట్ మార్పులా?



### నేడు ఢిల్లీకి వెళుతున్న సిద్ధరామయ్య

**బెంగళూరు, మే 25:** కర్ణాటకలో సీఎం పదవి మార్పుపై రోజురోజుకూ తీవ్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. సీఎంగా ఉన్న సిద్ధరామయ్యను తొలగించి, డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను సీఎం చేస్తారని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం సిద్ధరామయ్యను ఢిల్లీ రావాల్సిందిగా కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించింది. ఈ పరిణామాలను బట్టి కర్ణాటక సీఎంను మార్చడంతో పాటు మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టతా లేదు. ఈ మేరకు తనకు ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు వచ్చిందని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ అందించిన సమాచారం మేర కు ఢిల్లీ వెళ్తున్నట్లు సీఎం చెప్పారు. మంగళవారం కాం గ్రెస్ అగ్రనేతలతో సమావేశం జరగనుందని ఆయన చెప్పారు. అయితే, ఏ అంశంపై తనను ఢిల్లీకి పిలిచారో తెలియ లేదన్నారు. కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో కొంతకాలంగా ముసలం నడుస్తోంది. 2023లో అక్కడ కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ సమయంలో సీఎం పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య భారీ పోటీ నడిచింది. ఆ సమయంలో ఇద్దరూ తమ వర్గపు ఎమ్మెల్యేలతో హైకమాండ్ వద్ద లాబీయింగ్ చేశారు. కానీ, సీనియర్ అయిన సిద్ధరామయ్య వైపు హైకమాండ్ మొగ్గుచూపింది. అయినప్పటికీ కొంతకాలం తర్వాత సిద్ధరామయ్యను తొలగించి, డీకేను సీఎం చేస్తారని ప్రచారం మొదలైంది. కానీ, సిద్ధరామయ్య మాత్రం తానే ఐదేళ్లు సీఎంగా ఉంటానని చెప్పారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనకు హైకమాండ్ నుంచి పిలుపురావడం రాజకీయంగా ఆసక్తి కలిగిస్తోంది. మరోవైపు మంత్రివర్గంలో మార్పులు జరగనున్నాయని ప్రచారం మొదలవ్వడంతో చాలా మంది ఆశావహులు తమ లాబీయింగ్ మొదలుపెట్టారు. ఎవరికి వారు తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని హైకమాండ్‌ను కోరుతున్నారు. ఏదేమైనా సీఎం మార్పు, మంత్రివర్గంలో మార్పుపై మరికొద్ది రోజుల్లో స్పష్టత రానుంది.

## ఎసిబి వలలో ప్రభుత్వ పాఠశాల రికార్డ్ అసిస్టెంట్



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ శివానంద్

**జూబ్లీహిల్స్, మే 25, ప్రభాతవార్త:** రిటైర్మెంట్ ప్రయోజనాల సెటిల్మెంట్ ప్రక్రియ పూర్తి చేయడానికి లంచం డిమాండ్ చేసిన ప్రభుత్వ పాఠశాల రికార్డ్ అసిస్టెంట్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్. శివానంద్ రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఒక ఉద్యోగి తల్లి పెన్షన్ బెనిఫిట్ ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపించి, రిటైర్మెంట్ ప్రయోజనాల సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఆయన రూ.20 వేల లంచం డిమాండ్ చేశాడు. లంచం సొమ్మును సోమవారం మధ్యాహ్నం స్వీకరిస్తుండగా ఎసిబి అధికారులు ప్రత్యక్షంగా పట్టుకున్నారు. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో నిందితుడి వద్ద నుంచి రూ.20 వేల లంచం నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని, భద్రతా కారణాలరీత్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం కోరితే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసిబి సూచించింది.

## రాజ్యసభ హౌస్ కమిటీ చైర్మన్‌గా డా.కె.లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే25:** రాజ్యసభ హౌస్ కమిటీ చైర్మన్‌గా డా.కె.లక్ష్మణ్ నియామకం అయ్యారు. ఈ అవకాశం ఇచ్చిన రాజ్యసభ చైర్మన్, భాజపా నాయకత్వానికి లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే25:** రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపు ఆలస్యం అవుతుందని వివరించారు. ఆ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సోమవారం ఆయన సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇసుక లారీలు, ట్రాక్టర్లను కూడా ధాన్యం తరలింపునకు వాడుతున్నామన్నారు. ఈలోపు వర్షం పడి ధాన్యం తడిచినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం తడిచి రంగుమారినా, కొనుగోలు చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారని ఆదిశ్రీనివాస్ వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల గురించి మాట్లాడే హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు. కేంద్రప్రభుత్వం 52 లక్షల టన్నులనే కొనుగోలు చేస్తామమని వివరించారు.

## ట్రైనీ ఐఎఎస్‌లకు గవర్నర్ దిశానిర్దేశం

### నిజాయితీ, నిబద్ధతతో ప్రజాసేవ చేయాలని సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మే25:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సోమవారం లోక్ భవన్‌లో 2025 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలతో అనుసంధానమై, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ సుపరిపాలనకు కృషి చేయాలని సూచించారు. శిక్షణలో ఉన్న ఎట్టబోయిన సాయి శివాని, సచిన్ బసవరాజ్ గుత్తూర్, పోతరాజు హరి ప్రసాద్, పారస్ కుమార్, పి. సురేష్, నెలటూరు శ్రీకాంత్ రెడ్డి గవర్నర్‌ను కలిశారు. సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్, ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ వైస్ చైర్‌పర్సన్ శాంతి కుమారి, కోర్స్ డైరెక్టర్ డా. ఉషారాణి పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న 5 మండల పరిషత్ పదవుల భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్

**విజయవాడ,మే 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఖాళీగా ఉన్న 5 మండల పరిషత్ పదవులు ఒక ఎంపీపీ, రెండు వైస్ ఎంపీపీలు, రెండు కోఆప్షన్ సభ్యుల భర్తీకి నోటిఫికేషన్ భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో నెల్లూరు జిల్లా కోట మండలం ఎంపీపీ, కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం వైస్ ఎంపీపీ, ప.గో.జిల్లా ఇరగవరం మండల వైస్ ఎంపీపీ, ఏలూరు జిల్లా లింగంపాలెం, విశాఖ జిల్లా పెందుర్తి కోఆప్షన్ సభ్యుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 31లోపు సభ్యులకు నోటీసులు పంపాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించింది. జూన్ 4న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక జరపాలని, ఏదైనా కారణంతో ఎన్నిక జరగకపోతే జూన్ 5న ఎన్నిక జరపాలని ఆదేశాలు జారీ చేసింది.

## భవన నిర్మాణ కార్మికులకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలి

- ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేయాలి న- లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి
- వందలాది మందితో మహా ప్రదర్శన - ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్




ప్రదర్శన ద్వారా కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయానికి తరలివస్తున్న కార్మిక సంఘాల నేతలు

**చిక్కడపల్లి మే 25 ( ప్రభాతవార్త ) :** భవన నిర్మాణ కార్మికులకు 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.9,000 వృద్ధాప్య పెన్షన్ అందించాలని, బీమా, ఆరోగ్య పరీక్షల పేరిట కార్మికులను దోచుకుంటున్న ప్రైవేట్ ఏజెన్సీలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం జరిగింది. అంతకు ముందు వందలాది మంది కార్మికులతో వీఎస్టీ పార్క్ నుండి లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం లేబర్ కార్యాలయం ఎదుట దాదాపు రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. హన్మేశ్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు ప్రసంగించారు. జీవితాంతం రెక్కల ముక్కలు చేసుకునే కార్మికులకు వృద్ధాప్యంలో కనీస జీవన భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న గుర్తింపు కార్డులు 60 ఏళ్ల తర్వాత ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని, అందుకే నెలకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా పేరుతో ప్రవేశపెట్టిన ప్రైవేట్ ఏజెన్సీలు కార్మికుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని నాయకులు విమర్శించారు. అలాగే, వందల కోట్ల రూపాయల సంక్షేమ నిధులు దారి మళ్లుతున్నాయని, ప్రైవేట్ ఏజెన్సీల దోపిడీని అరికట్టి కార్మికులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. సహజ మరణ పరిహారాన్ని ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలి. రైతుబీమా తరహాలోనే కార్మికులకు కూడా గౌరవప్రదమైన బీమా సౌకర్యం కల్పించాలి. పెళ్లి కానుక, ప్రసూతి సాయం: ప్రస్తుతం ఇస్తున్న రూ.30 వేల ఆర్థిక సాయాన్ని రూ.1 లక్షకు పెంచాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హులైన కార్మికులందరికీ సంక్షేమ బోర్డు కార్డులు ఇవ్వాలి. గడువు ముగిసిన కార్డులను పునరుద్ధరించడంతో పాటు, తిరస్కరణకు గురైన దరఖాస్తులను తిరిగి పరిశీలించి ఆమోదించాలి. ధర్నా అనంతరం కార్మిక సంఘాల ప్రతినిధులు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యదర్శి గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. రాబోయే జూలై నెలలో ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు నాయకులకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కేఎస్ ప్రదీప్, నల్లన్న, గోసు పుల్లయ్య, రాజు, నర్సింహ, కోశాధికారి ఆడెపు శంకర్, వెంకటేష్, రాము (నారాయణపేట), కోల్ల వెంకటన్న, బాలు (మహబూబ్‌నగర్), వెంకన్న (ఖమ్మం), చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కారు విఫలం

### రైతుల ధాన్యం కొనేదాకా పోరాడుతాం :'రైతు గోస - బిజెపి భరోసా' యాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలు, వడ్లకొనుగోలు వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏ పరిస్థితుల్లోనైనా రైతులకు బీజేపీ అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు రైతు గోస బిజెపి భరోసా పర్యటనలో భాగంగా వికారాబాద్, గజ్వేల్ ప్రాంతాల్లో పర్యటించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ఎదురైన సమస్యలను, కష్టలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి శాసనసభాపక్ష నేత ఎమ్మెల్యే ఏలేటి మహేష్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయంటూ ముఖ్యమంత్రి తప్పుడు లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ఇంకా 75 శాతానికి పైగా వరి ధాన్యం కొనుగోళ్లు జరగకుండా కల్లాల్లోనే మురిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే వారం రోజుల్లో వర్షాలు పడితే తడిసిన ధాన్యాన్ని కొనే నాథుడే ఉండడని, అన్నదాతలు దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని ధ్వజమెత్తారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఖర్చులు,

గన్నీ బ్యాగుల డబ్బులు రైతుల నుంచే వసూలు చేస్తున్నారని, ఒక్కో బస్తాకు ఏకంగా 4 కిలోల అదనపు తరుగు తీస్తూ రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్ పేరిట రైతులకు ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతు పండించిన చివరి గింజ కొనుగోలు చేసే వరకు బీజేపీ తరఫున రైతు గోస బిజెపి భరోసా యాత్రతో అండగా నిలబడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వంపై పోరాటం ఆపేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, డీకే అరుణ, ఎమ్మెల్యేలు వెంకట రమణరెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాచార కేసు మీడియామీట్‌లో.. ఐజిపి ముచ్చట్లు.. నవ్వులు!

### సోషల్ మీడియాలో వైరల్

**చెన్నై, మే 25:** తమిళనాడులో ఇటీవల 10 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య ఘటన యావత్తు దేశాన్ని కుదిపేసింది. కొత్తగా ఏర్పడిన విజయ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో నిందితులను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి విజయ్ పోలీసులకు ఆదేశించారు. ఈకేసులో తాజాగా పోలీసులు వ్యవహరించిన తీరు ఇప్పుడు నెట్టింట తీవ్ర ఆగ్రహానికి గురి చేసింది. సోషల్ మీడియా వేదికగా పోలీసులపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఈనెల 21న కోయంబత్తూరులో 10 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసు సంచలనం సృష్టించింది. అయితే సోమవారం ఈ ఘటనపై పోలీసులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. వెస్ట్ జోన్ ఐజీ ఆర్.వి. రమ్య భారతి, కోయంబత్తూరు రేంజ్ డీఐజీ పి. సమినాథన్, కోయంబత్తూరు ఎస్పీ అల్లటిపల్లి పవన్ కుమార్ రెడ్డి కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. అయితే ఒక సీరియస్ మేటర్‌పై ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్నామన్న ఇంగిత జ్ఞానం లేకుండా ముగ్గురూ కూడా సాధారణ సంభాషణలో మునిగిపోయారు. రమ్య భారతి గోళ్లు గిల్లుకుంటూ జోకులు వేసుకుంటూనవ్వుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలోకి రాగానే వేగంగా వైరల్ అయింది. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఇంత తీవ్రమైన కేసు గురించి మాట్లాడుతున్నప్పుడు ఇలా నవ్వడం ఏంటి? ఇది అసమర్థత అని ఒకరు, 10 ఏళ్ల చిన్నారి హత్యపై ఇంత నిర్లక్ష్యమా ఇది అత్యంత అవమానకరం అని మరొకరు పోస్టులు పెట్టారు. పేర్కొన్నారు. ఇలాంటి అధికారులు ఈ పదవులకు అర్హులు కారని కొందరు విమర్శించగా సివిల్ సొసైటీగా మనం విఫలమయ్యామంటూ మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే తమిళనాడు పరిశ్రమల మంత్రి ఎస్. కీర్తన కూడా ఈ కేసు నేపథ్యంలో విమర్శలకు గురయ్యారు. మీడియా ప్రశ్నలకు స్పందించిన సమయంలో ఆమె కూడా నవ్వినట్లు కనిపించడంతో

బీజేపీ తీవ్రంగా మండిపడింది. మీడియా సమావేశం ముగిసిన తర్వాతే ఆ నవ్వు వచ్చిందని ఆమె వివరణ ఇచ్చారు.



ఆరోగ్యం కోసమని చాలామంది మళ్లీ ఇనుప కడాయిని ఎంచుకుంటున్నారు. దానిలోనూ కొన్ని పదార్థాలను వండవద్దు. టొమాటో, చింపండు వంటి పుల్లని

# ఇనుప కడాయిలో ఇవ్వొద్దు!

పదార్థాలు వండొద్దని తెలుసు కదా! వెనిగర్, నిమ్మ, టొమాటో సాస్‌లు వాడే ఆహారాలకీ ఇది సరిపడదు. ఇంకా ఆ జాబితాలోకి ఆకుకూరలు, మ్రాష్రూమ్‌లు కూడా వస్తాయి. ఇవి సున్నితంగా ఉంటాయి. త్వరగా అడుగంటుతాయి కూడా. అంతేకాదు.. దీని నుంచి వచ్చే అతివేడికి పోషకాలూ పోతాయి. తినీ ప్రయోజనం ఉండదు. అందుకే వీటినీ వండొద్దు. చేపలు, సముద్ర ఆహారమేదైనా దీనిలో వండక పోవడమే మంచిది. ఇవీ వండే క్రమంలో పాత్ర అడుగు భాగాన అతుక్కు పోతాయి. నూనె, నెయ్యి ఎక్కువ మొత్తంలో వాడినా ప్రయోజనం ఉండదు. నూనె అతిగా అవ్వడమే కాదు, రుచీ మారిపోతుంది. అన్నం, పాస్తాలకీ ఈ సూత్రం వర్తిస్తుంది. పైగా వీటిల్లోని నూనెలు ఇనుముతో చర్యనొందుతాయి. అందుకే వీటికీ ఇనుప కడాయి సరికాదు. ఆమ్లెట్, కోడిగుడ్డు పొరటు, స్వీట్లు.. సిద్ధం చేయడానికీ ఇనుప కడాయి మంచి ఎంపిక కాదు. వీటి తాలూకూ వాసనలు ఇనుమును త్వరగా పట్టేస్తాయి. ఎంత శుభ్రంగా కడిగినా త్వరగా వదలవు. తర్వాత వండేవాటికి పట్టి, వాటి రుచిపై ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు గుడ్లలోని సల్ఫర్ ఇనుముతో చర్య పొందుతుంది. రుచిపై ప్రభావం చూపడంతోపాటు అది త్వరగా సిలుము పట్టేలా చేస్తుంది. అందుకే వీటిని సిద్ధం చేసేప్పుడు వేరేపాత్రలను ఎంచుకోమంటారు.

# ఇంటర్వ్యూకు వెళ్తున్నారా!



అమ్మాయలు ఎన్నో ఇంటర్వ్యూ వెళ తుంటారు. ఈ సారైనా ఉద్యోగాన్ని సంపాదించ గలనో లేదో అని భయపడు తుంటారు. ఇటువంట ప్పుడు జాబ్‌కు సంబంధించిన విషయాలతో పాటు బాడీ లాంగ్వేజ్‌లో పొరపాట్లుంటే సరిదిద్దుకొని వెళ్లడం మంచిది.

ఇంటర్వ్యూ చేస్తున్నవారికి ఎదురుగా ఒంటి కూర్చోవడం, కాలుపై కాలు వేసుకొనో.. లేదా టేబుల్‌కు దూరంగా కుర్చీకి జారగిలపడటం వంటివి చేయకూడదు. ఇవన్నీ మీలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్నట్లు, ఉద్యోగం పట్ల ఉత్సాహం లేదన్నట్లుగా చూపిస్తాయి. ఈ కదలికలు అవతలివారి ఏకాగ్రతను దూరం చేస్తాయి. స్ట్రెయింగ్.. మీ గంభీరతను చాటుతూ ప్రొఫెషనలిజాన్ని చూపెడుతుంది. చేతులు కట్టుకొని కూర్చోవడం కూడా సరైనది కాదు. ఈ భంగిమ స్వీయరక్షణగా అనిపిస్తుంది. అలాగే మీరు చెప్పగలిగేది ఇకపై ఏదీ లేదనే సంకేతాన్ని అవతలివారికి ఇస్తుంది. అలాకాకుండా చేతులు రెండూ ఫ్రీగా ఉంచి కూర్చోవడం మేలు. అప్పుడే ఎదుటివారు చెప్పేదానిపై మీ శ్రద్ధతోపాటు వారిపట్ల మీరు పాటిస్తున్న మర్యాద కనిపిస్తుంది. ముఖంపై పడిన జుట్టు సర్దుకోవడం, గోళ్లరంగు చూస్తూ.. కాళ్లూపడం, నిమిషానికొకసారి ముఖంపై చేతితో రుద్దు కోవడం వంటివి చేయకూడదు. దాన్ని మీ నిరాసక్తత లేదా భయంగా ఎదుటివారు భావిస్తారు. ఇంటర్వ్యూలో ఎటువంటి కదలికలను ప్రదర్శించకుండా అవసరమైనంత మనరకు జవాబు చెబుతూ, వారు చెప్పేది పూర్తిగా వినడంపై ఏకాగ్రత ఉంచితే మేలు. అడుగడుక్కి చేతి వాచీ, గోడ గడియారం లేదా ఫోన్‌లో సమయం చూడటం మీ అసహనాన్ని ప్రదర్శిస్తుంది. ఆ ఇంటర్వ్యూపై మీకు ఆసక్తిలేదనే తప్పుడు సంకేతాన్ని స్తుంది. సమయం పూర్తవుతుందనే కంగారు మీకు ఉండి ఉండొచ్చు. అలాకాకుండా ఎదుట కూర్చున్న వారు మీ కోసం కేటా యించిన సమయానికి మర్యాద నివ్వ గలిగితే చాలు. బలపై ఉన్న పేపర్ వెయిట్, పెన్ లేదా కీ చెయిన్ వంటి వస్తువులను కదపడంవల్ల మీరు తీవ్ర ఒత్తిడికి గురవుతు న్నట్లులేదా బోర్ ఫీలవుతున్నట్లు ఎదుటి వారికి అనిపి స్తుంది. కాబట్టి సౌక ర్యంగా కూర్చొని పూర్తిగా అవతలి వారు అడిగే ప్రశ్నలమీదే దృష్టిని కేంద్రీకరించి ఆత్మ విశ్వాసంతో సమాధానం చెప్పగలిగినప్పుడే మంచి ఫలితాలొస్తాయి.

# అందాల 'కేన్' కట్టు



ఎందరో సుందరీమణులు అందరికీ వందనాలు
నుదుటిన బొట్టు
చేతికి సొగసులూనే బ్రేస్‌లెట్టూ
అందాలుచిందే జాకట్టు
ఇవే కదా!

భారతీయ సౌందర్యానికి ఆనవాళ్లు. ఆధునిక సమాజం ఎన్ని పోకడలు పోయినా ఎంతగా మారినా భారతీయతను ఏ మాత్రం వదిలి పెట్టదు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పక్కన పెట్టలేదు. పెళ్లిళ్లూ పేరంటానికి సంప్ర



దాయ వస్త్రధారణయితే ఫ్రెండ్స్ క్లబ్‌లకు ఫ్యాషన్ పేరేడ్‌లకు ఆధునిక వస్త్ర ధారణను ఎంచు కుంటున్నారు. ఈ కాలం యువతులు సంప్ర దాయ వేడుకలైనా ఆటపాటల రంగోలీలకైనా మనవాళ్లు అలా తళుక్కున మెరిసి అంద చందాల వన్నెచిన్నెలకు మాకు మేమేసాటి అని నిరూపించు కుంటారు. ఫ్రాన్స్‌లో జరిగిన 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా మన సెలిబ్రిటీలంతా వారికి నచ్చిన, తొచిన రీతిలో సంప్రదాయ వస్త్ర వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ ఫెస్టివల్ ఏటా జరిగే మెగా ఈవెంట్‌గా ప్రపంచానికి తెలుసు అదొక చిత్రోత్సవకమే అయినా సౌందర్య సొబగుల ప్రపంచం అక్కడ సాక్షాత్కరిస్తుంది. ఈ ఏడాది ఆ ఉత్సవంలో ఎందరో సుందరాంగనలు భారతీయ సంస్కతికి ప్రతిబింబాలుగా రాణించారు. భారతీయత పాలు ఎక్కువే దర్శించ గలిగాం. చాలా లుమినారా వస్త్రాధారణతో సినీనటి ఐశ్వర్యరాయ్ వేదికను అలరించింది. సాంప్రదాయ నౌవారీ చీర ధరించి రెడ్ కార్పెట్‌పై నడిచిన మరాఠీ సినీనటి ప్రాజక్త మాలి అద్భుతంగా కనిపించారు. మరాఠీ సినిమా చరిత్రలో తొలిసారిగా ఒక నటి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెడ్ కార్పెట్‌పై నడిచి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె తన సాంప్రదాయ రూపం, గ్లామరస్ శైలి రెండింటితోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నౌవారీ చీర అనేది మహారాష్ట్ర సాంప్రదాయ తొమ్మిది గజాల చీర, ఇది సుమారు ఎనిమిది మీటర్ల పొడవు ఉంటుంది. 36 ఏళ్ల మరాఠీ నటి ప్రాజక్తమాలి నిర్మాతగా, రచయిత్రిగా కూడా రాణిస్తున్నారు. మరాఠీ సినిమాలు, టెలివిజన్‌లో తనదైన ముద్ర వేశారు. 60 ఏళ్ల నటి నివేదిత సరఫ్‌మంగళ సూత్రంతో కూడిన సాంప్రదాయ పైఠానీ చీర ధరించి, మరాఠీ బోర్డ్ బ్లౌజ్ డిజైన్‌ను ప్రదర్శించారు. ఆమె సాంప్రదాయ రూపం వెంటనే అందరి దృష్టిని ఆకర్షించింది. కేన్స్‌లో తన ప్రదర్శన కోసం, నివేదిత మహారాష్ట్ర సంస్కృతిని అత్యంత సొగసైన రీతిలో చాటి చెప్పే ఒక అందమైన సాంప్రదాయ పైఠానీ చీరను



ఎంచుకున్నారు. ఈ చీరలో లేత పాస్టెల్ రంగులతో పాటు పూల డిజైన్లు ఉన్నాయి, వీటికి జత చేసిన ముదురు నీలం రంగు అంచు ఈ రూపానికి రాజసం ఉట్టిపడేలా చేసింది. ఆమె మంగళసూత్రం, నాథ్, లేయర్డ్ నెక్లెస్‌లు, గాజులు, చెవి పోగులు గజ్రాతో అలంకరించిన చక్కని జుట్టు ముడి వంటి సాంప్రదాయ మహారాష్ట్ర ఆభరణాలతో తన దుస్తులను పూర్తి చేసుకుంది.

# వైరాగ్య చింతన

వైరాగ్యం అనేది మానసిక భావన. ఆ భావన కలిగిన వారు సమస్త వస్తువులు, భౌతిక సుఖాలపట్ల విరక్తితో ప్రవర్తిస్తారు. దాన్నే వైరాగ్యం అంటారు. భక్తి పరాకాష్ట చేరితే వైరాగ్యం వస్తుందని పండితులు భావిస్తారు. జీవితంలో ఎక్కువ ఎదురు దెబ్బలు తిన్న వారు కూడా వైరాగ్యంలోకి వెళతారని అనుభవజ్ఞులు చెబుతారు. యోగి వేమన సుఖాలపై మొహం మొత్తి వైరాగ్యం కలిగింది.ఆ తరువాత నిత్య సత్యాలు, నీతి సూత్రాలతో శతకం రచించాడని వినికిడి. పూర్వం రాజుల కాలంలో కుమారుడికి రాజ్య పట్టాభిషేకం చేసిన తరువాత తండ్రి సన్యాసం స్వీకరించి అడవులకు వెళ్లి తపస్సు(ఆశ్రమంలో) చేసుకుంటూ వైరాగ్యంతో శరీరాన్ని విడిచేవారు. ప్రతి పురుషుడు బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, సన్యాసాశ్రమం, వైరాగ్యం స్వీకరించి మోక్షమార్గంలో వెళ్లాలని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి.స్త్రీ/ పురుషులు జీవితంలో మూడు సార్లు తాత్కాలిక వైరాగ్యన్ని పొందుతారని పురాణాలు చెబుతున్నాయి.వాటిలో మొదటిది పురాణ వైరాగ్యం. పురాణ ప్రవచనం వింటున్నంత సేపు మనలో అధ్యాత్మిక భావనలు పెరుగుతాయి. ప్రవచనం వింటున్నప్పుడు కలిగే విరక్తి ని పురాణ వైరాగ్యం అంటారు. ఆ ప్రవచనం నుంచి బయటకు రాగానే అదంతా మరచిపోయి మామూలు స్థితికి వచ్చేదాకా.రెండోది ప్రసూతి వైరాగ్యం. ప్రసవసమయంలో వచ్చే నెప్పులు భరించలేక సంసార సుఖంపై విరక్తి పొందుతారు. బిడ్డ జన్మించగానే ఆ ఆనందంతో నెప్పులు, వైరాగ్యం మర్చిపోయి యధా విధిగా సంసారంలో లీనమైపోతారు. మూడోది శ్మశాన వైరాగ్యం. అత్యంత ఆత్మీయులు,కుటుంబ సభ్యులు మరణించినప్పుడు వారి అంత్యక్రియల సమయంలో జీవితం క్షణభంగురం అనే స్థితిలోకి వెళతారు. ఏదీ శాశ్వతం కాదు,అంతా మిధ్యే అనే భావనతో వైరాగ్యం కలుగుతుంది. ఆ కార్యక్రమాలు పూర్తి అయి ఇంటికి రాగానే మళ్లీ ప్రాపంచిక మాయలో పడిపోతారు. ఈ పై మూడు తాత్కాలికమైనవే.ఇవిగాక మంద. మధ్యమ, తీవ్ర, తీవ్రతర వైరాగ్యాలుగా వర్గీకరించడం జరిగింది. శాశ్వత భావన మనసులో వచ్చినప్పుడు నిజమైన వైరాగ్యం కలుగుతుంది.భక్తితో వచ్చే వైరాగ్యం నిజమైన మోక్షమార్గం చూపుతుంది.

-యం.వి.రామారావు

# నిజాలు చెబుతున్నారా?



ఎదిగేచిన్నారులు చెప్పే ముద్దు ముద్దు మాటలకు మురవకుండా ఉండలేం. కానీ, చిన్న విషయానికే వారు అబద్ధాలు చెబుతోంటే మాత్రం అడ్డుకట్ట వేయాల్సిందే.

**అంచనా వేయండి..** పిల్లలు అబద్ధం చెబుతున్నారని తెలిసినవెంటనే వారిని కొట్టడమో, తిట్టడమో చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. పైగా అలా చేస్తే వారు తరువాత కూడా మీ నుంచి తప్పించుకోవడానికి ఈ అలవాటుని కొనసాగించే అవకాశం ఉంది. అందుకే, ముందు అలా ఎందుకు చెప్పారో తెలుసుకోండి. దీనికి మీ ఇంటి వాతావరణం లేదా మరే ఇతర ప్రభావాలన్నా వాళ్ల మీద పనిచేస్తున్నాయో గమనించి పరిష్కారం వెతకండి. **వాస్తవాలను వివరించండి..** వారేదైనా విషయం దాచడానికే ఆ పని చేస్తుంటే అలా చేయడం వల్ల జరిగే నష్టాన్ని వివరించండి. దాన్ని మీతో పంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనం చెప్పండి. ఒకవేళ వారు చెప్పిన విషయంలో అసలు వాస్తవాలు మీకు తెలిస్తే.. వారికి అర్థమయ్యేలా చెబితే మరోసారి ఆ పని చేయరు. **మీరే రోల్‌మోడల్..** చాలా ఇళ్లల్లో పెద్దలు పిల్లలు ఏం చేయకూడదో, ఎలా ఉండకూడదో చెబుతారు. కానీ, ఆచరణలో తాము మాత్రం ఆ పనిచేయరు. పైగా ఒక్కోసారి చిన్నారులతోనే నేను ఇంట్లో లేనని చెప్పు, గొలుసు కొనుక్కు న్నామని నానమ్మకి చెప్పకు అంటూ వారితోనే అబద్ధాలు చెప్పిస్తుంటారు. మీరు మాత్రం అలా చేయొద్దు. ఆపత్కాలానికి తప్ప మరెప్పుడూ అబద్ధమాడకూడదని అర్థమయ్యేలా మీరు ప్రవర్తించాలి. వారికి రోల్‌మోడల్ కావాలి.

**చెలి**

సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.

ఈ మెయిల్:Cheli@vaartha.com

## తెర

# సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 'సింగ్ గీతం'

లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సంగీతం, 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్ లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. మీట్ అవర్ వైజాగ్ హీరో ఈవెంట్ లో హీరో అయాన్ మాట్లాడుతూ.. నా పేరు అయాన్. మాది వైజాగ్. అక్కయ్యపాలెంలో పెరిగాను. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి తెలుగు సినిమాలో హీరోగా నటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. అహల్యా బమ్రూ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నేను 'గౌరి' పాత్రను పోషిస్తున్నాను. మాది పుదుచ్చేరి . వైజాగ్ చూస్తుంటే నాకు పాండిచ్చేరి గుర్తొస్తుంది. శాలిని కొండేపూడి మాట్లాడుతూ.. వైజాగ్ నాకు చాలా స్పెషల్. ఐ



లవ్ వైజాగ్. ఈ సినిమాలో నేను 'రేణు' పాత్రలో కనిపించబోతున్నాను. లైవ్ వీడియో కాల్‌లో రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ.. హాయ్ వైజాగ్. లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం లో పనిచేయడం నిజంగా ఒక అదృష్టం. అలాంటి అవకాశం చాలా అరుదుగా వస్తుంది.

# 'సహ' (లైఫ్ ఆఫ్ సంజు) నుంచి 'సోల్ ఆఫ్ సహ' గ్లింప్స్ రిలీజ్



కొన్ని కథలు మనసులో ఎప్పటికీ నిలిచి పోతాయి. మన జీవితంలో ఎప్పుడో అనుభవించిన భావోద్వేగాలు, జ్ఞాపకాలు, కలలను అవి మళ్లీ గుర్తు చేస్తాయి. అలాంటి హృదయాన్ని తాకే అనుభూతిని అందించేందుకు వస్తోంది 'సహ' (లైఫ్ ఆఫ్ సంజు), నిషాంత్ దోటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కుమార్ కసారం హీరోగా నటిస్తుండగా, శ్వేత లక్ష్మణ్, వ్రజనా పాండ్యా కథానాయికలుగా కనిపించనున్నారు. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజేశ్వర్ వెల్పుచర్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ది సోల్ ఆఫ్ సహ పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ కథలో సంజు అనే వ్యక్తి తన జీవితంలోని అత్యంత అందమైన దశలను తిరిగి గుర్తు చేసుకుంటాడు. చిన్ననాటి జ్ఞాపకాలు, స్కూల్ రోజులు, కాలేజ్ ప్రేమ, వివాహ జీవితం, ఆ తర్వాత జరిగిన భావోద్వేగ క్షణాలు అన్నీ అతని ప్రయాణంలో భాగమవు తాయి. అయితే కథ అనూహ్య మలుపు తిరిగేది సహ అనే యువతిని కలిసినప్పుడు. ఆశ్చర్యకరంగా ఆమె పేరు మాత్రమే కాదు, తన గత ప్రేమను గుర్తు చేసే ఎన్నో లక్షణాలు కూడా ఆమెలో కనిపిస్తాయి.ఈ పరిచయం విధి, గమ్యం, అసంపూర్తిగా మిగిలిపోయిన భావోద్వేగాలు, మళ్లీ జీవితంలోకి తిరిగి వచ్చే బంధాల గురించి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతుంది. కేవలం ఒక ప్రేమకథగా కాకుండా, మనిషిని జ్ఞాపకాలు ఎలా మలుస్తాయి, కాలం బంధాలని ఎలా మార్చుతుంది, సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ. కథలోని నాస్టాల్జియా, ప్రేమ, భావోద్వేగాలను మరింత అందంగా ప్రతిబింబించేలా ఆయన స్వరాలు అలరి స్తున్నాయి.

# 'బ్లాస్ట్ జోన్' 28న విడుదల



మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రం 'బ్లాస్ట్ జోన్' : యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా, ప్రీతి ముకుందన్, అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్లాస్ట్ జోన్' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్ మెంట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేస్తోంది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రానికి 'బ్లాస్ట్ జోన్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించడం విశేషం. ఈ సందర్భంగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా మాట్లాడుతూ.. ' ఈ 'బ్లాస్ట్ జోన్' సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది. సినిమా పూర్తయిన తర్వాత అవుట్ పుట్ చూసుకొని సంతృప్తి చెందే సినిమాలు కొన్ని ఉన్నాయి. అలాంటి సినిమా ఖిబ్లాస్ట్ జోన్‌ఖి. మన తల్లిదండ్రులకో, మన వాళ్ళకో అన్యాయం జరిగితే న్యాయం కోసం మనం ఖచ్చితంగా పోరాడతాం. టి అభిరామి మాట్లాడుతూ.. 'బ్లాస్ట్ జోన్' ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. ఇలాంటి మంచి మాస్ మూవీతో మీ ముందుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంత మాస్ క్యారెక్టర్ నేనెప్పుడూ చేయలేదు. నటి ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ.. . మన 'బ్లాస్ట్ జోన్' మూవీ మే 28న థియేటర్లలో విడుదలవుతోంది. మీ అందరూ థియేటర్లో సినిమాను చూసి ఆదరిస్తారని



టాలీవుడ్‌లో మరో అందమైన గ్రామీణ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మోనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, యువ దర్శకుడు ఎస్.ఎస్. వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'సింగిల్ రాజు'. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఆసక్తి

# 'సింగిల్ రాజు' టైటిల్ గ్లింప్స్ విడుదల

రేకెత్తిస్తున్న ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ విడుదల కార్యక్రమం 'మా ఈవెంట్స్' సహకారంతో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా "సింగిల్ రాజు'టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. ఎస్.ఎస్. వర్మ, విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమా కథ వినగానే చాలా ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఎంతో ధృడ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించారు. దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మాట్లాడుతూ.. వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. హీరో విశ్వస్ మాట్లాడుతూ.. "దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మేము ఎంతో ఫ్యాషన్ తో చేస్తున్న సినిమా. విలేజ్ లో షూటింగ్ జరుగుతున్నప్పుడు అక్కడ అందరూ సపోర్ట్ చేశారు.హీరోయిన్లు మోనిక, దివ్య మాట్లాడుతూ.. మా సినిమా అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది. విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో జరిగే కథలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. డైరెక్టర్ కు థాంక్స్. టీమ్ అందరూ సపోర్ట్ చేశారు. అని అన్నారు.టైటిల్ లోగోలో కనిపిస్తున్న బ్రోకెన్ హార్ట్ ఎమోజీని బట్టి ఈ చిత్రం యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్టు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీనటులు, ఇతర విశేషాలను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనుంది.

# బెంగళూరులో బాలక చిత్రం



బెంగళూరు మహానగరంలో బాలక చిత్రాన్ని రూపొందిస్తున్నారు.ఇటీవలే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మొదటి లుక్, కథానాయకుడు ప్రియదర్శి విడుదల చేశారు.. ఆంధ్ర కుర్రాడు బెంగళూరులో ఎదుర్కొనే కష్టాల నేపథ్యంతో వినోదభరితమైన కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది.నివేదా థామస్ వారి తమ్ముడు నిఖిల్ థామస్ నటిస్తున్న ఈ చిత్రానికి మల్లూ నాయక్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. విశ్వదీప్ సంగీతాన్ని అందిస్తున్నారు ,

# 'మేము కాప్'లం' 17 రోజుల్లో పూర్తి:

కిషోర్ బోయిడాపు



నాగబాబు ప్రధాన పాత్రలో ప్రదీప్ మద్దాలి తెరకెక్కించిన సిరీస్ 'మేము కాప్'లం' సిరీస్‌తో మన ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందు కుంటున్నారు. ఈ సిరీస్‌ను కేవలం 17 రోజు ల్లోనే తెరకెక్కించటంలో కీలక పాత్రను పోషించిన కిషోర్ బోయిడాపు తన సినీ ప్రయాణం విశేషలు.

**నేపథ్యం....** నా పూర్తి పేరు దుర్గ కిషోర్ కుమార్. మా ఫ్యామిలీ అంతా ఇండస్ట్రీలోనే ఉండటంతో సహజంగానే నాకు ఇంట్రెస్ట్ ఏర్పడి ఉంది. మా నాన్న గారు మమ్మల్ని ఫోటో తీసి.. ఆ ఫోటోలతోనే కథ చెప్పేవారు.

**సినీ ప్రయాణం....** 2002లో రవి ప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్‌గా కెరీర్ స్టార్ట్ చేశా. ఓ నాలుగేళ్ల తరువాత ముంబైకి వెళ్లాను. అక్కడ మొదటి ప్రాజెక్ట్‌గా స్లమ్‌డాగ్ మిలియనీర్‌కి కెమెరా డిపార్ట్మెంట్‌లో పని చేశాను. ఆ తరువాత ఇంగ్లీష్ సినిమాలకి కూడా వర్క్ చేశాను. ఈ జర్నీలో నేర్చుకున్న ప్రతి విషయం నాకు చాలా విలువైనది. థ్యాంక్స్ టు అనీల్ మెహతా. కోవిడ్ తర్వాత నాకు మై నేమ్ శృతి,105 మినిట్స్ వంటి సినిమాల్లో అవకాశం వచ్చినప్పుడు, నేను సార్‌తో మాట్లాడాను.

**సవాలుతో కూడుకున్నది....** సింగిల్ షాట్‌లో సినిమా తీయడం అనేది సవాల్‌తో కూడుకున్న పని. హన్సిక గారితో చేసిన 105 సింగిల్ కారెక్టర్‌తో, సింగిల్ షాట్‌తోనే మూవీని చేశాం.

**ఫిల్మ్ నుంచి డిజిటల్...**ఒకప్పుడు ఫిల్మ్‌తో షూట్ చేసేవారు. ఇప్పుడంతా డిజిటల్‌లోకి మారింది. ఇప్పుడు ఎన్ని టేకులు అయినా తీసుకుంటున్నాం.

**వారినే ఫాలో అవుతా....**సినిమాటోగ్రఫీలో ఒక్కొక్కరిది ఒక్కో స్టైల్. రవి వర్మన్ గారు, అనీల్ మెహతా గారు, సుదీప్ చటర్జీని నేను ఎక్కువగా ఫాలో అవుతుంటాను.

**..హాలీవుడ్‌కి, మనకి తేడా అదే....**
హాలీవుడ్ సినిమాల్లో కలర్ టోన్ ఎక్కువగా నేచురల్, సాఫ్ట్, మరియు సినిమాటిక్‌గా ఉంటుంది. వాళ్లు రియలిస్టిక్ లైటింగ్, కంట్రోల్డ్ కలరింగ్ ఉపయోగిస్తారు. ఇండియన్ సినిమాల్లో మాత్రం వైబ్రంట్ కలర్స్, రిచ్ స్కిన్ టోన్స్, ఎమోషనల్ లైటింగ్ ఎక్కువగా కనిపిస్తాయి. హాలీవుడ్‌లో వాడే కలర్ టోన్ వేరు. మన కథలు వేరు, మన కల్చర్ వేరు,

**17 రోజుల్లోనే షూట్...**'మేము'కాప్'లం'మొత్తం షూటింగ్‌ను కేవలం 17 రోజుల్లో పూర్తి చేశాం. మంచి ప్రీప్రొడక్షన్ ప్లానింగ్ వల్ల, అలాగే ప్రతి డిపార్ట్‌మెంట్ ఎంతో కష్టపడి పనిచేసినందువల్లే అది సాధ్యమైంది.

**ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్ట్‌లు..**
ప్రేమకు నమస్కారం రిలీజ్‌కు రెడీగా ఉంది. షణ్ముక్, శివాజీగారు, భూమికగారు ఇందులో నటించారు.

# నాలుగు జట్లలో ఛాంపియన్ ఎవరో?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ నాకౌట్ స్టేజ్‌కు చేరుకుంది. ప్లే ఆఫ్‌లో తలపడే నాలుగు జట్లు ఖరారయ్యాయి. ఒక్క క్వాలిఫయర్ మ్యాచ్‌లో తప్పిస్తే ఇక్కడ గెలిస్తేనే ముందుకు, ఓడితే ఇంటిముఖం. పుంజుకోవడానికి లీగ్ స్టేజ్‌లో మరో ఆప్షన్ ఉండదు. గత ఐపీఎల్‌లో ప్లే ఆఫ్ ఆడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్, గుజరాత్ టైటాన్స్ ఈసారి కూడా చేరుకున్నాయి. వీటితో పాటు కొత్తగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్‌కు వచ్చాయి. ముంబై, పంజాబ్ ఈసారి లీగ్ స్టేజ్‌లోనే నిష్క్రమించాయి. ఈసారి ఐపీఎల్ ఛాంపియన్ ఎవరనేది ఆసక్తి రేపుతోంది.




డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ ఈసీజన్‌లోనూ జోరు చూపింది. ఆరంభం నుంచి దుమ్మురేపింది. మధ్యమధ్యలో వచ్చిన ప్లేయర్ల సెంచరీల మోతతో మొత్తం 14 మ్యాచుల్లో తొమ్మిది విజయాలు సాధించిన ఆర్సీబీ (+0.783) మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో అగ్రస్థానం పొందింది. నేడు తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ తలపడనుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఇక్కడి వరకూ వచ్చింది. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ(563 రన్స్), దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్, టిమ్ డేవిడ్, వెంకటేశ్ అయ్యర్ కీలకం. స్వింగ్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్(24వికెట్లు), జోష్ హేజిల్‌వుడ్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యతో బౌలింగ్ వైవిధ్యంగా ఉంది.

గుజరాత్ టైటాన్స్ సైలెంట్ కిల్లర్‌గా ప్లే ఆఫ్ స్టేజ్‌కు వచ్చింది. ఈ సీజన్ తొలి దశలో తడబడినా.. రెండో దశలో అనూహ్యంగా వరుసగా అయిదు విజయాలతో నాకౌట్‌కు దూసుకొచ్చింది. తొలి ఏడు మ్యాచుల్లో మూడే విజయాలు కాగా.. మిగతా ఏడులో ఏకంగా ఆరింట్లో గెలుపొందింది. 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు సాధించి రెండో స్థానానికి చేరుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గుజరాత్ ప్రధాన బలం, జట్టును ముందుండి నడిపించాడు. శుభ్‌మన్ గిల్‌తో పాటు సాయి సుదర్శన్ అత్యంత కీలక ప్లేయర్. జోస్ బట్లర్, వాషింగ్టన్ సుందర్ కూడా చక్కగా మెరుపులు మెరిపించారు. గుజరాత్ పేస్ త్రయం మహ్మద్ సిరాజ్, కగిసో రబాడ, ప్రసిద్ధ్ కృష్ణ వికెట్ల వేటలో ఉన్నారు. స్టార్ ఆల్‌రౌండర్లు జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్ జీటీకి అదనపు బలం. కగిసో రబాడ (24) ప్రస్తుతం అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా కొనసాగుతున్నాడు.







సన్‌రైజింగ్ హైదరాబాద్ కూడా అనూహ్యంగా నాకౌట్‌కు చేరుకుంది. తొలుత ఇషాన్ కిషన్.. తర్వాత ప్యాట్ కమిన్స్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ అద్భుత విజయాలు అందుకుంది. పాంచ్ పటాకాతో సన్‌రైజర్స్... ఆర్సీబీ, గుజరాత్‌తో 18 పాయింట్లతో సమవుజ్జీగా నిలిచినా, నెట్‌రన్‌లో వెనకబడి మూడోస్థానంకు పరిమితమైంది. డేంజరస్ ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ చక్కని శుభారంభాలు అందించారు. ఆ తర్వాత వచ్చే ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ రెడ్డి సూపర్ ఫామ్‌తో పరుగులు సాధిస్తూ జట్టు విజయాలో కీరోల్ పోషించారు. ఎక్స్‌పీరియన్స్ కమిన్స్‌కు తోడుగా యువ బౌలింగ్ దళం నిలుస్తోంది. తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని చెలరేగారు. ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్, శివాంగ్ కుమార్, ఇషాన్ మలింగతో కూడిన బౌలింగ్ యూనిట్‌ను పేస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ నడిపిస్తున్నాడు.

ప్లే ఆఫ్స్ చివరి బెర్తు దక్కించుకున్న రాజస్థాన్ ప్రయాణం ఈ ఐపీఎల్‌లో పడుతూ లేస్తూ సాగింది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీద కనిపించిన ఈ జట్టు ఒక్కసారిగా గాడి తప్పింది. తర్వాత జరిగిన మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో లక్నో, ముంబైలను ఓడించి ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకుంది. 14 మ్యాచ్‌ల్లో 8 విజయాలు అందు కుంది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్‌కు కీలకం. చాలా మ్యాచ్‌ల్లో మెరుపు ఆరంభాలు ఇచ్చారు. వైభవ్ 583 పరుగులతో ఆరెంజ్ క్యాప్ రేసులో ఉన్నాడు. ధృవ్ జురెల్, కెప్టెన్ పరాగ్ అప్పుడప్పుడు భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతున్నారు. రాజస్థాన్ బౌలింగ్‌కు జోఫ్రా ఆర్చర్ వెన్నెముకలా నిలుస్తున్నాడు. 21 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ఉన్నాడు.







## వరుసగా నాలుగో ఫార్ములా వన్ ట్రోఫీ

**మాంట్రియల్:** ఫార్ములా వన్‌లో యువ సంచలనం 19 ఏళ్ల ఇటలీ రేసర్ కిమి అంటోనెల్లి దూసుకుపోతున్నాడు. తాజాగా కెనడా గ్రాండ్ ప్రిని ఖాతాలో వేసుకున్నాడు. ఇది అంటోనెల్లికి వరుసగా నాలుగో ఫార్ములా వన్ ట్రోఫీ. మెర్సిడెస్ డ్రైవర్ కిమి అంటోనెల్లి అగ్రస్థానంతో ముగించాడు. పోల్ పొజిషన్‌తో దూసుకుపోయిన అంటోనెల్లికి మెర్సిడేస్ సహచరుడు జార్జ్ రస్సెల్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నారు. ఇద్దరూ పోటీపోటీగా దూసుకుపోయారు. పలుమార్లు ఆధిక్యం మారుతూ వచ్చింది. ఒకరినొకరు ఢీ కొట్టేంత ప్రమాదకర స్థాయికి కూడా ఓ దశలో చేరుకున్నారు. 30వ ల్యాప్‌లో రస్సెల్ వెహికిల్ ఇంజిల్ వైఫల్యంతో రేసు నుండ వైదొలిగాడు. ఆ తర్వాత ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్, కిమి అంటోనెల్లి మధ్య పోరుగా మారింది. లూయిస్ హామిల్టన్ కంటే పది సెకన్ల ముందు రేస్ పూర్తి చేశాడు. కిమి అంటోనెల్లి ఫార్ములా ఛాంపియన్‌షిప్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించాడు. కాగా హామిల్టన్ రెండో స్థానంతో సరిపెట్టాడు. గత సంవత్సరం ఫెరారీలో చేరిన తర్వాత ఇది అతనికి అత్యుత్తమ ఫలితం. 22 ఫార్ములావన్ రేసులలో ఇప్పటివరకు ఐదు జరిగాయి. రస్సెల్‌పై అంటోనెల్లి 43 పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించాడు. ఆస్ట్రేలియాలో జరిగిన సీజన్ ప్రారంభ రేసులో రస్సెల్ గెలిచిన తర్వాత, ఆంటోనెల్లి చైనా, జపాన్, మయామి, ఇప్పుడు మాంట్రియల్‌లో కూడా గెలిచాడు.

## ఫ్రెంచ్ ఓపెన్‌లో నిశేష్ సంచలనం

**రోలాండ్‌గారోస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో భారతీయ మూలాలున్న నిశేష్ బసవరెడ్డి సంచలనం సృష్టించాడు. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన 21 ఏళ్ల నిశేష్(అమెరికా) ఏడో సీడ్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌పై 7-6, 7-6, 6-7, 6-1 తేడాతో విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. దీంతో నిశేష్ ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు.

నిశేష్ 2005 మే5న కాలిఫోర్నియాలో జన్మించాడు. సాయి ప్రసన్న, మురళీకృష్ణ అతడి తల్లి దండ్రులు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు స్వస్థలం. 1999లో అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. మాజీ డబుల్స్ ప్లేయర్ రాజీవ్ రామ్ వద్ద శిక్షణ పొందాడు. 2023లో ఐటీఎఫ్ జూనియర్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్3 స్థానానికి చేరుకున్నాడు. అలాగే ఏటీపీ ఛాలెంజర్ టూర్ 2024 సీజన్‌లోనూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చాడు. రెండు ఏటీపీ ఛాలెంజర్ టైటిళ్లు గెలిచి తన ముద్ర వేశాడు. 2025లో ఆస్ట్రేలియన్ ఓపెన్



ద్వారా గ్రాండ్ స్లామ్ అరంగేట్రం చేసిన నిషేష్.. తొలి మ్యాచ్‌లోనే దిగ్గజ ఆటగాడు జకోవిచ్‌పై తొలి సెట్ గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు ఫ్రెంచ్ ఓపెన్‌లో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించడం ద్వారా మరోసారి సత్తా చాటాడు.



## పద్మశ్రీ అవార్డు అందుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్

**న్యూఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టుకు తొలి ప్రపంచకప్ అందించిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారం పద్మశ్రీ అందుకుంది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా హర్మన్‌ప్రీత్ పద్మ శ్రీ అందుకున్నారు. హర్మన్ ప్రీత్ కౌర్‌తో పాటు విజయ్ అమృత్‌రాజ్(టెన్నిస్), బల్దేవ్ సింగ్ (హాకీ కోచ్), భగవాన్‌దాస్ రైక్వర్(రెజ్లింగ్), సవితా పూనియా(రెజ్లింగ్), పజనివెల్ (తమిళ మార్షల్ ఆర్ట్స్ సిలంబం), ప్రవీణ్ కుమార్(పారా హై జంపర్)లు కూడా పద్మశ్రీ అవార్డులు స్వీకరించారు. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును కేంద్రం ప్రకటించింది.

గత ఏడాది సొంతగడ్డపై భారత జట్టుకు వన్డే ప్రపంచకప్ అందించి హర్మన్‌ప్రీత్ చరిత్ర సృష్టించింది. 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమిండియాను విశ్వవిజేతగా నిలిపింది. దిగ్గజ కెప్టెన్లు డయానా ఎడుల్జి, శాంత రామస్వామి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్ వంటి వాళ్లకు సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకున్న కౌర్‌ను భారత ప్రభుత్వం పద్మ శ్రీతో సత్కరించింది.

## సెన్సెక్స్, నిఫ్టీలకు బడా కంపెనీల సపోర్ట్

# వారంలో లాభాల బోణీ




**ముంబై, మే 25:** ఈక్విటీ సూచీలు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగిపోతాయనే అంచనాల మధ్య సూచీలు లాభాల్లో కదలాడాయి. దాంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1100 పాయింట్ల వరకు పెరిగింది. సెన్సెక్స్ నేటి ట్రేడింగ్‌లో 76,135 వద్ద మొదలైంది. చివరకు 1,073 పాయింట్ల లాభంతో 76,488 వద్ద ముగిసింది. నిఫ్టీ 312 పాయింట్లు ఎగబాకి, 24 వేల పైన స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, లార్సెన్ షేర్లు రాణించాయి. మ్యాక్స్ హెల్త్ కేర్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, నెస్లే, బజాజ్ ఆటో స్టాక్స్ నష్టపోయాయి.

యుద్ధం ముగించే విషయమై అమెరికా - ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 5.58 శాతం తగ్గి, 97.76 డాలర్లకు వచ్చింది. చమురు ధరలు తగ్గడంతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. ఆయిల్ ధరల తగ్గుదల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని, వడ్డీ రేట్లలో స్థిరత్వం వస్తుందని మదుపర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయమార్కెట్లలోని సానుకూల సంకేతాలు కూడా నేటి లాభాలకు ఓ కారణంగా చెప్పవచ్చు. అమెరికా భారత్ మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించడం కూడా మార్కెట్లకు జోష్ ఇచ్చింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా 35 పైసల మేర కోలుకుంది. ప్రస్తుతం రూపీ విలువలు 95.25 వద్ద స్థిరపడింది. బిఎస్ఇలోమిడ్‌క్యాప్ 0.80శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 1.22శాతం పెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2703 కంపెనీల షేర్లుపెరిగితే 1607 కంపెనీల షేర్లు క్షీణించాయి. 237 షేర్లుమాత్రం స్థిరంగానే కదలాడాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.42శాతం పెరిగి రూ.1,59,350కి చేరింది కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ నెల సెటిల్‌మెంట్ ధరలు 5.76డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 97.78 డాలర్లుగా కొనసాగాయి.

## ఐదు వేల డాలర్లకు ఔన్స్ బంగారం!

**ముంబయి, మే 25:** పశ్చిమాసియా యుద్ధ మేఘాలు, కొలిక్కిరాని శాంతిఒప్పందం, డాలరుతో రూపాయి పెరుగుదలవంటి వాటితో రానున్న కాలంలో అంతర్జాతీయ మార్కెట్ బంగారం ధరలు ఔన్స్ ఒక్కొంటికి 4400 డాలర్ల నుంచి 4600 డాలర్ల వరకూ పెరగవచ్చని ఐసిఐసిఐ బ్యాంకు అంచనావేసింది. పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటినుంచి బంగారంధరల్లో 15శాతం మార్పులు చోటుచేసున్నాయి. అమెరికా ముడి చమురు ఎగుమతిదారుగా నిలిచి తమ చమురునే కొనాలని లేదంటే సుంకాలు తప్పవన్న హెచ్చరికలుచేస్తూ ఎగుమతులు పెంచుకుంటోంది. దీని వల్ల డాలర్ చెల్లింపులు కూడా పెరుగుతున్నాయి. అందువల్లనే ఇన్వెస్టర్లు స్వర్గధామంగా భావిస్తున్న బంగారంపై పెట్టుబడులకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ బంగారం విలువలు ఐదువేల డాలర్లకు చేరే అవకాశాలున్నాయని ఐసిఐసిఐబ్యాంకు రీసెర్చి విభాగం అంచనావేసింది. ధరలు 4800 డాలర్ల నుంచి 5వేల డాలర్లకు డిసెంబరు చివరికి పెరుగుతాయని, 2027 చివరినాటికి ఔన్స్ ఒక్కొంటికి 5400 నుంచి 5600 డాలర్లకు పెరిగినా ఆశ్చర్యంలేదని అన్నారు. అయితే సెంట్రల్ బ్యాంకుల



పాలసీ విధానంలో కఠిన వైఖరి అవలంభించడం, అమెరికా ఫెడ్‌రిజర్వుధోరణులకు తోడు డాలర్ పెరుగుదలను ముందుగానే అంచనావేసి క్షీణతను కట్టడిచేసేందుకు భారత్ సర్కారు ప్రత్నించవచ్చని నిపుణులు చెపుతున్నారు. బ్యాంకు అంచనాలప్రకారం బంగారంధరలు పది గ్రాములు రూ.1.5 లక్షల నుంచి రూ.1.8 లక్షల వరకూ ఉంటుందని అలాగే ఆ తర్వాత క్రమేపీ రూ.1.6 లక్షలనుంచి రూ.1.9 లక్షలరకు చేరినా ఆశ్చర్యంలేదని అన్నారు. కేవలం డాలర్ పటిష్టం కావడం, రూపాయి విలువలు తగ్గడంవల్లనే ఈ ధరల్లో తేడాపెరుగుతున్నట్లు బ్యాంకు విశ్లేషకులు ంచనావేసారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్ పసిడి దిగుమతులు 81శాతంగా ఉంటాయని ఐసిఐసిఐబ్యాంకు అంచనావేసింది.

## నిర్వహణ వ్యయం పెరగడంతో సొంత టూల్స్‌వైపు మైక్రోసాఫ్ట్

**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 25:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవం ఒకవైపు కొత్త అవకాశాలు సృష్టిస్తుంటే, మరోవైపు నిర్వహణ ఖర్చులు టెక్ దిగ్గజాలకు పెనుభారంగా మారుతున్నాయి. చెందిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మార్పులుచేసింది. ఏఐ వాడకం వల్ల కంప్యూటింగ్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతుండటంతో తమ ఉద్యోగులకు ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ కోడ్ ఏఐ టూల్ యాక్సెస్‌ను క్రమంగా తగ్గిస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా తమ సొంత ప్లాట్‌ఫామ్ అయిన గిట్‌హబ్ కోపైలట్ సీఎల్ఐని వినియోగించేలా ఇంజినీర్లను ప్రోత్సహిస్తోంది.




కొంతకాలం క్రితం ఏఐ ఆధారిత కోడింగ్ టూల్స్‌పై ప్రయోగాలను ప్రోత్సహించేందుకు మైక్రోసాఫ్ట్ వేలాది మంది డెవలపర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లు, డిజైనర్లకు క్లాడ్ కోడ్ యాక్సెస్‌ను విస్తృతంగా కల్పించింది. ఉద్యోగుల నుంచి దీని వాడకం అనూహ్యంగా పెరగడంతో సంస్థ కార్యాచరణ వ్యయాలు భారీగా పెరిగాయి. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ టోకెన్ ఆధారిత ధరల విధానాన్ని అనుసరిస్తాయి. ఏఐ సిస్టమ్ ప్రాసెస్ చేసే, జెనరేట్ చేసే టెక్స్ట్ పరిమాణం ఆధారంగా కంపెనీలు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే ఖర్చుల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. ఈ సమస్య కేవలం మైక్రోసాఫ్ట్‌కే పరిమితం కాలేదు. పలు టెక్ కంపెనీలు ఇదే తరహా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు ప్రముఖ రైడ్ షేరింగ్ సంస్థ ఉబెర్ ఏఐ కోడింగ్ టూల్స్ కోసం కేటాయించిన 2026 బడ్జెట్‌ను ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే పూర్తిగా వినియోగించినట్లు ఆ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నెప్పల్లి నాగ వెల్లడించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భవిష్యత్తులో ఏజెంటిక్ ఏఐ సిస్టమ్స్ వాడకం పెరిగితే టోకెన్ల వినియోగం మరింత భారీగా పెరుగుతుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఏఐ మోడల్స్ నిర్వహణ ఖర్చు కాలక్రమేణా తగ్గినా, కొత్తతరం ఏజెంటిక్ సిస్టమ్స్ ప్రతి పనికి ఎక్కువ టోకెన్లు వినియోగించడం వల్ల సంస్థల మొత్తం ఏఐ వ్యయం పెరుగుతుందని రీసెర్చ్ సంస్థ గార్ట్‌నర్ పేర్కొంది.

క్లాడ్ కోడ్ యాక్సెస్‌ను తగ్గించినప్పటికీ, ఆంత్రోపిక్‌తో మైక్రోసాఫ్ట్ కుదుర్చుకున్న మల్టీబిలియన్ డాలర్ల ఫౌండ్రీ ఒప్పందం వంటి ప్రధాన భాగస్వామ్యాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొంది. అజూర్ క్లౌడ్ సేవల ద్వారా ఆంత్రోపిక్ మోడల్స్‌కు యాక్సెస్ కూడా అందుబాటులో ఉంటుంది.

ఏఐ వైపు వేగంగా అడుగులు వేసేందుకు మెటా, ఒరాకిల్, క్లౌడ్‌ఫ్లేర్ వంటి సంస్థలు ఇటీవల పునర్వ్యవస్థీకరణ చర్యలు, ఉద్యోగ కోతలను ప్రకటించడం గమనార్హం.




## క్షీణించిన సుజ్లాన్ ఎనర్జీ నికరలాభం

# రాబడుల్లో 45 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మే 25: సుజ్లాన్ ఎనర్జీ నికర లాభం నాలుగో త్రైమాసికంలో 5.8 శాతం క్షీణించింది. కంపెనీ రూ.1182 కోట్ల నుంచి క్షీణించి రూ.1114 కోట్లు మాత్రమే లాభాలు ఆర్జించినట్లు ఎక్స్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. రాబడులపరంగా అయితే పెరిగింది. 45శాతం పెరిగి రూ.3790 కోట్ల నుంచి రూ.5494 కోట్లకు పెరిగినట్లు తేలింది. కంపెనీ ఎబిడిటా కూడా 39శాతం పెరిగి రూ.694 కోట్లనుంచి రూ.965కోట్లకు పెరిగింది. ఎబిడిటా మార్జిన్ కూడా 18.3శాతం నుంచి 17.6 శాతానికి తగ్గింది. సుజ్లాన్ ఎనర్జీ స్టాక్ 1.21శాతం క్షీణించి రూ.53.10కి చేరాయి.

ఎన్ఎస్ఇలో నిఫ్టీ సూచీలో ట్రేడింగ్ ముగింపునకు ముందు 1.4శాతం ముందుకు కదిలినట్లు తేలింది. మొత్తం 12మంది మార్కెట్ విశ్లేషకుల్లో 11 మంది కంపెనీ షేర్లు కొనుగోలు చేసుకోవచ్చని సిఫారసులు చేసారు. అయితే కంపెనీ స్టాక్ మాత్రం గడచిన 12 నెలల్లో 14శాతం పతనం అయింది. కంపెనీకి పన్ను బెనిఫిట్ కింద వచ్చే ప్రయోజనం కూడా గత ఏడాది కంటే తగ్గింది.

గత ఏడాది ఇదేకాలంలో రూ.600.75 కోట్లు వచ్చిన కంపెనీకి ఈ త్రైమాసికంలో 284.32 కోట్లుమాత్రమే వచ్చాయి. కంపెనీ వైస్‌చైర్మన్ గిరీష్ తంతి మాట్లాడుతూ కంపెనీ ఇప్పటికే 9 గిగావాట్ల ఆర్డరు చేజిక్కించుకుందని తెలిపారు. ఈఏడాదిలో ఇప్పటివరకూ 2.5గిగావాట్లను పంపిణీచేసినట్లు కంపెనీ సిఇఒ అజయ్ కపూర్ తెలిపారు. ఇప్పటికే ఆర్డర్ బుక్ 5.9 గిగావాట్లవరకూ ఉందని, ఇందులో 66 శాతం ప్రభుత్వరంగం, వాణిజ్య, పారిశ్రామిక రంగాల నుంచి వస్తోందని వివరించారు. కంపెనీకి మార్చి 31వతేదీనాటికి నగదు నిల్వలూ ఆరోగ్యకరంగా ఉన్నాయని రూ.2384 కోట్లు నిల్వలున్నట్లు సీఎఫ్‌వో రాహుల్‌జైన్ తెలిపారు.

## పసిడి, వెండి ఈటిఎఫ్‌లకు డిమాండ్

**ముంబయి, మే 25:** ముడిచమురుధరలు తగ్గుతుండటం బులియన్ మార్కెట్‌లో సెంటిమెంట్‌ను పెంచింది. పసిడి, వెండి ఈటిఎఫ్‌లు సోమవారం ట్రేడింగ్‌లో గరిష్టాన్ని తాకాయి. ఎంసిక్స్‌లో కూడా ధరలు పెరిగినట్లు తేలింది. గోల్డ్ ఈటిఎఫ్‌లలో నిప్పన్ ఇండియా ఈటిఎఫ్‌గోల్డ్ బిఇఇఎస్ (గోల్డ్‌బీస్) రూ.130.60వద్ద ఎన్ఎస్ఇలో ముగిసింది. ఎస్‌బిఐ గోల్డ్ ఈటిఎఫ్ కూడా రూ.134.70వద్దట్రేడ్ అయింది. హెచ్‌డిఎఫ్‌సి గోల్డ్ ఈటిఎఫ్ 0.10 పాయింట్లుపెరిగి రూ.134.90వద్ద ముగిసింది. ఇక కోటక్ గోల్డ్ ఈటిఎఫ్‌లు రూ.131.5486 వద్ద ముగిసింది. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ గోల్డ్ ఇటిఎఫ్ రూ.135.20 వద్దట్రేడ్ అయింది. ఇక సిల్వర్ ఈటిఎఫ్‌లయితే గోల్డ్ ఇటిఎఫ్‌లను మించిపోయాయి. నిప్పన్ ఇండియా సిల్వర్ ఈటిఎఫ్ 1.46శాతంపెరిగి రూ.256.22గా ఎన్ఎస్ఇలో ట్రేడ్ అయింది. టాటా సిల్వర్ ఇటిఎఫ్ కూడా 0.40పాయింట్లు పెరిగి రూ.26.02కి చేరింది. హెచ్‌డిఎఫ్‌సి సిల్వర్ ఈటిఎఫ్ 3.83పాయింట్లు పెరిగి రూ.256.50కి చేరింది. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటిఎఫ్ కూడా 3.82 పాయింట్లు పెరిగి రూ.267.50 పాయింట్లకు చేరితే ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ సిల్వర్‌ఇటిఎఫ్ 3.93పాయింట్లు పెరిగి రూ.267.35కి చేరుకుంది. ముడిచమురుధరలు కొంతమేర తగ్గుముఖం పట్టడం, ద్రవ్యోల్బణ ఆందోళనలు లేకపోవడం వంటివి పెట్టుబడులకు స్వర్గధామంగా పసిడి, వెండి రంగాలే నిలిచాయి. ఇపుడు ఈటిఎఫ్‌లకు కూడా భారీగా డిమాండ్ పెరుగుతోంది.






## టాటాసన్స్ బోర్డు మీట్‌పై కార్పొరేట్ రంగం ఫోకస్

**ముంబయి, మే 25:** దిగ్గజ పారిశ్రామికగ్రూపు టాటాసన్స్ బోర్డుసమావేశంపైనే ఇపుడు ఇన్వెస్టర్లు, మార్కెట్‌నిపుణుల ఫోకస్ పెరిగింది. మంగళవారం టాటాసన్స్ బోర్డు సమావేశం జరగనున్నది. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్‌వరకూ విస్తరించిన టాటాగ్రూప్‌లో ఇపుడు అంతర్యుద్ధం జరుగుతోందన్నది నిపుణుల వాదన. దివంగత రతన్‌టాటా ప్రస్తుతం టాటా ట్రస్టుల ఛైర్మన్‌గా ఉన్నారు. 2024 అక్టోబరు నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. టాటాట్రస్టులకే 66శాతం వాటాలు టాటాసన్స్‌లో ఉన్నాయి. బోర్డు సభ్యుల్లో మూడోవంతు సభ్యులను నియమించే అధికారాలు నోయల్ టాటాకు ఉన్నాయి. ఇపుడున్న సమావేశంలో టాటాసన్స్ సిఇఒ ఎన్‌చంద్రశేఖరన్‌పదవీకాలం పొడిగిస్తారా లేదా అన్నదే చర్చ నడుస్తోంది. 2017నుంచి టాటాసన్స్ ఛైర్మన్‌గా ఉన్న చంద్రశేఖరన్‌కు ఒకసారి పొడిగించారు. రెండోసారి పొడిగింపు అవసరం అవుతోంది. అయితే దీనిపై నోయల్‌టాటా స్పందన లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరితో చంద్రశేకరన్ పదవీకాలం పూర్తవుతుంది. అలాగే టాటాసన్స్ ప్రైవేటు సంస్థగా కొనసాగించాలా లేక స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్టింగా అన్నది తేలాల్సివుంది. టాటాసన్స్ అన్‌లిస్టింగ్‌కే నోయల్ టాటా ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే టాటా గ్రూప్‌నుంచి ఇప్పటివరకూ ఎలాంటి ఐపిఒ వార్తలు కూడా ఈ ఏడాది రాలేదు. వీటన్నింటి దృష్ట్యా నేడు జరిగే టాటా సన్స్ బోర్డు సమావేశం అత్యంత కీలకంగా మారుతోంది. నాయకత్వమార్పులు ఏమైనా ఉండవచ్చున్న ఉత్కంఠ వాటాదారుల్లో నలుగుతోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.